13-1Pg1exHMNWJQE.qxd:13-1Pg1exHMNWJQE.qxd 01/01/01 9:50 AM Page 1


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
fb.com/vaartha
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-1-2025 సోమవారం సంపుటి: 30 సంచిక: 346 పేజీలు: 12 వెల: 6.50

అటు కార్చిచ్చు.. ఇటు మంచు తుఫాను 9లో

ఢిల్లీ ఎన్నికల్లో అజిత్ ఎన్సీపి పోటీ

## స్పేడెక్స్ మిషన్లు డాకింగ్‌కు సిద్ధం
### రెండు ఉపగ్రహాల అనుసంధానానికి యత్నం



**శ్రీహరికోట (తడ), జనవరి 12 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ షార్ నుంచి పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్ ద్వారా గత నెల 30న ప్రయోగించిన స్పేడెక్స్ ఉపగ్ర హాలు మెల్లగా డాకింగ్‌కు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 7వ తేదీన డాకింగ్ ప్రక్రియకు షార్ శాస్త్రవేత్తలు నిర్ణయించినప్పటికీ, పలు కార ణాల వలన 9వ తేదీకి వాయిదా పడింది. అనంతరం 9వ తేదీ కూడా డాకింగ్ ప్రక్రియ జరగ లేదు. ఈ నేపథ్యంలో ఇస్రో ప్రయోగిం చిన స్పేడెక్స్ మిషన్‌లోని రెండు ఉపగ్రహాలు ఒకదానికి ఒకటి అనుసంధానం కావడానికి దగ్గరకు చేర్చే పనుల్లో ఇస్రో నిమగ్నమై ఉంది. ఇప్పటికే స్పేడెక్స్ మిషన్లు రెండింటి మధ్య దూరాన్ని 15 మీటర్లకు, అనంతరం 3 మీటర్ల దగ్గకు చేర్చే ప్రయత్నాలను ఇస్రో చేపడుతుంది.

## రిపబ్లిక్‌డే వేడుకలకు చీఫ్ గెస్ట్‌గా ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో



**న్యూఢిల్లీ, జనవరి 12:** గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఈసారి ముఖ్య అతిథిగా ఇండోనేసియా అధ్యక్షుడు ప్రోబోవో సుబియాంటోను ఆహ్వానించింది. 73 ఏళ్ల మాజీ ఆర్మీజనరల్ సుబియాంటో 2024 అక్టోబరులో ఇండోనేసియా అధ్య క్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈపర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధానిమోడీతో విస్తృత చర్చలుజరిపే అవకాశం ఉన్నట్లు సంబందిత వర్గాల అంచనా. దీనిపై అధికారిక ప్రకటన జారీచేయాల్సి ఉంది. గత ఏడాది ప్రబోవో ప్రధానిమోడీకి ఫోన్‌చేసి ఇరుదేశాలమధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతంచేసే మార్గాలపై చర్చించారు. నవంబరులో బ్రెజిల్‌లోని రియోడిజెనీరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రబోవో >>2

# రాజధాని పనులకు 55 టెండర్లు

### రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు
### ఉన్నతస్థానాల్లోనివారు అట్టడుగున ఉన్న 10 శాతం మందిని పైకి తేవాలి
### గ్రీన్ ఎనర్జీ రూపంలో 10 లక్షల కోట్ల పెట్టుబడులు రాక
### సచివాలయాల సిబ్బందిలో మార్పులు: ముఖ్యమంత్రి



**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్త ప్రతినిధి:** రాబోయే అయిదేళ్లలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయని సిఎం చంద్ర బాబు స్పష్టం చేసారు.ఆయన ఆదివారం తిరుపతి ప్రయాణానికి ముందు ఉండవల్లిలో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. తెలుగు ప్రజలందరికీ ఎపి ముఖ్య మంత్రి చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పీ4 విధానం ద్వారా సమాజంలో ఆర్థి కంగా ఉన్నత స్థానంలో ఉన్నవారు ఆర్థికంగా అట్ట డుగున ఉన్న 10 శాతం మందిని పైకి తీసుకు వచ్చేందుకు సహాయం చేయాలన్నారు. ప్రపంచ బ్యాంకు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నిధు లతో చేపడుతున్న రాజధాని పనులకు సంబంధించి మొత్తం 55 టెండర్లు పిలవాలని సిఆర్‌డిఎ నిర్ణయించింది. వీటిలో సివిల్ వర్కులకు సంబం ధించినవే ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించి ఇప్పటికే 28 టెండర్లను పిలిచారు. ఇంటీరియర్‌కు పనులకు సంబంధించిన టెండర్ల విషయంలో కాంట్రాక్టర్లతో చర్చలు జరుపుతున్నామని, ప్రభుత్వంతో సంప్రదించిన తరువాత వాటిని ఖరారు చేస్తామని సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు. ఈ టెండర్లపై ప్రపంచబ్యాంకు ప్రతినిధులుతో సీఆర్‌డిఏ సమీక్ష నిర్వహించారు.

ఇప్పటి వరకూ సుమారు రూ.5000 కోట్ల విలు వైన పనులకు టెండర్లను పిలిచామని చెప్పినట్లు సమాచారం. ప్రతి టెండర్‌కూ ఒక కన్సల్టెన్సీని నియ మించాల్సిన అంశంపైనా ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ప్రశ్నించగా, ఇప్పటికే కన్సల్టెంట్ల నియమాకాన్ని ఖరారు చేశామని అధికారులు వివరించినట్లు సమాచారం. నిధుల జమకు సంబం ధించిన అంశంపైనా అధికారులు, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు చర్చించారు. టెండర్లు వివరాలను పరిశీలించిన అధికారులు నిధులను సిఆర్‌డిఎకు బదిలీ చేసే అవకాశం ఉందని తెలిసింది. సంక్రాంతి పండుగలోపు ఈప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు.

**కరకట్ట విస్తరణ పనులపై సమీక్ష**

అమరావతికి కీలకమైన కరకట్ట విస్తరణ పనుల పైనా అధికారులు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న కరకట్టను నాలుగులైన్లుగా విస్తరించాల్సిన అంశంపై ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ చర్చించినట్లు తెలిసింది. ఉద్దండ్రాయునిపాలెం వైపు నుండి పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే విస్తరణ అంశంలో ప్రస్తుతం జాతీయ రహదారి వద్ద కరకట్ట ఎత్తు సరిపోయినంతగా లేకపోవడంతో అదో సమస్యగా ముందుకు వచ్చి నట్లు తెలిసింది. వెంకటపాలెం పరిధిలో విస్తరణకు సంబంధించిన సాంకేతిక సమస్యలపై స్పష్టత కోసం ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. ఇక్కడ జాతీయ రహదారి దిగువన కరకట్ట ఎత్తు తగ్గించడమా లేక దానికి సమాంతరంగా మరొక కరకట్టను నిర్మించాలనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది. గ్రీన్ ట్రిబ్యునల్‌తో ముడిపడిన అంశం కావడంతో అధికారులు కొంత తటపటాయిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుండి గ్రీన్ సిగల్ వస్తే జాతీయ రహదారికి దిగువన సమాంతరంగా మరొక కరకట్టను నిర్మించి ప్రస్తుతం ఉన్న దాన్ని రహదారిగా మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టేకో >>2



### 40 కోట్ల మంది భక్తులు హాజరయ్యే
## మహా కుంభమేళా నేటినుండి ఆరంభం
### 144 యేళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా సమ్మేళనానికి ప్రయాగ్‌రాజ్‌లో భారీ ఏర్పాట్లు
### గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో 45 రోజులు జరిగే మహోత్సవం
### దాదాపు నాలుగువేల హెక్టార్లలో భక్తులకు ఏర్పాట్లు చేసిన యుపి సర్కార్

**ప్రయాగరాజ్, జనవరి 12:** ప్రపంచ ఆధ్యాత్మిక పండుగకు సర్వంసిద్ధం అయింది. 45రోజులపాటు ప్రయాగరాజ్‌లోని ప్రముఖ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి తరించేందుకు దేశవిదే శాలనుంచి భక్తులు, పర్యాటకులు, యాత్రీకులు మొత్తం హాజరవుతున్నారు. ఇప్పటికే ప్రయాగ రాజ్‌లో ఆధ్మాతిక శోభ నిండిపోయింది. 144 ఏళ్ల కొకసారి వచ్చే ఈ పవిత్ర సమ్మేళనం ఈసారి యుపి ప్రభుత్వం అత్యంతప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లుచేసింది. సుమారుగా రెండులక్షల >>2



## పండుగ వేళ.. జోరుగా పై'వేటు'
### విజయవాడ-విశాఖ బస్ టిక్కెట్ రూ. 4 వేలు
### ఆర్టీసి అదనపు బస్సులు సైతం కిటకిట

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్రాంతి పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సొంత ఊళ్లకు తరలివెళ్లే ప్రయాణికులకు రవాణా చార్జీల భారం భరించలేనిదిగా ఉంది.కీలకంగా ప్రైవేటు ట్రావెలర్లు సర్వీసులు ఛార్జీలు పరంగా ప్రయాణీకుల దోచుకుంటున్నాయి. విజయవాడ నుంచి విశాఖపట్నానికి సాధారణ రోజుల్లో ఏసీ స్లీపర్‌లో ఒక్కో టికట్ ధర రూ.1000-1200. కొన్ని బస్సుల్లో రూ.1500 తీసుకుంటారు. సంక్రాంతి రద్దీ దృష్టిలో పెట్టుకొని కొన్ని ప్రైవటే ట్రావెల్స్ ఏకంగా రూ.4 వేలు వసూలు చేస్తు న్నాయి. పైగా ఆన్‌లైన్‌లోనూ ఆ ధరలు ప్రదర్శిస్తు న్నాయి. తనిఖీలు చేయాల్సిన రవాణా శాఖ అధికారులకు ఆదేమీ పట్టడంలేదు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ బాహాటంగానే జరిగిపోతోంది. విజయవాడ నుంచి కాకినాడ, అమలాపురం, నెల్లూరు, తదితర ప్రాంతాలకూ ఇదేవిధంగా అధిక చార్జీలు బాదేస్తున్నారు. ఆర్టీసీ బస్సులన్నీ కిటకిట లాడుతున్నాయి. రెగ్యులర్ సర్వీసులకు తోడు పండుగ కోసం ఆర్టీసీ 3900 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వీటిలో హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వచ్చేవారి కోసం 2400 ప్రత్యేక బస్సులు వేసింది.

విజయవాడ నుంచి ఊళ్లకు వెళ్లే వారి కోసం అదనంగా 120 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. బెంగుళూరు నుంచి 375 చెన్నై నుంచి 42 ప్రత్యేక బస్సులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తిరుగు తున్నాయి. విజయవాడ బస్టాండ్‌లో 50 బస్సులు అదనంగా అందుబాటులో ఉంచారు. పండుగ ప్రత్యేకబస్సులపై ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావు శుక్రవారం ఈడీలతో సమీక్షించారు. ప్రయాణికులంతా గమ్యస్థానాలకు చేరేలా అవస రమైన బస్సులు నడపాలని ఆదేశించారు. సంక్రాంతి ప్రయాణికులతో రైళ్లన్నీ కిటకిటలాడు తున్నాయి. హైదరాబాద్ వైపు నుంచి ఎపి వైపువచ్చే రైళ్లు రద్దీగాఉన్నాయి. సాధారణ >>2




## అందుబాటులోకి పశ్చిమ బైపాస్
### విజయవాడలో తగ్గిన ట్రాఫిక్

**విజయవాడ,జనవరి 11,ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్రాంతి పండుగ వేళ విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారి ప్రయాణీకులకు ఎంతో ఉప యుక్తంగా మారింది. హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలతో ఏటా విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. కొత్త మార్గం అందుబాటులోకిరావడంతోగన్నవరం, ఏలూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను విజయవాడలోకి రానీయకుండా పోలీసులు గొల్లపూడి వెస్ట్ బైపాస్ వద్దే దారి మళ్లిస్తున్నారు. ఈ బైపాస్ చిన్న అవుటపల్లి వద్ద మళ్లీ కలుస్తుంది. దారి మళ్లింపుతో దాదాపు 30 కి.మీల వరకు దూరం తగ్గిందని, ఇంధనం ఆదా అవుతోందని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి దాకా వాహనాలు విజయవాడ నగరం గుండా వెళ్తున్నందున ట్రాఫిక్ రద్దీ వేళల్లో ఒక్కోసారి 2-3 గంటల సమయం పట్టేదని, ఆ కష్టాలు తీరాయని ప్రయాణీకులు చెబుతున్నారు.



## హెచ్చరికలు బేఖాతర్! 'పుంజు'లే మహారాజులు
### బరుల్లో కాలుదువ్వుతున్న పందెం కోళ్లు
### ఉభయగోదావరి దాటి అన్ని జిల్లాలకు విస్తరించిన కోడి పందాలు
### పోలీసులు ధ్వంసం చేసినా మళ్లీ పుట్టుకొస్తున్న బరులు

**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కోడి పందేలకు జోరు పెరిగింది. సంక్రాంతి పండుగ కోసం చాటు మాటుగా కోడి పందేలకు బరులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతు న్నారు. సంక్రాంతి పండగ సమీపించిన నేపథ్యంలో కోడి పందేల నిర్వాహ కులు బరులు సిద్ధం చేసుకుంటున్నారు. సంక్రాంతి వేళ బరుల్లో కాలు దువ్వేందుకు కోడి పుంజులు సిద్ధమయ్యాయి. ఏటా కోట్లలో చేతులు మారే ఈ పందేల కోసం శ్రద్ధ తీసుకుని మరీ పుంజులను పెంచుతారు. ప్రత్యేక ఆహారం, శిక్షణ సరేసరి. పోలీసుల హెచ్చరికలు ఉన్నా సంక్రాంతి అంటే కోడిపందాలే అనేలా ఈసారీ పుంజులను పెంపకందారులు సిద్ధం చేశారు.

సంక్రాంతి అంటే ముందుగా గుర్తొచ్చేవి గోదావరి జిల్లాలే. ముఖ్యంగా కోడి పందేల హడావుడే ఎక్కువ. అందుకే డిమాండ్ దృష్ట్యా పందెం కోళ్ల పెంపకం ఏటికేడు పెరుగుతూ వస్తోంది. స్థానికుల కన్నా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారే ఎక్కువగా పందేల్లో పాల్గొనడం, వేలు, లక్షల్లో పందేలు వేస్తుండటంతో పండుగ రోజుల్లో వందల కోట్ల రూపాయలు చేతులు మారతాయి. దీంతో పందేల్లో ప్రధానమైన కోడి పుంజులను ప్రత్యేక శ్రద్ధతీసుకుని మరీ పెంచుతు న్నారు. పందేలు నిర్వహించడానికి వీల్లేదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలుఉన్నాయి. పోలీసులుకూడా పందేలు ఏర్పాటుచేస్తే చర్యలు తీసు కుంటామని హెచ్చరికలు జారీ చేశారు. గతంలో నిందితులుగా ఉన్నవారిని బైండోవర్ చేశారు. కానీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చివరిలో చేతులెత్తేస్తు న్నారు.గతంలో కోడి పందేలుకు ఎక్కువ ఉభయగోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో అక్కడక్కడ కన్పించేవి.గత కొన్నేళ్లు ఇవి >>2

UDGAM - Unclaimed Deposits Gateway To Access inforMation

మీ బ్యాంక్‌లో 10 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నుండి క్లెయిమ్ చేయకుండా పడి ఉన్న మీ డబ్బుని మళ్ళీ ఉపయోగపరచుకోండి.



UDGAM లో దాన్ని కనుగొని బ్యాంక్ నుండి దాన్ని ఎలా పొందాలో తెలుసుకోండి.

- UDGAM పోర్టల్‌పై నమోదు చేసుకోండి.
- ఖాతాదారుని పేరు, బ్యాంక్(ల) పేరు మరియు జన్మదినం, ప్యాన్ కార్డ్ మొదలైనటువంటి వివరాలను ఉపయోగించి వెతకండి.

https://udgam.rbi.org.in పై మీ డబ్బుని క్లెయిమ్ చేసుకోండి




UDGAM అనేది ఒక అన్వేషణ సౌకర్యం మాత్రమే. క్లెయిమ్ చేయబడని డిపాజిట్లను ఆయా బ్యాంక్(ల) నుండే క్లెయిమ్ చేసుకోవలసి ఉంటుంది.

UDGAM పోర్టల్‌పై బ్యాంక్‌ల జాబితా లభిస్తుంది.

మరిన్ని వివరాల కొరకు https://rbikehtahai.rbi.org.in/ud సందర్శించండి
ఈ సందేశంపై అభిప్రాయం కోసం, rbikehtahai@rbi.org.inకి వ్రాయండి

జనహితానికై జారీ చేయునది
భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

13-1pg2exHMNWJQE.qxd:13-1pg2exHMNWJQE.qxd 01/01/01 9:47 AM Page 1





ఆదివారం అహ్మదాబాద్‌లో అపూర్వంగా సాగిన అంతర్జాతీయ పతంగుల పండుగ దృశ్యం

# పనులకు 55 టెండర్లు

>> వర్ చేస్తుందని సిఎం చంద్రబాబు మరో పర్యాయం స్పష్టం చేసారుజ అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ తయారవుతుందన్నారు. ఉత్పత్తయ్యే హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని తెలిపారు. హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని, గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టేకోవర్ చేస్తుందని అన్నారు. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రీన్ ఎనర్జీ రూపంలో రానున్నాయని సిఎం చంద్రబాబు తెలిపారు. సచివాలయ వ్యవస్థ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం చంద్రబాబు పనురుద్ఘాటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 11,162 గ్రామసచివాలయాలు, 3,842 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 1,27,175 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి సచివాలయంలో కనీసం 10 మంది సిబ్బంది ఉండేవిధంగా గత ప్రభుత్వం వీటిని రూపొందించింది. అయితే, కొన్ని చోట్ల పదిమంది కన్నా ఎక్కువగా, మరికొన్ని చోట్ల నలుగురి నుండి ఆరుగురు వరకు సిబ్బందితో సచివాలయాలు పని చేస్తున్నాయి. ఇలా ఎక్కువ, తక్కువ ఉన్న సిబ్బందిని క్రమబద్ధీకరించడంతో పాటు, ఒక్కో సచివాలయానికి ఉండాల్సిన కనీస సిబ్బంది అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. సిబ్బంది క్రమబద్ధీకరణ, సచివాలయాల సంఖ్య కుదింపు తరువాత అదనంగా తేలిన సిబ్బందిని ఇతర శాఖలకు బదిలీ చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

**క్రమబద్ధీకరణ ఇలా..**

క్రమబద్ధీకరణలో భాగంగా సిబ్బందిని బహుళ ప్రయోజనాలు (మల్టీపర్పస్ ఫంక్షనరీస్) సాంకేతిక సిబ్బందిగా టెక్నికల్ ఫంక్షనరీస్‌గా విభజించను న్నారు. 2,500 మంది లోపు జనాభాకు ఇద్దరు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ సిబ్బంది కలిపి ఆరుగురిని గరిష్టంగా ఉంచాలని నిర్ణయించారు. 2,500 నుండి 3,500 జనాభా ఉన్న సచివాలయాలకు ముగ్గురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ సిబ్బంది, 3,501 నుండి ఆపైన జనాభా ఉన్న సచివాలయాలకు నలుగురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ సిబ్బంది కలిపి ఎనిమిదిమందిని గరిష్టంగా ఉంచనున్నారు.

రాష్ట్రంలో 2.500 లోపు జనాభాతో ప్రస్తుతం 3.562 సచివాలయాలు, 2,500 నుండి 3,500 వరకు జనాభాతో 5,388 సచివాలయాలు, అంతకుపైన జనాభాతో 6,053 సచివాలయాలు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఈ మేరకు సిబ్బందిని సర్దుబాటు చేయాలన్న అధికారుల ప్రతిపాదనకు సిఎం గ్రీన్ సిగల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈనెల 17న క్యాబినెట్ సమావేశంలో ఈమేరకు తుది నిర్ణయంతీసుకోనున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆస్పిరేషనల్ సెక్రటరీగా ఒకరిని నియమించాలని సూచించారు. వీరి ద్వారా ఎఐ, డ్రోన్ టెక్నాలజిని గ్రామాల్లోకి తీసుకుపోవాలని చెప్పారు. సచివాలయాల సిబ్బందికి గూగుల్, మైక్రోసాఫ్ట్ సంస్థలతో సాంకేతిక శిక్షణ అందించాలని, అన్ని గ్రామ వార్డు సచివాలయాలకు బ్యాండ్ విడ్త్‌తో వైఫైని అందించాలని అన్నారు. జిల్లా మండలం/ యుఎల్‌బి, సెక్రటేరియట్లలో జిఎస్‌డబ్ల్యుఎస్‌కు ప్రత్యేకమైన అడ్మినిస్ట్రేటివ్ సెటప్3 టైర్ విధానాన్ని అమలు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు.

# ఫెర్టిలైజర్స్, ఎలక్ట్రానిక్స్‌లో రూ. 4వేల కోట్ల ఎస్ఐపిసి పెట్టుబడులు

**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఎరువులు, పురుగు మందులు, ఎలక్ట్రానిక్ రంగానికి సంబంధించి ఈ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ(ఎస్ఐపీసీ) ఆమోదం తెలిపింది. సీఎస్ కె.విజయానంద్ అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో పలు పెట్టుబడులకు సమ్మతించింది. ఆమోదం పొందిన ప్రాజెక్టులు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) ఆమోదం తో పాటు మంత్రిమండలి సమ్మతి పొందుతాయి. కాకినాడలో రూ.1,539 కోట్ల పెట్టుబడులతో ఇంటిగ్రేటెడ్ పాస్ఫేటిక్ ఫెర్టిలైజర్ ప్లాంట్, మరో రూ.1,700 కోట్లతో అనుబంధ ప్లాంట్ల ఏర్పాటుకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (సీఐఎల్) పంపిన ప్రతిపాదనలకు ఎస్ఐపీసీ ఆమోదంతెలిపింది. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో 2017లో కేటాయించిన భూముల్లో న్యాయపరమైన సమస్యలు ఉన్నందున అనకాపల్లిలోని కోడూరులో ఏపీఐఐసీ భూములు కేటాయించాలని మెస్సర్స్ అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా(గతంలో ఎలీప్) చేసిన ప్రతిపాదనను ఎస్ఐపీసీ ఆమోదించింది.

# పి-4తో ప్రజల జీవన ప్రమాణాలు పెంపు

## మనం బాగుండాలి, అందరూ బాగుండాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారికి జన్మభూమి స్ఫూర్తితో పి4 విధానంలో భాగస్వాములు అవ్వాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. మనం బాగుండాలన్నారు.,..మనతో పాటు మన చుట్టూ ఉన్న అందరూ బాగుండాలి. అప్పుడే నిజమైన పండుగ. ఆర్థిక అసమానతలు తగ్గించి సమాజంలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే అందరి ఇళ్లలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనతో ప్రజల జీవితాల్లో వెలుగు తెచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం. పది సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఆవిష్కరించామన్నారు. ఆ మేరకు ఆయన ఎక్స్‌వేదికగా పీ4 విధానంపై ట్వీట్ చేసారు. ఈ విధానం గురించి వివరిస్తూ ఇందులోని పది సూత్రాల ద్వారా తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ 1 చేసేందుకు అడుగులు వేస్తున్నాం. వీటిలో ప్రధమ సూత్రం జీరో పావర్టీ. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిందే పి4 విధానం (పబ్లిక్ ప్రైవేటు పీపుల్‌పార్టనర్‌షిప్). ఉమ్మడి రాష్టంలో 1995లో అమలు చేసిన సంస్కరణలు, తెచ్చిన పాలసీలతో కోట్లాది మంది ప్రజల జీవితాలు మారాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నాడు తీసుకువచ్చిన పి3 (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగింది. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వాళ్లు సైతం నాటి అవకాశాలతో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అనేక వర్గాల వారు దేశ, విదేశాల్లో మంచి స్థానాలకు చేరుకున్నారు. గ్లోబల్ సిటిజన్స్ గా వెళ్లి...నేడు గ్లోబల్ లీడర్స్ అవుతున్నారు. అత్యధిక తలసరి ఆదాయంసాధించి తెలుగు ప్రజల సత్తా చాటుతున్నారు. నాటి సంస్కరణ ఫలాలు అన్ని వర్గాలకు చేర్చాల్సిన బాధ్యత ఉంది. ఇప్పటికీ లక్షల కుటుంబాలు పేదరికంలోనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం నేటికీ ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతో మంది కటిక పేదరికంలోనే ఉన్నారు. విద్య, వైద్యం, పౌష్టికాహారం, తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితిలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితిని మార్చేందుకు, సమాజాన్ని శక్తివంతంగా చేసేందుకు పీ4 విధానాన్ని ప్రతిపాదించి నేడు విధాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్నాను. తమ శక్తి యుక్తులతో, ప్రభుత్వ పాలసీతో సమాజంలో అత్యున్నత స్థానాలకు చేరుకున్న 10 శాతం మంది ప్రజలు...అట్టడుగున ఉన్న 20 శాతం మంది ప్రజలకు చేయూతనిచ్చి పైకి తేవాలని కోరుతున్నాను. పేద వర్గాల చదువులకు, ఉపాధి అవకాశాలకు, నైపుణ్యం పెంచేందుకు ఒక పద్ధతి ప్రకారం చేయూతనిస్తే వారి కుటుంబాలు నిలబడతాయి. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అవసరమైన నాలెడ్జ్, సాంకేతికతను అందించి మార్గ నిర్దేశనం చేసి వారి జీవితాల్లో వెలుగులు తేవచ్చు. ఎవరు ఎక్కడ స్థిరపడినా వారి మాతృ భూమిలో ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో, ఒక సమూహానికో, ఒక గ్రామానికో, ఒక ప్రాంతానికో చేయూతను అందించి వారి జీవన ప్రమాణాలు పెంచవచ్చు అన్నారు.

# సుబియాంటో

>> ప్రధానిమోడీ విదేశాంగమంత్రి జైశంకర్ లతో వాణిజ్యం, ఆరోగ్యం,భద్రత రంగాల్లో సహకారంపై చర్చలుజరిపారు. 1950నుంచి భారత్‌మిత్రదేశాల నేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం సాంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు రాలేదు. 2007లో రష్యా నుంచి పుతిన్, 2008లో ఫ్రాన్స్ నుంచి నికోలస్ సర్కోజీ, 2015లో అమెరికా నుంచి బరాక్ ఒబామా, 2016లో ఫ్రాన్స్ నుంచి ఫ్రాంకోయిస్ హాలెండ్‌లు అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటిబ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను ఆహ్వానించినా కొవిడ్‌కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దయింది. 2018లో ఆసియాన్‌దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్‌ఫతా అల్‌సిసి ముఖ్య అతిథిగా వస్తే 2024 రిపబ్లిక్‌డే వేడుకలకు ఫ్రాన్స్ అద్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ హాజరయ్యారు.

# కస్టమ్స్ దాడుల్లో భారీగా బంగారం స్వాధీనం

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో కస్టమ్స్ అధికారులు పలు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న బంగారంపై ముందస్తు సమాచారాన్ని అనుసరించి దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భారీగా బంగారం స్వాధీనం చేసుకున్నట్లు విజయవాడలో కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో విజయవాడ,తాడిపత్రి రైల్వే స్టేషన్, నెల్లూరు రైల్వే స్టేషన్, బొల్లపల్లి టోల్‌ప్లాజా ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 17.9 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. 16 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరికి విశాఖలోని న్యాయస్థానం శనివారం 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన బంగారం విలువ రూ.14.37 కోట్లు ఉంటుందని చెప్పారు. కేరళ, తమిళనాడునుంచి ఈ బంగారాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు.

# జోరుగా ప్రై'వేటు'

>> రిజర్వేషన్లు ఎప్పుడో అయిపోవడంతో తత్కాల్ ప్రీమియం తత్కాల్ టిక్కెట్లు కోసం ఎక్కువ మంది ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్ శివారు చర్లపల్లి నుంచి నరసాపురం, కాకినాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు 43 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. అన్నీ జనరల్ బోగీలతో కూడిన 16 జనసాధారణ్ రైళ్లను చర్లపల్లి స్టేషన్‌నుంచి రాష్ట్రానికి నడుపుతున్నారు. 15 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు జతచేశారు. సంక్రాంతికి సొంతూళ్లకు బస్టాండ్లు, ప్రధాన బస్‌స్టాప్‌లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. విద్యాసంస్థలకు సెలవులు హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు సొంతూళ్లకు వెళ్తున్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నానికి అనేక ట్రావెల్స్ సంస్థలు ఏసీ స్లీపర్ టికెట్‌కు రూ.2 వేల నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నాయి. కొన్నైతే ఏకంగా రూ.4 వేల ధరల పెట్టాయి. విజయవాడ నుంచి విజయవాడ నుంచి శ్రీకాకుళం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సాధారణ రోజుల్లో టికెట్ రూ.500-600 నాన్ ఏసీ స్లీపర్‌కు రూ.700 ఉండేది. ఇప్పుడు నాన్ ఏసీ సీటర్‌లో రూ.1500 స్లీపర్‌లో రూ.2 వేలు వసూలు చేస్తున్నారు.



ఆదివారం నారావారిపల్లెకు చేరుకున్న సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

# నారావారిపల్లికి ముఖ్యమంత్రి రాక

## ఎంఎల్ఎ పులివర్తి నాని ఘన స్వాగతం

**చంద్రగిరి, జనవరి 12 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం తన స్వగ్రామం నారావారిపల్లికి చేరుకున్నారు. సంక్రాంత్రి పండుగలను సొంతూరులో జరుపుకోవాలనే చంద్రబాబు ప్రజలకు గతంలో చెప్పిన విధంగానే తాను సైతం ముఖ్యమంత్రి అయినప్పటికీ స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో కలసి సంక్రాంతి జరుపుకునేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ పులివర్తి నాని ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కొరకు ఇక్కడి చేరుకున్న ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, నివాసానికి చేరుకున్నారు. అదేవిధంగా సంక్రాంతికి ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి శనివారమే నారావారిపల్లి చేరుకున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మిణీ, నారా దేవాన్ష్ ఆదివారం మధ్యాహ్నం నారావారిపల్లి చేరుకున్నారు. ఇక్కడి చేరుకున్న ఆయన కందులవారిపల్లిలో తన మేనత్త గృహానికి చేరుకుని వారితో కొంత సమయం గడిపారు. సాయంత్రం నారా భువనేశ్వరీ, నారా లోకేష్, నారా బ్రాహ్మిణీ, శేషాపురంలోని శేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, టిటిడి అధికారులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు గావించారు. అనంతరం వేదపండితుల ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పుస్తకం మెదడును పదును చేసే మహాసాధనం

## వచ్చే జనవరిలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు: డా. గజల్ శ్రీనివాస్



ఆదివారం పుస్తక మహోత్సవంలో ప్రసంగిస్తున్న గజల్ శ్రీనివాస్

**విజయవాడ,జనవరి12, ప్రభాతవార్త ప్రతినిధి:** పుస్తకం మెదడును పదును చేసే మహాసాధనం అని ఆంధ్ర సారసత్వ పరిషత్.దేవాలయాల రక్షణ సమితి జాతీయ అధ్యక్షులు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. మానవ మనో వికాసానికి పుస్తకం మార్గదర్శనం అన్నారు. అంతరంగ ఆలోచనలకు పుస్తకం అక్షరవేదికయితే, మనిషిలోని భిన్న భావోద్వేగాల పలికించేదే సాహిత్యమన్నారు. భావానికి భాష రూపం సాహిత్యమైతే, మాతృభాషలోనే మనస్సులో మాట వెల్లడయితే ఆ ప్రయోజనం మరువలేనిదన్నారు. విజయవాడ 35వ పుస్తక మహోత్సవ ముగింపు సభ చెరుకూరి రామోజీరావు వేదికపై జరిగింది. ఈ సభలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ మాతృభాషలోని మాధుర్యం మరువలేనిదన్నారు. తెలుగు భాషా వికాసానికి, మాతృభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి కనీస బాధ్యతగా నిలవాలన్నారు. సభలో ఆయన ప్రత్యేక ఆకర్షణ నిలవడమే కాకుండా గజల్స్‌ను అర్ధవంతంగా పాడి. చక్కటి అభినయంతో ప్రతి గుండెపై వాటి అంతర్థాన్ని ముద్రించారు. గుంటూరులో వచ్చే ఏడాది జనవరి 3,4,5న జరిగే తెలుగుభాషా పండుగ, 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపును ఇచ్చారు.

**ముగిసిన విజయవాడ పుస్తకమహోత్సవం**

అక్షర జ్ఞానజ్యోతులు వెలిగిస్తూ, విజ్ఞాన వింజామరులతో పుఠన ప్రియులను ఆలరిస్తున్న విజయవాడ 35వ పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. రాష్ట్రానికి చెందిన ప్రచురణ కర్తలే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రచురణ సంస్థలు, ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలు, విదేశీ ప్రచురణ సంస్థలు సైతం ఈ పుస్తక మహోత్సవంలో తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన స్టాళ్లు పాఠకులను ఆకట్టుకుంటున్నాయి. 35వ పుస్తక మహోత్సవంలో మొత్తం 270 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఇంట్లో అందుబాటులో ఉండే వస్తువులతో సైన్స్ ప్రయోగాలు ఎలా చేయాలో పిల్లలకు అవగాహన కల్పించామని, మ్యాజిక్‌లోని లాజిక్ లాంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ ఆలోచనలు పెంచేలా గాజు పెంకులపై నడిపించటం, మేకుల కుర్చీ, మేజిక్ కాయిన్ బాక్స్ లాంటి వినూత్న ప్రయోగాలతో పాటు టెలిస్కోప్‌తో ఖగోళంలో జరిగే అద్భుతాలను వీక్షించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సాహిత్య అకాడమీ బెంగళూరు రీజనల్ కార్యాలయం ప్రతినిధి శాశ్వత్ వాజ్‌పేయి మాట్లాడుతూ హైదరాబాద్‌తోపాటు విజయవాడలో కూడా పుస్తకాలకు మంచి ఆదరణ ఉందన్నారు. అజు పబ్లికేషన్స్‌కు చెందిన మల్లికార్జున్ మాట్లాడుతూ అమ్మడైరీలో కొన్ని పేజీలు నవల ఇప్పటివరకూ లక్షకు పైగా కాపీలు అమ్ముడుపోయాయన్నారు.

# 'పుంజు'లే మహారాజులు

>> ఉత్తరాంధ్రలో అక్కడక్కడ తప్పించి మొత్తం రాష్ట్ర మంతా విస్తరించారు. ఎన్ఆర్ఐలు, రియల్టర్లు వీటిపై ఆసక్తి చూపించే పరిస్థితి ఉంది. వీరి సదుపాయం కోసం ఆంధ్రా-తెలంగాణ సరిహద్దుల్లో కీలకంగా గోదావరి, కృష్ణా, మున్నేరు తీర తోటల్లో బరులు విస్తరించాయి. నూజివీడు నియోజకవర్గంలో ఏటా కోడి పందేలు జోరుగా సాగుతున్న విషయం బహిరంగ రహస్యమే. ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోనిఅనేక గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. విశాఖ జిల్లా ఆనందపురం మండలం రామవరంలో కోడి పందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నేత చింతలపూడి వెంకటరామయ్య, మరో 28 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రామిరెడ్డి పల్లిలో కోడిపందాల బరులను పోలీసు, రెవెన్యూ అధికారులు ధ్వంసం చేశారు. ఏలూరు జిల్లా లక్కవరంలోకోడి పందేల కోసం తయారు చేస్తున్న బరులను పోలీసులు ధ్వంసం చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో దాదాపు 400కి పైగా కోడి పుంజుల పెంపకం కేంద్రాలు ఉన్నాయంటే పందేలు ఏ స్థాయిలో జరుగుతాయో ఊహించుకోవచ్చు. ఆయిల్ పామ్ తోటలు మొదలు, చెరువు గట్లు, పొలాల్లో కోళ్ల పెంపకాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. పందెం రాయుళ్లు పెంపకందారులతో ముందుగానే ఒప్పందం చేసుకుని మరీ ప్రత్యేకంగా కోళ్లను పెంచుతుండగా ఇప్పటికే ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పందెం రాయుళ్లు కోళ్ల కొనుగోళ్ల చేసే ప్రక్రియను ముమ్మరం చేశారు. పోరాటం చేసే విధానం, పుంజు రంగు, ఎత్తు, పుంజు బ్రీడ్‌ను బట్టి ఒక్కో పుంజు ధర రూ.25 వేల నుంచి 3 లక్షల వరకు పలుకుతోంది. పండుగ రోజుల్లో వీటి అమ్మకాల రూపంలోనే దాదాపు రూ.25 కోట్ల వ్యాపారం జరుగుతుందని సమాచారం.

కోడి పందేలు చూసే వారికి వినోదం కల్పించినా వీటి పెంపకం వెనుక మాత్రం చాలా కష్టం దాగుంది. కోడి పిల్లను పొదిగిన తర్వాత దాన్ని వేరు చేసి బరిలో దిగి అవతలి కోడిపై బలంగా పోరాడే వరకూ పెంచి, తర్ఫీదునివ్వడానికి ఒక యజ్ఞమే చేయాలి. నెమలి, అబ్బరాసు, పింగళ, పర్ల, మైల, డేగ, పచ్చకాకి, కొక్కిరాయి, తీతువ ఇలా పలు జాతులకు చెందిన కోళ్లను పందేలకు సిద్ధం చేస్తారు. నిత్యం ఉడకబెట్టిన గుడ్లు, బాదం, మటన్ ఖీమా, జీడిపప్పు, రాగులు, సజ్జలు, ఎండు ఫలాల లడ్డూ ఇలా బలవర్ధకమైన ఆహారం పెట్టి వీటిని పెంచుతారు. చురుగ్గా పోరాటం చేసేలా ఈ మేతను తినిపిస్తుంటారు. బరిలో దిగిన కోడి ప్రత్యర్థి పుంజుపై విజయం సాధించేలా కోళ్లను బలంగా తయారు చేస్తారు. ఇందుకోసం కోడితో వ్యాయామాలు చేయించడం, ఈత కొట్టించడం, నొప్పులు తగ్గి, కండరాలు బలపడేందుకు వేడి కాపడం పెట్టడం, వేగంగా తరుముతూ పరిగెత్తించడం చేస్తారు. అనారోగ్యం చేసినప్పుడు మందులు వేసి మరీ వాటిని జాగ్రత్తగా చూస్తారు. బాగా తెలిసినవారు మినహా మూడో మనిషిని కోళ్ల పెంపకం కేంద్రంలోకి అనుమతించరు. ప్రత్యేకమైన ఆహారం, మందులు, గాబులు, కూలీ ఖర్చులు కలిపి ఒక్కో పందెం కోడిని తయారు చేసేందుకు సగటున 20వేల నుంచి 30వేల వరకూ ఖర్చుచేస్తున్నారు. కోడి పందేలను జూదంలా కాకుండా సంప్రదాయంగా భావిస్తూ కొనసాగిస్తున్నామని అందుకోసమే ఏటా వ్యాపారంగా కాకుండా ఇదో వ్యాపకంలా భావించి కోళ్లను పెంచుతున్నామని పెంపకం దారులు చెబుతున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం అంపాపురంలో జాతీయ రహదారి పక్కనే భారీగా బరులు ఏర్పాటు చేస్తున్నారు. కోడిపందేలతో పాటు గుండాట, జూదం నిర్వహిస్తారని సమాచారం. ఎన్టీఆర్ జిల్లా కొత్తూరు తాడేపల్లి పరిసరాల్లో పందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. కోడిపందేలు నిర్వహిస్తే గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తె అవకాశం ఉందని కొత్తూరు తాడేపల్లి వాసి మెండెం జమలయ్య దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం పందేలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. సంక్రాంతి సంబరాల పేరిట జంతుహింస జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వులు మేరకు జిల్లాలో రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జూదాలు జరుగకుండా చూసేందుకు జిల్లాలో అన్ని మండలాల్లో 28 సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఎప్పటికప్పుడు గట్టినిఘాతో తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ కమిటీల్లో మండల తహశీల్దారు, ఎస్ హెచ్ఓ, ఎస్ జివో ప్రతినిధి, ఇద్దరు కానిస్టేబుల్స్, ఇద్దరు వీడియో గ్రాఫర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. కోడిపందేలు, బెట్టింగులు, జూదాలు లాంటి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఈ కమిటీలు పనిచేస్తాయనీ అదే విధంగా ఈ సమన్వయ కమిటీలు ప్రజల్లో కోడిపందేలు నియంత్రణపై అవగాహన కల్పిస్తారనీ, కోడి పందేలతోపాటు పేకాట గుండాట లాంటి జూద క్రీడలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. కోడిపందేలు నిషేదంపై గ్రామాల్లో టాం టాం వేయడం, మైక్ ప్రచారం, తదితర విస్తృత ప్రచారం చేయాలని ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

ఇదిలా ఉంటే జిల్లాలో కోడిపందాల నిర్వహణపై ఏలూరుకు చెందిన బలే నాగలక్ష్మి అనే మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దుగ్గిరాల్లో చింతమనేని కాకతీయ లీగ్ పేరుతో నిర్వహిస్తున్న కోడిపందాలను అడ్డుకోవాలని పిల్‌లో కోర్టును కోరారు నాగలక్ష్మి.. గతంలో కోడిపందాల నిరోధానికి ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని, కోర్టు ఆదేశాలను అమలు చెయ్యాలేని పక్షంలో కోర్టు ధిక్కరణ కింద తాము మరోసారి కోర్టును ఆశ్రయిస్తామని పిటిషనర్ తెలిపారు. సంక్రాంతికి సాంప్రదాయాల ముసుగులో ప్రజాప్రతినిధులు జూదాలను ప్రోత్సహిస్తున్నరంటూ పిటిషన్లో నాగమణి పొందుపరిచారు. అదేవిధంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చెయ్యాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో కోడిపందాలు జరుగుతాయా జరగవా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే మరోవైపు పందెం రాయుళ్ల ప్రతియేటా సాంప్రదాయ కోడిపందాలు తప్పకుండా జరుగుతాయని చెబుతున్నారు. బరులు సిద్ధం చేసి కోడి పందాలకు సై అంటున్నారు.

# నేటినుండి ఆరంభం

>> కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్న ఈ 45 రోజుల పవిత్ర వేడుకలకు యుపి సర్కారు సర్వం సిద్ధంచేసింది. సోమవారం నుంచి ఫిబ్రవరి 26వ తేదీవరకూ 45 రోజులపాటు గంగా, యమున, సరస్వతి నదుల సంగమప్రాంతంలో ఈ మహాకుభమేళా జరగనుంది. 13న పుష్యపౌర్ణమి స్నానంతో ప్రారంభించే ఈ బృహత్తర కార్యాక్రమం ఫిబ్రవరి 26వ తేదీ మహాశివరాత్రితో ముగుస్తుంది. మహాకుంభ్‌సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో అడుగు పెట్టిన ప్రాంతంనుంచే ఆధ్యాత్మికశోభ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది ప్రతి కూడలిలో గజ్జెలు, ఢమరుకం వంటి చిహ్నాలతోపాటు గోడలకు ఆధ్యాత్మిక పెయింటింగ్‌లు వేయించింది. విద్యుత్ ఇతర స్తంభాలకు త్రినేత్రం తదితర హంగులన్నింటినీ అద్దింది. నెలన్నరరోజులపాటు పుణ్యస్నానాలు ఆచరించేందుకు దాదాపు 40 కోట్లమంది భక్తులు వస్తారని యుపి సర్కారు అంచనావేసింది. త్రివేణి సంగమానికి ఇరువైపులా సుమారు నాలుగువేల హెక్టార్ల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలను ఏర్పాటుచేసింది.

హిందూ పురాణ చరిత్ర ప్రకారం దేవతలు రాక్షసులుకలిపి పాలసముద్రం చిలికిన క్రమంలో అమృత భాండం బయటికి వస్తుంది. రాక్షసులకు అందకుండా ఉండేందుకుగాను మోహినీరూపం ధరించిన విష్ణువు ఆ కుంటను తీసుకుని వెళుతుండగా నాలుగు అమృతం చుక్కలు నేలపై పడతాయి. ఆ నాలుగు ప్రాంతాలనే ప్రయాగరాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లు. అందుకే వాటిని పవిత్ర పుణ్యక్షేత్రాలుగా కుంభమేళాలు నిర్వహిస్తారు. మాఘమేళాను మాఘమాసంలో ప్రయాగరాజ్‌లోను, అర్ధకుంభ్‌మేళాను ప్రతి ఆరేళ్లకు హరిద్వార్, ప్రయాగరాజ్‌లలో నిర్వహిస్తారు. పూర్ణకుంభ్‌మేళాను ప్రతి 12 ఏళ్లకు మొత్తం నాలుగుక్షేత్రాల్లోను అట్టహాసంగా నిర్వహిస్తారు. అయితే మహాకుంభ్‌మేళా మాత్రం 144 ఏళ్లకు ఒక్కసారే వస్తుంది. ఒక్కప్రయాగరాజ్‌లోమాత్రమేనిర్వహిస్తారు. త్రివేణి సంగమంలో పవిత్రస్నానంచేసి అక్కడే ఉన్న మాధవుడిని దర్శించి అక్షయ్‌వట్‌ను దర్శించుకోడాన్ని మహాకుంభమేళాలో ప్రధాన భాగంగా భావిస్తారు. తర్వాత బడే హనుమాన్ ఆలయాన్ని సందర్శిస్తారు. దీపంతోపాటు ఇతర దానాలుచేస్తారు. సంకీర్తనలు, భజనలు, యోగా మెడిటేషన్‌కు ప్రాధాన్యం ఉంటుంది. నాగసాధువులు వచ్చి పుణ్యస్నానాలుచేయడాన్ని కుంభమేళా ఆరంభంగా భావిస్తారు. తర్వాత అఖాడాలకు నిర్దిష్టమైన సమయం ఉంటుంది. ఆ తర్వాతనే సామాన్య భక్తులు స్నానాలకు అనుమతులిస్తారు. అన్ని స్నానాల్లోను షహీస్నాన్‌గా పిలిచే పుణ్యస్నానం ఆచరించడంద్వారా ఆత్మశుద్ధి అవుతుందని, పాపాలనుంచి విముక్తిపొందుతారని నమ్ముతారు. కీలకమైన స్నానాల్లో 13న పుష్యపౌర్ణమి స్నానం, 15న మకరసంక్రాంతిస్నానం, 29న మౌని అమావాస్యస్నానం, ఫిబ్రవరి 3న వసంతపంచమి స్నానం, ఫిబ్రవరి 12న మాఘపౌర్ణమిస్నానం, 26వ తేదీ మహాశిరాత్రి స్నానం చివరి స్నానంగాచెపుతారు.

భద్రతాపరమైన ఏర్పాట్లలో లోపాలు రాకుండా మొత్తం 2750 సిసిటివికెమేరాలు ఏర్పాటుచేసింది. సమస్యాత్మక ప్రాంతంలో ఎఐ ఆధారిత కెమేరాలున్నాయి. 80కిపైగా వీఎండి టివిస్క్రీన్లు ఏర్పాటుచేసింది. 1920 నంబరుతో హెల్ప్‌లైన్‌తోపాటు 50 మందితో ప్రత్యేక కాల్‌సెంటర్ ఏర్పాటుచేసింది. సుమారు 12వేలమందికిపైగా బందోబస్తుకు నియమితులవుతున్నారు. వీరుకాకుండా కొన్ని కేంద్ర బలగాలు కూడా వస్తున్నాయి. నిఘాకోసం డ్రోన్లు,ఎఐ సాయంతో కెమెరాలను వినియోగిస్తోంది. స్నానాల్లో ఎలాంటి అపశృతి చోటుచేసుకున్నా వెంటనే పసిగట్టి రక్షించేందుకువీలుగా నీటిలో నిఘా డ్రోన్లు కూడా అందుబాటులో ఉంచింది. సైబర్‌మోసాలకు తావులేకుండా 56మంది సైబర్ సెక్యూరిటీ నిపుణులు రంగంలో ఉన్నారు. మొత్తం 12 కిలోమీటర్లు తాత్కాలిక ఘాట్లు ఏర్పాటుచేసారు. కుంభ్‌మేళాకు 40 కోట్లమంది వస్తారని అంచనా. ఒక్కప్రయాగరాజ్‌లోనే వసతులకోసం రెండులక్షలకుపైగా టెంట్లు నిర్మించారు. పారిశధ్యసిబ్బంది 15వేలమందివరకూ ఉన్నారు. 50వేల మంచినీటి కనెక్షన్లకు పైపులైన్లువేసారు. కాగాయుద్ధక్షేత్రాలయిన రష్యా, ఉక్రెయిన్‌లనుంచి కూడా ప్రయాగరాజ్‌కు యాత్రీకులు వచ్చారు. యునెస్కో వారసత్వ ఆధ్యాత్మిక పండుగగా పేరొంటున్న మహాకుంభ్‌లోప్రతిరోజూ ఒక పవిత్ర ఘట్టమేనని చెప్పతకప్పదు.

## వారం - వర్జ్యం

తేది : 13-01-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
పౌర్ణమి రా.3.57
ఆరుద్ర ఉ.10.37
వర్జ్యం : రా.10.27-12.01
దు.మ.12.46-1.31, 2) మ.3.00-3.45
శుభసమయం: ఉ.7.00-7.40,
సా.3.45-4.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బంధువులు, మిత్రులతో విభేదాలు ఏర్పడతాయి. ఒప్పందాల విషయంలో ఆచితూచి వ్యవహరించండి.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలలో మరింత శ్రద్ధ అవసరం. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

**మిథునం:** పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికిందన్న చందంగా ఇతరులకు బాధ్యతలను అప్పగించి నష్టపోతారు.

**కర్కాటకం :** మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్త ఉండండి.

**సింహం:** బాధ్యతలు అధికమవడం వలన శ్రమఅధికంగా ఉంటుంది. మంచి మాట తీరును కనబరుస్తారు.

**కన్య :** చిన్న చిన్న వివాదాలు చిలికి చిలికి గాలివానగా మారకుండా జాగ్రత్తలు వహించండి.

**తుల :** నలుగురిలో నారాయణ, పదుగురితో గోవింద అన్న విధంగా మీ ప్రవర్తన, నడవడిక ఉంటాయి.

**వృశ్చికం:** జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు తొలగిపోతాయి. విద్యార్థులు అధికంగా శ్రమించవలసి వస్తుంది.

**ధనుస్సు:** ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగించినా అవసరాలకు ఏదో విధంగా డబ్బు అందుతుంది.

**మకరం:** కుటుంబ సమస్యలు పరిష్కారం కాగలవు. మీ శక్తి సామర్థ్యాలు వెలుగులోనికి రాగలవు.

**కుంభం:** వృత్తి ఉద్యోగాలలో మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. క్రయవిక్రయాలలో లాభాలు.

**మీనం :** గృహం, స్థలాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

13-1Pg3exHMNWJQE.qxd:13-1Pg3exHMNWJQE.qxd 01/01/01 9:45 AM Page 1



# పరకామణి సేవ చాటున బంగారు బిస్కెట్ చోరీ

## సిసి కెమెరాకు దొరికిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెంచలయ్య

## లోతుగా విచారణ చేపట్టిన పోలీసులు





**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామిచెంత చిన్నపాటి స్వీపర్ ఉద్యోగమైనా సంతోషంగా చేస్తామని విశ్వాసం, భక్తిభావం చాటుకుంటున్న సిబ్బంది ఉన్న టిటిడిలో అందుకు భిన్నంగా స్వామివారి కానుకలు లెక్కించే పరకామణిలో సేవచేసుకునే ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి 100గ్రాముల బంగారు బిస్కెట్‌ను చోరీ చేశాడు. అంతేగాక ఏమాత్రం భయం లేకుండా ఆ బిస్కెట్‌ను పరకామణికి నగదు తరలించే ట్రాలీలోనే పెట్టుకుని రావడం దొంగబుద్ధినేర్చిన ఆ ఉద్యోగి తెలివిని పసిగట్టిన సిసికెమెరాలు విజిలెన్స్ వ్యూహంతో పట్టుబడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి టిటిడి ఆలయ విజిలెన్స్‌వర్గాలు తిరుమల క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న వేలాది మంది భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకలను హుండీలో సమర్పిస్తారు. ఈ కానుకలను ఆలయంలోపల నుండి వెలుపల ఉన్న పరకామణి భవనంకు పెద్దపెద్ద గంగాళాల్లో, గోనెసంచుల్లో తరలిస్తారు. పరకామణి భవనంలో నోట్లను, చిల్లరనాణేలను, విదేశీ కరెన్సీని, బంగారు, వెండి ఆభరణాలను వేరుచేసేందుకు గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని టిటిడి అధికారులు 2021లో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆయన 70మందిని ఔట్‌సోర్సింగ్ క్రింద నియమించుకుని వారికి టిటిడి శాశ్వత ఉద్యోగులతో, పరకామణి డిప్యూటీ ఇఓతో శిక్షణ ఇప్పించారు. ఇలా పాత అగ్రిబోస్(యూనియన్ బ్యాంకు)కాంట్రాక్టులోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన వీలిశెట్టి పెంచలయ్య(40)పనిచేస్తున్నాడు. ప్రతిరోజూలాగే ఇటీవల ఒకరోజు క్రిందట అతను పరకామణిలో విధుల్లో ఉన్నపుడు కానుకలను తీసుకురావడానికి ఖాళీట్రాలీలో బంగారుబిస్కెట్ ఉండటాన్ని ఆలయ విజిలెన్స్ వర్గాలు గుర్తించాయి. అక్కడ విజిలెన్స్ సిబ్బంది పట్టుకున్నారు. ప్రాథమిక విచారణ తరువాత పూర్తిస్థాయిలో అతని వెనుక ఎవరైనా ఉన్నారా?సహకరించెందెవరు,గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డాడా అనే కోణంలో తిరుమల క్రైమ్ పోలీసులు పెంచలయ్యను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా నిజాయితీతో, సేవాభావంతో పనిచేయాల్సిన అతను ఈ మహాతప్పిదానికి పాల్పడటం భక్తులనుండి పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరుమల ఆలయంలోని హుండీలో చోరీలు జరగడం, పరకామణిలో సిబ్బంది చేతివాటంతో విలువైన, అమూల్యమైన కానుకలను కొట్టేయడం తొలిసారి కాదు. ఇలా పలువురు సిబ్బంది విజిలెన్స్‌కు దొరికిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. తిరుమలలోని పరకామణి భవనం పూర్తిగా సిసికెమెరాల నిఘాలోనే నడుస్తుంది. అలాంటిది ఈ దొంగతనాలను ఎలా చేసుకెళుతున్నారనేది ఆ వడ్డీకాసుల వెంకన్నే పట్టించాలి.

# తిరుమల సమాచారం

## సంక్రాంతి అందరి జీవితాల్లో సంతోషం నింపాలి

### వైకుంఠద్వార దర్శనంలో మంత్రి అనగాని

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షాలతో తెలుగుప్రజలందరికీ సంక్రాంతి పండుగ ఆనందం కలిగించాలని, అందరి జీవితాల్లో సంతోషం నింపాలని రాష్ట్ర రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరువేలకోట్ల రూపాయలకు పైగా బకాయిలను విడుదల చేశారన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వారంలో ఆదివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.





## మలివిడత కోలుకున్న భక్తులకు వైకుంఠద్వార దర్శనం

### పరిహారం అందజేసిన టిటిడి

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో టోకెన్లుకోసం జరిగిన తొక్కిసలాటలో గాయపడి మెరుగైన వైద్యచికిత్స అనంతరం తాజాగా కోలుకున్న 28మంది భక్తులకు టిటిడి వైకుంఠద్వార దర్శనం చేయించింది. ఆదివారం ఉదయం వీరందరికీ ఆలయంలోపల మూలవిరాట్టుతోబాటు వైకుంఠద్వారదర్శనం సంతోషంగా, సాఫీగా చేయించడంతో గాయల నుండి కోలుకున్న భక్తులందరూ ఆనందం వ్యక్తం చేశారు. మాకందరికీ పరిహారం కూడా అందించారని, దేవుని దర్శనం చేయించడం జన్మలో మరచిపోలేమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,ఆలయ వర్గాలు దగ్గరుండీ ప్రత్యేక దర్శనం కల్పించారు.

## మూడవరోజు ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం



### టిక్కెట్, టోకెన్ ఉన్నవారికే దర్శనం

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పది రోజుల వైకుంఠద్వార దర్శనంలో భాగంగా మూడవరోజు ఆదివారం భక్తుల సంఖ్య కొనసాగుతోంది. ఎంతో పవిత్రమైన మోక్షమార్గం వైకుంఠద్వార దర్శనం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం ముందుగానే ఆన్‌లైన్‌లో300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు,శ్రీవాణి ,ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీచేసింది. ఈ టోకెన్లు పొందిన తెలుగురాష్ట్రాల భక్తులేగాక తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ,ఒడిశ్శాకు చెందిన భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. ఇలా కొండపైకి వచ్చిన భక్తులకు టిటిడి అధికారులు సాఫీగా, ప్రశాంతంగా మహాలఘులో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టు దర్శనంతోబాటు వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. టిక్కెట్లు, టోకెన్లు, విఐపి బ్రేక్ దర్శనాలు సదుపాయం కల్పించినా సరాసరి 60వేలమంది వరకు భక్తులు శ్రీవారిని వైకుంఠద్వారంలో దర్శించు కోగలుగుతున్నారు. తొలిరోజు 60,094 మంది భక్తులు, రెండవ రోజు 53,013మంది. మూడవ రోజు ఆదివారం 37వేలమంది భక్తులకు సాయం త్రం వరకు మహాలఘులో వెంకన్నను దర్శిం చుకునేలా ఆలయ వర్గాలు చూశారు. వరుసగా నాలుగు రోజులు సెలవులొచ్చినా పండుగల నేపథ్యంలో తిరుమలలోనామమాత్రంగానే భక్తులు ఉన్నారు.

## చిత్తూరు ఎస్పీ మణికంఠకు అరుదైన అవకాశం

### టిటిడి సివిఎస్‌ఒగా అదనపు బాధ్యతలు

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరుజిల్లా ఎస్పీ,తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ విఎన్. మణికంఠచందోలుకు అరుదైన అవకాశం లభించింది. టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్‌ఒగా కూడా ఆయనకు భాగ్యం కలిగింది. 2017లో అప్పటి చిత్తూరుజిల్లా ఎస్పీ ఎస్‌వి రాజశేఖరబాబుకు టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్‌ఒగా అదనపు బాధ్యతల్ని అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కల్పించిన విషయం విదితమే. ఇప్పుడు ఇటీవల టిటిడిలో జరిగిన పరిణామాలతో టిటిడి సివిఎస్‌ఒగా పనిచేసిన ఎస్. శ్రీధర్‌పై బదిలీ వేటుపడింది.ఆ స్థానంలో చిత్తూరుజిల్లా ఎస్పీ మణికంఠచందోలుకు డిజిపి ద్వారకా తిరుమల రావు అదనపు బాద్యతలు అప్పగించడంతో ఆదివారం ఉదయం ఆయన తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో ఇన్‌చార్జి సివిఎస్‌ఒగా కూడా అదనపు బాధ్యతలు చేపట్టారు.



ఆయనను మర్యాదపూర్వకంగా టిటిడి విజిలెన్స్ విఎస్‌ఒలు, ఏవిఎస్‌ఒలు, విఐలు కలిసి అభినందనలు తెలిపారు. కాగా 2018 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన చందోలు గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల సమయంలో చిత్తూరుజిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆయన పనితీరు, అన్నివర్గాలను, అన్నిశాఖల అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణపై పట్టుసాధించడంతో ఒకేసారి రెండు కీలక అదనపు బాధ్యతలను నమ్మకంతో డిజిపి అప్పగించడం విశేషం.

## తిరుమల వినాయకగుడిలో హుండీ చోరీ



**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం గోవిందనామస్మరణ, భక్తులరద్దీతో కిటకిటలాడే తిరుమలలోని బాలాజీనగర్‌లో ఉన్న సిద్ధివినాయక ఆలయంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం ప్రధాన గేట్‌తాళాలను పగలగొట్టి లోపల సన్నిధి తాళాలను తొలగించారు. లోపల ఉన్న హుండీని ఎత్తుకెళ్ళి అందులోని సుమారు 50వేల రూపాయల వరకు కానుకల నగదును చోరీచేసుకెళ్ళారని ధర్మకర్త ధన తిరుమల క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుమలలోని స్థానిక ఆలయంలో చోరీ జరగడం ఇదీ మరింత సంచలనంగా మారింది. తిరుమలలో కూలీ పనులు చేసుకునే బయటిప్రాంతాలవాళ్ళు గానీ, తమిళనాడుకు చెందిన దొంగలు గానీ ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## స్వామివివేకానంద జయంతి సందర్భంగా యువతకు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన ఉత్సవం సందర్భంగా యువతకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ పునర్నిర్మాణం, పేదరిక నిర్మూలనలో యువశక్తి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేసే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. దేశంలో తొలిసారిగా స్కిల్ సెన్సెస్ చేపడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏకాదశ రుద్రప్రభల తీర్థ మహోత్సవానికి మరో అరుదైన గుర్తింపు

### కేంద్ర పర్యాటక శాఖ వెబ్ సైట్‌లో చోటు

### పండుగల జాబితాలో చేర్చిన కేంద్ర ప్రభుత్వం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 12, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి నార్జించిన ఏకాదశ రుద్ర ప్రభల తీర్థ మహోత్సవానికి మరో అరుదైన గుర్తింపు లభించింది.భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవ్ విభాగంలోని ఈవెంట్స్ అండ్ ఫెస్టివల్స్ జాబితాలో చోటుచేసుకొంది.ఈ మేరకు గంగలకుర్రు అగ్రహారంకు చెందిన శివకేశవ యూత్ ఏకాదశ రుద్రప్రభలు, జగ్గన్నతోట తీర్థ విశిష్టత పై దేశ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర పర్యాటక,సాంస్కృతిక శాఖామంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు మరోసారి లేఖలు రాశారు.ఇదిలావుండగా గతంలో శివకేశవ యూత్ దేశ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయగా మోడీ స్పందించి, 2020 జనవరి 13న ప్రత్యుత్తరంగా 'ఏకాదశ రుద్రుల' ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షిస్తూ లేఖ రాసారు.అతి ముఖ్యంగా 2023 జనవరి 26 జరిగిన 74 వ గణతంత్ర వేడుకలలో ఏకాదశ రుద్ర ప్రభల నమూనాను ఆంధ్రప్రదేశ్ శకటంగా ప్రదర్శించడంతో ఏకాదశ రుద్రులకు విశ్వవ్యాప్త ఖ్యాతి లభించింది. కాగా తాజాగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించే విభిన్న సంప్రదాయ పండుగలకు లభించే జాబితాలో ఏకాదశ రుద్రప్రభలకు,తీర్థానికి చోటు లభించడం ఎంతో గర్వ కారణం. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నిర్మాణాలకు అనుమతుల అధికారం స్థానిక సంస్థలకే

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** నగరాభివృద్ధి సంస్థలకు గతంలో అప్పగించిన భవన నిర్మాణాలు , లేఅవుట్లు ఇతర అనుమతుల మంజూరు అధికారాలను మున్సిపాలిటీలు కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలకు తిరిగి బదలాయిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది.అన్ని రకాల కేటగిరీల భవన నిర్మాణాలకు మున్సిపాలిటీలు కార్పొరేషన్లు అనుమతులు మంజూరుచేస్తాయి. నగర పంచాయతీలు గ్రూప్ డెవలప్‌మెంట్ స్కీమ్ అండ్ హై రైజ్ భవన నిర్మాణాలకు మినహా మిగిలిన నిర్మాణాలకు అనుమతులు ఇస్తాయి. నగర పంచాయతీల్లో మూడు ఎకరాలు దాటితే డీటీసీపీ అనుమతి అవసరం, గ్రామ పంచాయతీలు తమ పరిధిలోని 300 చదరపు మీటర్ల ప్లాట్ ఏరియా 10 మీటర్ల ఎత్తులోపు జరిగే నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అన్ని రకాల లేఅవుట్‌లకు అనుమతులు ఇస్తాయి. నగరపంచాయతీల్లో 3 ఎకరాలు దాటితే డీటీసీపీ అనుమతి పొందాలి.

అనధికారిక కట్టడాలపై మున్సిపల్ కార్పొరేషన్ నగర పంచాయతీలకు చర్యలు తీసుకునే అధికారం ఉంది. గ్రామ పంచాయతీల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో చర్యలు తీసుకోవాలి. పాలనాప రమైన సౌలభ్యం కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు సవరిస్తున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ యాక్ట్-2016 లో పేర్కొన్న క్లాజులను అనుసరించి అధికారాల మార్పును గురించి ఉత్తర్వులో వివరించారు.

## ఎన్నికలంటే భయమేస్తోంది

### లూటీ చేసేవారే పోటీ చేస్తున్నారు: మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి



**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్ల అవుతున్నా ఇరు రాష్ట్రాలకు సంబంధించి పరిష్కరించుకోవాల్సిన అనేక సమస్యలు ఉన్నాయి.అవినీతి విపరీతంగా పెరిగిపోతుంది. ఎన్నికలంటేనే భయం వేస్తుంది. డబ్బులను లూటీ చేసే వారే ఎలక్షన్ లో పోటీ చేస్తున్నారు. అలాంటి వారికే మీరు ఓటు వేస్తున్నారు. పార్టీ వేరైనా నా సిద్ధాంతాలు మారవని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేసారు.రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్ల అవుతున్నా ఇరు రాష్ట్రాలకు సంబంధించి పరిష్కరిం చుకోవాల్సిన అనేక సమస్యలు ఉన్నాయని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉందని, అందువలన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎలాంటి అడ్డంకులు లేకుండా పూర్తి చేయాలన్నారు. సంక్రాంతి సందర్భంగా విజయవాడలో సమతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి వెళ్లే విమానంలో తాను కూడా వెళ్లాల్సిందని, కానీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ కూర్పు కోసం ఆగడం జరిగిందన్నారు. తనకు ముఖ్యమంత్రి సీటు కావాలని ఎవరినీ అడగలేదన్నారు. రాత్రి 11 గంటల సమయంలో సోనియా గాంధీ ఫోన్ చేసి ఏపీకి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోవాలని చెప్పారని పేర్కొన్నారు.

## ఏపిలో క్రీడారంగ అభివృద్ధికి నిధులు కేటాయించండి



### నేషనల్ యూత్ డే ఫెస్టివల్‌లో ప్రధాని మోడీని కలిసిన ఎంపి హరీష్ బాలయోగి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

**సచివాలయం, జనవరి 12. ప్రభాతవార్త.** ఆంధ్రప్రదేశ్‌లోని యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని అమలాపురం ఎంపీ, సెంట్రల్ స్పోర్ట్ పార్లమెంటరీ సభ్యులు జీఎమ్ హరీష్ బాలయోగి,శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ప్రధాని నరేంద్రమోడికి విన్నవించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం జరిగిన నేషనల్ యూత్ డే ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ప్రధాని నరేంద్రమోడిని కేంద్ర క్రీడాశాఖా మంత్రి మన్సుక్ మాండవీయ, అమలాపురం ఎంపీ, సెంట్రల్ స్పోర్ట్ పార్లమెంటరీ సభ్యులు జీఎమ్ హరీష్ బాలయోగి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిసి ఏపీలో క్రీడా రంగం అభివృద్ధికి కేంద్రం సహకరించాలని వినతిపత్రం అందజేశారు. గతంలో ఏపీలోని క్రీడాకారులకు యూత్ హాస్టల్స్ ప్రయోజనకరంగా ఉండేవని, ప్రస్తుతం అవి శిధిలావస్థకు చేరుకోని మరుగునపడటంతో క్రీడాకారులకు వసతి సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారని ప్రధానికి వివరించారు. క్రీడాకారుల ప్రయోజనార్ధం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోనూ యూత్ హాస్టళ్లను నిర్మించాలని కోరారు. ఏపీలోని యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించేందుకు కేంద్రం సహకరించి, క్రీడలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని ప్రధానిని కోరారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి ఆహ్వానం మేరకు వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2025 కార్యక్రమానికి ఏపీ నుండి 68 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్‌ను కలిసి ఏపిలో విద్యాశాఖ మరియు క్రీడాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను కేంద్ర విద్యాశాఖ మంత్రికి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వివరించినట్లు అధికారులు తెలిపారు.

## మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత

# 'భావన రెడ్డి చిన్నతంబు'

### మలేసియాలో 40 దేశాలతో పోటీ..ఇండియా ఘన విజయం

### చంద్రగిరిలో భావన రెడ్డికి పట్టణ ప్రజల ఘన స్వాగతం



**చంద్రగిరి, జనవరి 12 ప్రభాతవార్త:** మిస్ గ్లోబల్ ఏసియా 2025 అందాల పోటీలలో చంద్రగిరికి చెందిన భావన రెడ్డి చిన్నతంబు (ఇండియా) విజేతగా నిలిచారు. నిక్సన్ సిమ్ అండ్ లియో రేనాల్డ్ వారి ప్రపంచ అందాల పోటీలు 40 దేశాలకు చెందిన యువతులతో జనవరి 9న మలేషియాలో నిర్వహించారు. ఈ పోటీలకు ఇండియా తరపున తిరుపతి జిల్లా, చంద్రగిరి, పాతపేట, బాలాజీ నగర్‌కు చెందిన ప్రముఖ రియల్టర్ సి.గోపికృష్ణ, లక్ష్మి దంపతుల కుమార్తె, 2023 మిస్ ఇండియా ఐకానిక్ దివా విజేత భావనరెడ్డి చిన్నతంబు దక్షిణ భారత దేశం నుండి ఎంపికయ్యారు. నిక్సన్ సిమ్ అండ్ లియో రేనాల్డ్ నిర్వహించిన ప్రశ్నల పరంపరలో అన్ని రౌండ్లు తనదే పైచేయిగా నిలిచిన భావన రెడ్డి సభికుల హర్షాతిరేకాల నడుమ యావత్ ప్రపంచం వీక్షిస్తుండగా ఇండియాను విజేతగా ప్రకటించారు. ఆ మేరకు మిస్ గ్లోబల్ ఏసియా 2025 కిరీటాన్ని ధరించిన భావన రెడ్డి ఆనందతో ద్రవించిన హృదయం, చెమ్మగిల్లిన కంటతడిని పంటిబిగువున దాచుకుని యావత్ జాతికి, ప్రపంచానికి తన కీర్తిని తెలియజేస్తూ మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. యావత్ దేశం గర్వించదగ్గ రీతిన భావనరెడ్డి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి పొదిగిన కిరీటాన్ని ధరించి ఆదివారం చంద్రగిరి చేరుకున్నారు. ఈ నేపధ్యంలో పట్టణంలోని ప్రజలు, స్నేహితులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తూ బ్యాండు భాజాలు, భాణా సంఛా పేళుళ్ళ నడుమ జరిగిన భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. చంద్రగిరి కొత్తపేట నుండి పాతపేట వరకు అట్టహాసంగా సాగిన ఈ ర్యాలీలో "మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత" మావూరి అమ్మాయి కావడం గర్వకారణం అంటూ ఆమెతో ఇంటికి చేరుకుని కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

# పోలీసుల వైఫల్యం: పట్టపగలే తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలింపు

**పాలసముద్రం, జనవరి 12 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం నుండి అక్రమంగా ఇసుక తమిళనాడు రాష్ట్రానికి తరలివెళ్తున్నప్పటికీ పోలీసులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమార్కులు ఇసుకను లారీలు, ట్రిప్పర్లతో పోలీసుల కళ్ళ ఎదుటే దర్జాగా ఇసుకను అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి తరలించుకు వెళ్తుండటంతో ప్రజలు ఔరా! అని ముక్కున వేలు వేసుకొనే పరిస్థితి ఏర్పడింది. పాలసముద్రం మండలం నుండి అధికార పార్టీకి చెందిన నాయకులు ఇసుకను ఎలా కొల్లగొడుతున్నారో దీనికి అధికారులు, పోలీసులు ఎలా వత్తాసు పలుకుతున్నారో చెప్పడానికి ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. మండల పరిధిలోని సింహరాజుపురం పంచాయతీలో శనివారం సాయంత్రం 3, 4 గంటల ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది ఇసుక అక్రమార్కులు ఒక ట్రిప్పర్ ద్వారా ఇసుకను తమిళనాడు రాష్ట్రానికి తరలించారు. వీరు ప్రతిరోజు జిడినెల్లూరు మండలం నీవానది నుండి పాలసముద్రం మండలం సింహరాజపురం గ్రామంలోని ఒక ప్రదేశంలో ఇసు డంప్‌ను నిల్వ చేస్తారు. ఇక్కడి నుండి పట్టపగలు ఇసుకను తరలిస్తే ఎవరికి అనుమానం రాదని భావించి ట్రిప్పర్‌ను ఇసుకతో నింపి తమిళనాడు రాష్ట్రానికి తరలించే పనిని అనునిత్యం పెట్టుకున్నారు. సింహరాజపురం నుండి ఇసుక అక్రమంగా తరలిస్తుండటంతో స్థానికులు కొంత మంది తమిళనాడు రాష్ట్ర సిఐడి పోలీసులకు సమాచారం అందించారు. ఇసుక తరలిస్తున్న ట్రిప్పర్ డ్రైవర్ తనను ఎవరో అనుసరిస్తున్నట్లు గుర్తించి డ్రైవర్ ట్రిప్పర్‌లోని ఇసుకను తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దుగా వున్న కోసరపల్లి గ్రామంలో ఇసుకను డంప్ చేసి అక్కడి నుండి ట్రిప్పర్‌తో పరారీ అయ్యాడు. అనంతరం తమిళనాడు పోలీసులు చిత్తూరు జిల్లా పోలీసులతో ట్రిప్పర్ విషయంపై మాట్లాడినట్లు తమిళనాడు పోలీసులు తెలిపారు. తమిళనాడు పోలీసుల నుండి తప్పించుకుని వెళ్ళిన ట్రిప్పర్ కోసం తమిళనాడు పోలీసులు ప్రస్తుతం గాలిస్తున్నారు. పాలసముద్రం మండల ప్రజలు మాత్రం మండలం నుండి పట్టపగలు తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా ఇసుక తరలివెళ్తున్నప్పటికీ ఇక్కడి పోలీసులు




పట్టించుకోకపోవడంతో తమిళనాడు రాష్ట్ర పోలీ సులు రంగంలోకి దిగి పట్టుకోవడం ఏమిటని! పాలసముద్రం మండల పరిధిలో పోలీసులు నిజంగానే అక్రమ ఇసుక రవాణా దారులకు వత్తాసు పలుకుతున్నారా! లేక అక్రమ రవాణాను కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారా! అనేది అర్థం కావడం లేదని గుసగుసలాడుతున్నారు.

వార్త

ఆరోగ్యం, మంచి శరీరం బంగారం కంటే మంచిది. మంచి మనసు అంతులేని సంపద కంటే విలువైనది.

-రాబర్ట్ ఫ్రాస్ట్

# ముప్పుతెచ్చిన అంతర్గత అసమ్మతి!

ఏ దేశంలో అస్థిరత పెరిగినా ఆదేశ పాలకులకు ప్రజల్లో విశ్వాసం పొందడం అనేది అగ్ని పరీక్షగానే మారుతుంది. పదవీచ్యుతి పొందిన నేతలు ఇతర దేశాల్లో ఆశ్రయం పొందుతున్నవారు కొందరైతే మరికొందరు జైళ్లలోనే మగ్గుతున్న వైనం ఇప్పటికీ మనం చూస్తూనే ఉన్నాం. పదవీకాంక్ష మిలిటరీ తిరుగుబాట్లతో కొన్ని దేశాలు రాజకీయ అస్థిరతతో అతలాకుతలం అవుతుంటే మరికొన్ని దేశాల్లో ప్రజల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకత అధినేతలకు పదవీగండం తెచ్చిపెడుతోంది. విధిలేని పరిస్థితుల్లో రాజీనామా చేసిన నేతల గురించి చెప్పుకోవాలంటే ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్‌తోపాటు కెనడా కూడా నిలిచాయి. బంగ్లాదేశ్‌లో అయితే రిజర్వేషన్ల ఉద్యమం చివరకు ప్రధాని దేశంవీడివెళ్లేంత వరకూ దారితీసింది. ఇప్పుడున్న తాత్కాలిక ప్రభుత్వం మరోసారి ఆ పార్టీకానీ ఆమె కాని పాలనాపగ్గాలు చేపట్టేందుకు వీలులేని విధంగా వ్యూహాలు అమలు చేస్తున్నదన్నది మనం ప్రత్యక్షంగానే గమనిస్తున్నాం. ఇదేకోవలోకి వస్తున్నది. మరో అభివృద్ధి చెందిన దేశం కెనడా. ఉత్తర అమెరికా దేశంగా భాసిల్లుతున్న ఈదేశంలో ఇప్పుడు ప్రజల్లో తీవ్రవ్యతిరేకత నెలకొంది. దేశప్రధానిపాలనా తీరును ఎండగడుతున్నారు. కారణాల వరకూ వెళ్లితే ఇళ్ల సమస్య పెరిగిపోయింది. వలసదారులు పెరిగిపోతుండటంతో అనివార్యంగా భారీకోతలు వేసిన ప్రస్తుత లిబరల్ పార్టీ అధినేత ట్రూడో మరింతగా కోతలువిధించే పరిస్థితి కల్పించారన్నది ప్రతిపక్షాల వాదన. అంతటితో ఆగకుండా అమెరికాకు కొత్త అధ్యక్షుడుగా వస్తున్నడొనాల్డ్ ట్రంప్ ముందు నుంచే తమలో విలీనం కావాలన్న ఒత్తి డిని పెంచారు. వలస విధానాలు మార్చుకోకపోతేదిగుమతి సుంకాలు పెంచేస్తామని 25శాతం సుంకాలువేస్తామంటూ చేసిన హెచ్చరికలు కెనడా ప్రజలను కుదిపేస్తున్నాయి. మరోపక్క ట్రూడోపై సొంత పార్టీలోను వ్యతిరేకత పెరిగిపోతోంది. ముఖ్యంగా భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్నారన్న భావన కూడా పెరిగింది. తన ఖలిస్థానీ మద్దతు అజెండా వల్ల ఇప్పుడు దేశం అస్థిరతను ఎదుర్కొంటున్నదని, ధరలుపెరిగిపోయి, ఉపాధి తగ్గి, పక్కా గృహాలకు కొరత ఏర్పడటం వంటివి సొంతపార్టీలోట్రంప్ వైఫల్యాలుగానే చెపుతున్నారు. అంతేకాకుండాఆర్థికమంత్రి క్రిస్టినా ఫ్రీలాండ్ రాజీనామా చేయడం సొంతపార్టీలో మరింత వ్యతిరేకతను పెంచింది. ఇప్పటికే 27మంది ఎంపిలు రాజీనామా చేయాలని లేనిపక్షంలో అవిశ్వాసం ప్రవేశపెడతామన్న హెచ్చరికలు కూడా వెంటాడుతున్నాయి. ఈక్రమంలో ట్రూడో తను రాజీనామా చేయడమే సహేతుకమని భావించారోఏమోకానీ ప్రధాని పదవితో పాటు లిబరల్‌పార్టీ అధ్యక్ష పదవికి సైతం రాజీనామా చేసేస్తామని ప్రకటించడం అధికారపార్టీలో ఉన్న వ్యతిరేకతను కొంతమేర సర్దుబాటు చేసుకోగలిగినట్లు కనిపిస్తున్నా మళ్లీ ఎన్నికలంటూ వస్తే ట్రూడోకు పగ్గాలు దక్కడం అన్నది మాత్రం అసాధ్యమేనన్న భావన లిబరల్ పార్టీలో కనిపిస్తోంది. అగ్రరాజ్యం అమెరికాతో వివాదాలు, భారత్‌తో దౌత్యపరంగా విభేదాలు, మెక్సికోతో వాణిజ్యంవంటివి ట్రూడోకు చిక్కులే తెచ్చిపెట్టాయి. మరీ ముఖ్యంగా ట్రంప్ వచ్చీరావడంతోనే కెనడాపై ఎలాంటి వైఖరితో ఉంటారు? ఆయన విధించే సుంకాలు కెనడాకు ఏస్థాయిలో భారం అవుతాయి. ఎగుమతులపై పడేభారం వంటివాటితో కెనడా ఆర్థికవ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందన్న భావన ఆదేశ ప్రజల్లో పెరిపోతోంది. ప్రజల్లో పెరుగుతున్న అవిశ్వాసం చివరకు పార్టీకిసైతం ఎసరుతెస్తుందన్న ధ్యాసతో సొంతపార్టీ ఎంపిలే ఆయనపై అభిశంసనకు కూడా సిద్ధపడ్డారంటే దేశంలో ట్రూడోకు ఎంతమేర వ్యతిరేకత ఉన్నదోఅవగతం అవుతోంది. అతిపిన్న వయసులో ప్రధాని పదవిని చేపట్టి కెనడా చరిత్రలో రికార్డులు తిరగరాసిన ట్రూడో ఇప్పుడు రాజకీయంగా తీవ్ర ఆటు పోట్లను ఎదుర్కొంటున్నారు. 2015 నుంచి తన తండ్రి పియరీ ట్రూడో వారసత్వం పుణికిపుచ్చుకుని యధేచ్ఛగా కొనసాగిన ట్రూడో ఇప్పుడు వ్యతిరేక పవనాలకు తలొగ్గక తప్పడంలేదు. మరోపక్క ఇళ్ల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, కెనడాలో ఇళ్ల సమస్య మరింత తీవ్రతరం కావడం వంటివి 70శాతం కెనడా ప్రజల్లో ట్రూడో నాయకత్వంపై తీవ్ర వ్యతిరేకతను తెచ్చిపెట్టాయి. ఐదులక్షలవలస దారులకు ఇచ్చే అనుమతులు 3.95లక్షలకు కుదించారు. బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాల్సిన తరుణంలో ఆర్థిక మంత్రిని మార్చడం పార్టీలో ఆయనపట్ల వ్యతిరేకతను మరింత పెంచింది. రాజకీయంగా ఎదుర్కొంటున్నముప్పేట దాడితోపాటువ్యక్తిగత చికాకులు కూడా వెంటాడాయి. భార్య సోఫీ గ్రెగోరీతో వేరుపడటం కొంత అప్రతిష్టను తెచ్చిపెట్టింది. కెనడా పరిణామాలను అన్నింటిని నిశితంగా గమనిస్తే అంతర్గతంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమించకపోతే ఏ పార్టీ అయినా ఎంతటి నాయకుడు అయినాసరే ప్రజాగ్రహానికి తలొగ్గాల్సిందే. ఇప్పుడు కెనడా ప్రధాని ఈ వాస్తవాన్ని ఆలస్యంగా తెలుసుకోవడంతో పరిస్థితులు చేయి దాటిపోయాయి. దీనితో ఇప్పుడు కెనడాకు కొత్తనాయకుడి ఎన్నిక అనివార్యమైంది. కెనడా ప్రజల అభీష్టానికి అనుగుణంగా నడుచుకునే నాయకునికే అవకాశాలెక్కువ. భారత్‌తో సత్సంబంధాలున్న దేశంగా అటు అమెరికాకు, ఇటు మెక్సికోకు కూడా వాణిజ్యపరంగా అతిముఖ్య దేశంగా కొనసాగిన కెనడాకువచ్చే ప్రధాని ఉభయకుశలోపరితారక మంత్రం పఠించాల్సిందే. లేనిపక్షంలో ఇప్పుడున్నప్రధాని ఎదుర్కొంటున్న పరిణామాలే మళ్లీపునరావృతమవుతాయి. ఏదేశం అయినాసరే ప్రజాగ్రహం ముందు ఎంతటి పలుకుబడి నేతలైనా దిగిరావాల్సిందే లేనిపక్షంలో ఆదేశంలో నిరంతర అనిశ్చితి, తిరుగుబాట్లు, ఆందోళనలు తప్పవని పాలకులు ఎంత సత్వరమే గుర్తిస్తే అంత మంచిది.

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.



అరిస్టాటిల్

తమ కాళ్ల మూలంగా పక్షులు వలలో చిక్కుకుంటాయి. అలాగే తమ మాటల మూలంగానే మనుషులు చిక్కుల్లో ఇరుక్కుంటారట.



ట్రోయ్ మార్డెన్

# జీవోలు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుకూలమా!ప్రతికూలమా?

*ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సామాజిక రిజర్వేషన్లు 50శాతం దాటకూడదనేది నిబంధన. 6శాతం నుండి 10శాతంకు ఎస్టీ రిజర్వేషన్‌ను పెంచడం ద్వారా 50శాతం కోటా దాటుతున్నది. రిజర్వేషన్ పెంపు ప్రక్రియ అనేది జీవోద్వారా సాధ్యంకాదనేది అటు రాజ్యాంగ నిపుణులు ఇటు న్యాయకోవిదులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవో 130మీద దాఖలైన పిటిషన్‌ను శీఘ్రగతిన తేల్చాల్సిన ఆవశ్యకత ఉన్నదని పలువురు అభిప్రాయపడు తున్నారు. హైకోర్టులో దాఖలైన ఈ పిటిషన్ దాదాపు సంవత్సరం కాలంపాటు వాయిదాలతోనే సాగిపోతూనే ఉన్నది. ఇలాంటి సున్నితమైన కేసుల విషయంలో సుప్రీంకోర్టు వెలువరిచిన తీర్పులను పరిశీలించడంతోపాటు, రాజ్యాంగ నిపుణుల సలహాలను తీసుకొని సత్వరమేపరిష్కారం చూపాలి.*

**భాస్కర్ యలకంటి**

ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అమలు చేయడానికి వీలుగా ప్రభుత్వాలు జీవోలను విడుదల చేయడం పరిపాటి. అవే జీవోలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకొని వాటిని రద్దుచేసి రాజ్యాంగ పరిరక్షకులుగా నిలుస్తున్నాయి. గ్రూప్ 1 నియామక ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 29 తో పాటు వికలాంగుల రిజర్వేషన్లను అమలుకుగాను తెచ్చిన జీవో 96లు వివాదాస్పదంగా మారాయి. అట్లే గత ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్ల పెంపు విషయంలో తీసుకువచ్చిన జీవో 130 పై కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయబడింది. జీవో 29, జీవో 96 విషయంలో విచారణ చేపట్టిన హైకోర్టు పూర్తిస్థాయిలో సమగ్ర పరిశీలన చేయకుండానే ఆలస్యం అనే కారణంతో ఆ పిటిషన్లను కొట్టివేయడం విస్మయాన్ని కలిగిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా ఇప్పటికే జీవో 130 మీద వెలువర్చాల్సిన ఏదో ఒక తీర్పు వాయిదాల పర్వంగా మారిందని రాజ్యాంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ జీవోల రాజ్యాంగ నిబద్ధతను పరిశీలిద్దాం! 2022 లో వేసిన గ్రూప్1 నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ల వారీగా కేటాయింపు చేయబడ్డ పోస్టులను భర్తీ చేయుటకు జీవో 55 తెచ్చారు. వివిధ అనివార్య కారణాలవల్ల ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసి 2024 ఫిబ్రవరిలో కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. దానిలో పేర్కొన్న జీవో 29 ద్వారా ప్రిలిమ్స్ స్థాయిలో రిజర్వేషన్లను పాటించకుండా కేటాయింపు చేయబడ్డ పోస్టులకు తగిన అభ్యర్థులు లేనప్పుడు ఆయా రిజర్వేషన్ అభ్యర్థులను అదనంగా మెయిన్స్‌కు ఎంపిక చేశారు. అంటే ఓపెన్ కేటగిరిలో అర్హత సాధించిన రిజర్వేషన్ అభ్యర్థులు ఓపెన్ కేటగిరి అభ్యర్థులుగా కాకుండా రిజర్వేషన్ అభ్యర్థులుగానే పరిగణించబడ్డారు. కానీ సౌరవ్ యాదవ్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఇది చెల్లుబాటు కాదు. కానీ ప్రభుత్వ వర్గాలు మాత్రం చివరి ఎంపిక ప్రక్రియలోనే రిజర్వేషన్లను పాటిస్తామని కోర్టుకు విన్నవిస్తూ రావడం జరిగింది. అన్ని స్థాయిలలో రిజర్వేషన్లను అమలు చేయాలని దీపేందర్ యాదవ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం




ప్రభుత్వ వాదనను నిర్ద్వందంగా తోసి పుచ్చవచ్చు. కానీ ఇవేవీ పరిశీలించని హైకోర్టు డివిజన్ బెంచ్ జీవో 29 మీద దాఖలైన వివిధ పిటిషన్లను కొట్టివేసింది. దీంతో ఆ జీవో 29 వివాదం ఇప్పుడు మళ్లీ సుప్రీంకోర్టుకు చేరింది. అత్యున్నత న్యాయస్థానం అందులోనూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనానికి వెళుతుండడం వల్ల ఈ కేసు ప్రాధాన్యతను సంతరించుకున్నది. సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు దేశవ్యాప్తంగా వర్తించడమే కాకుండా రిజర్వేషన్ ప్రక్రియ మైన పెను ప్రభావాన్ని చూపనున్నదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మహిళా రిజర్వేషన్లతో పాటు స్పోర్ట్స్ కోటాను, వికలాంగుల కోటాను కూడా హారిజాంటల్ గానే భర్తీ చేయాలని 2007 లో రాజేష్ కుమార్ దారియ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువర్చింది. తెలంగాణ ప్రభుత్వం వివిధ ఉద్యోగాల భర్తీలో భాగంగా వికలాంగుల కోటాను అమలుపరిచే ఉద్దేశంతో జీవో 96 తెచ్చింది. దీని ప్రకారం, వికలాంగుల కోటా భర్తీ విధానం హారిజాంటల్‌గా కాకుండా వర్టికల్‌గా ఉన్నది. ఇది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ఉన్నది. ఇట్టి విషయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ సైతం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో డిస్మిస్ కావడంలో ఆంతర్యం ఏమిటని న్యాయ నిపుణులు ఇతరులు ప్రశ్నిస్తున్నారు. 2022లో వెలువడ్డ అన్ని నోటిఫికేషన్లలో మహిళా రిజర్వేషన్లను కూడా వర్టికల్‌గానే ఇచ్చినప్పటికీ రాజేష్ కుమార్ దారియా కేసులో ఇచ్చిన తీర్పు మేరకు ఆ రిజర్వేషన్లను వర్టికల్‌గా కాకుండా హారిజంటల్ గా మార్చారు. అదే సమయంలో వికలాంగుల కోటాను కూడా హారిజంటల్ గానే భర్తీ చేయవలసి ఉన్ననూ జీవో 96 ద్వారా వర్టికల్ విధానంలోనే అమలు పరుస్తున్నారు. ఇక ఎస్టీ రిజర్వేషన్ పెంపు కొరకు తెచ్చిన జీవో 130కూడా వివాదాస్పదంగా మారింది. ఎస్టీ రిజర్వేషన్ పెంపు ప్రక్రియ పార్లమెంటు సవరణ అనంతరం రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడ్డ తరువాత మాత్రమే అమలకు నోచుకుంటుంది. అంతేకాకుండా ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సామాజిక రిజర్వేషన్లు 50శాతం దాటకూడదనేది నిబంధన. 6శాతం నుండి 10శాతంకు ఎస్టీ రిజర్వేషన్‌ను పెంచడం ద్వారా 50శాతం కోటా దాటుతున్నది. రిజర్వేషన్‌పెంపు ప్రక్రియ అనేది జీవోద్వారా సాధ్యంకాదనేది అటు రాజ్యాంగ నిపుణులు ఇటు న్యాయ కోవిదులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవో 130మీద దాఖలైన పిటిషన్‌ను శీఘ్రగతిన తేల్చాల్సిన ఆవశ్యకత ఉన్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైకోర్టులో దాఖలైన ఈ పిటిషన్ దాదాపు సంవత్సరం కాలంపాటు వాయిదాలతోనే సాగిపోతూనే ఉన్నది. ఇలాంటి సున్నితమైన కేసుల విషయంలో సుప్రీంకోర్టు వెలువర్చినతీర్పులను పరిశీలించడంతోపాటు, రాజ్యాంగ నిపుణుల సలహాలను తీసుకొని సత్వరమేపరిష్కారం చూపాలి.

# వ్యవసాయ యోగ్యమైన భూములన్నిటికీ రైతు భరోసా!

**డాక్టర్ సంగని మల్లేశ్వర్**

ప్రతి మనిషికి పట్టెడు అన్నం పెట్టె రైతు సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ పునర్నిర్మాణంలో రైతే అజెండాగా రేవంత్ ప్రభుత్వం విధి, విధానాలు రుపొందిస్తున్నది. ఇప్పటికే రైతు సంక్షేమాన్ని సాధిస్తున్న రాజ్యంగా దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. నేడు రైతును రాజు చేయాలనీ ముఖ్యమంత్రి కంకణం కట్టుకొని రైతు రుణమాఫీ, రైతు భరోసా తన భుజస్కందాలపై వేసుకొని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్కొక్కటిగా అమలు చేసి తీరుతున్నారు. మొన్నటికి మొన్న ఏకకాలంలో 25లక్షల మందికి రైతు రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించడం జరిగింది. నాడు తెలంగాణ రైతాంగం పంట సాయం కోసం పడరాని తంటాలు పడి ఆఖరికి పుస్తెలతాడు అమ్ముకొన్న పరిస్థితి నుండి గట్టెక్కించేందుకు భూమి ఉన్న ప్రతి రైతుకు కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు అందించింది. దశాబ్ద కాలంగా ప్రభుత్వంపై వ్యతిరేకతను గమనించి నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ ఎన్నికల ప్రచారంలో ఎకరాకు 15వేలు ఇస్తానని, 2లక్షల రైతు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. రైతన్నలు నమ్మి అధికారం ఇచ్చారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుండి రైతును రాజునూ చేయాలనే తండ్లాటతో వ్యవసాయ రంగానికి రూ.57,280కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం రైతు పండుగ చేసింది. డంబాచారం కాళేశ్వరం ప్రాజెక్టు సాగునీరు లేకుండానే ఖరీఫ్‌లో 66లక్షల ఎకరాల్లో వరివేసి, కోటి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికార్డు స్థాయిలో నమోదైంది. ఖరీఫ్ సీజన్లో దేశం లోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. నాడు ఎన్నికల ప్రచారంలో ఇప్పుడైతే 10వేలు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు, కౌలు రైతులకు 15వేలు ఇస్తామని కాలుకు బల పం కట్టుకొని తిరిగి భరోసా ఇచ్చినందుకే అధికారాన్ని కట్ట బెట్టారు. అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలో వ్యవసాయ, ఇతర అనుబంధ రంగానికి బడ్జెట్‌లో 72వేల కోట్లు సింహ భాగం కేటాయించింది. దళారుల ప్రమేయం లేకుండా రైతు నేరుగా తన ఉత్పత్తులను అమ్ముకునే సదుపాయం కల్పించింది. విపత్తుల వల్ల పంట నష్టపోకూడదని పంట భీమా పునరుద్ధరించింది. రైతు భరోసా కోసం విధి, విధానాలు ఖరారు వల్ల ఆలస్యం అయ్యిందని, సంక్రాంతికి భరోసా ఇస్తామని ఖరాఖండిగా చెప్పారు. వ్యవసాయ యోగ్యమైన భూమికే రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించి, దరఖాస్తులు లేకుండానే రైతు భరోసా అందించేందుకు మంత్రివర్గం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదనే ప్రకటన చేసింది. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే హామీ 15వేలు కాకుండా ఎకరాకు 12 వేలు ప్రకటించడం విపక్షాలకు కోతికి కొబ్బరికాయ ఇచ్చినట్టు అయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు ఓట్లు సంపాదించుకునే అవకాశం కల్పించింది. ఇదే అదనుగా బీఆర్ఎస్, బీజేపీ దూకుడు పెంచింది. అయితే సాగు భూమికి రైతు భరోసా ఇచ్చినట్టే 10ఎకరాలకు పరిమితి విధించితే ప్రభుత్వానికి ఆర్థికభారం లేకుండా కాంగ్రెస్ మాట దక్కేదని, ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం ఉంటుందనే అభిప్రాయం నెలకొంది. కౌలు రైతుల సమస్యకు పరిష్కారం చూపలేదనే భావంతో గుర్రుగా ఉన్నారు. వెంకీ పెళ్లి సుబ్బు చావుకొచ్చినట్టు ఎన్నికల వేళ ఏమి జరుగుతుందోనని క్యేడర్ తలపట్టుకుంది. భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12వేలు ప్రకటించడం వల్ల నిరుపేదలు సంతోషంగా ఉన్నారంటే అతిశయోక్తికాదు. దేశంలో వ్యవసాయరంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. రైతన్నల సాగు గిట్టుబాటుకాక, పెట్టుబడి లేక అగమ్యగోచరంగా ఉన్నది. కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. ఓ వైపు ప్రభుత్వ పథకాలు అందక, మరో వైపు పెట్టుబడికి ఆర్థికవనరులు లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారు. దేశంలోని కౌలురైతుల్లో 36 శాతం భూమిలేనివారే. 56శాతం హెక్టారు కంటే తక్కువ భూమి కలిగిన వారు ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ భూమిలో 50శాతంపైగా కౌలు రైతులే సాగుచేస్తున్నారు. తెలంగాణలోని ప్రతి ముగ్గురు సాగుదారుల్లో ఒకరు కౌలు రైతేనని వెల్లడైంది. సమత్వం, సమర్థత లక్ష్యంగా కౌలు చట్టాలు రూపొందించాలని నీతిఆయోగ్ నియమించిన కమిటీ గతంలోనే సూచించింది. దేశ వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలురైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దేశంలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారనే తాజా సమాచారం కేంద్రం దగ్గర లేదు. భూ యజమానులు కౌలు అంగీకార పత్రాలు ఇవ్వకపోవడం అడ్డంకిగా మారిందని కుంటిసాకులు చెప్పుతున్నారు. దానితో ప్రకృతి విపత్తుల దాడిలో పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వాలు అందజేసే పరిహారం అందడంలేదు. దేశంలో కౌలు రైతుల పరిస్థితి నానాటికి దిగజారుతోంది. వీరికి సంబంధించి పలు చట్టాలు తెచ్చినా, ప్రభుత్వాలు మారిన వారి జీవితాల్లో వెలుగులు నిండడం లేదనే విమర్శ ఉంది.

# డాలర్ ఆధిపత్యం, రూపాయి విలువ పతనం

**బొల్లిముంతసాంబశివరావు**

పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో రాజీపడి దేశసహజ వనరులను కట్టబెట్టటమే కాక, దేశ కరెన్సీ అయిన రూపాయి విలువను కూడా అమెరికా సామ్రాజ్యవాదుల దయకు వదిలివేశారు. దానిఫలితమే రూపాయి విలువ పతనమై నేడు డాలర్కి 85.7 రూపాయలగాఉంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి నిదర్శనం. అధికార మార్పిడి జరిగిన తర్వాత 1947లో ఒకడాలర్తో రూపాయి మారకం విలువ 3.50 రూపాయల ఉంది. 1948 నుండి 1980వరకు కొంచెం అటుఇటుగా ఉంది. ఆర్థికసంస్కరణలు ప్రారంభమైన తర్వాత రూపాయి విలువ పతనం ఎక్కువగా జరిగింది. అధికార మార్పిడి దగ్గర నుంచి 2022 వరకు రూపాయి విలువ 79సార్లు పడిపోయింది. నేడు రూపాయి విలువ పతనం తారాస్థాయికి చేరింది. సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంపై ఎక్కువగా ఆధారపడటం, నూతన ఆర్థిక విధానాల అమలు, ఎగుమతి, దిగుమతుల్లో ఉన్నవ్యత్యాసం, పెద్దనోట్లరద్దు, కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ రష్యా యుద్ధం, తాజాగా ముడి చమురు ఉత్పత్తిని తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయం రూపాయి విలువ పతనానికి కారణంగా ఉంది. ప్రపంచ చమురు వినియోగించే దేశాల్లో 3వస్థానంలో ఉన్న భారత్ 85శాతం చమురు దిగుమతిగా ఉంది. చమురే కాకుండా ఫార్మా, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు అవసరమైన ముడిసరుకులు, వంటనూనెలు, ఆహార ధాన్యాలు, పప్పులు, లోహాలను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతులకు చెల్లింపులు డాలర్లలోనే జరపాలి. రూపాయి విలువ తగ్గిన ప్రతిసారి దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ ఉంటుంది. రూపాయి విలువ పడిపోవటం వల్ల దిగుమతి అయ్యే అన్ని వస్తువుల ధరలుపెరుగుతాయి. ధరల పెరుగుదల భారం ప్రజలపైనే పడుతుంది. డీజిల్ ధరలుపెరిగితే, రవాణా చార్జీలు పెరిగి ఉప్పు, పప్పు, ఆహారధాన్యాల ధరలు పెరుగుతాయి. అంతేకాకుండా ప్రయాణఖర్చులు, ఆటోచార్జీలు, బట్టలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫోన్లు, టీవీలు, ల్యాప్టాపుల, వాహనాల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతుంది. రూపాయి పతనం ఫలితంగా బడ్జెట్ లెక్కలు, అంచనాలు మారిపోతాయి. విదేశాలకు ఎగుమతిచేసే వారికి మాత్రం ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాలపై ఏదేశ పెత్తనం ఉంటుందో, ఆదేశ కరెన్సీ ఆధిపత్యం చలాయిస్తుంది. 1947 దాకా ప్రపంచ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లో ఉంది. దాని పౌండ్ కరెన్సీ, ఇతర దేశాల కరెన్సీపై ఆధిపత్యం చలాయించింది. బ్రిటన్ బలహీనపడిన తర్వాత అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తూ, తన డాలర్ కరెన్సీ ఆధిపత్యాన్ని ఇతర దేశాలపై నెలకొల్పింది. చమురును డాలర్లలో చెల్లించాలనే ఒప్పందం కుదరటానికి ముందు అమెరికా కరెన్సీ విలువ ఆదేశం వద్దనున్న బంగారం నిల్వలతో ముడిపడి ఉంది. 1974లో సౌదీఅరేబియా తదితర దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయటంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రంగంలోకి దిగింది. సౌదీఅరేబియా డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వబాండ్లలో మదుపు చేయాలని, దానికిబదులుగాసైనిక, ఆర్థికసహాయం అందిస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంద్వారా సౌదీ అరేబియాను తనవ్యూహంలో అమెరికా ఇరికించింది. అప్పటి



నుండి చమురు ఉత్పత్తిదేశాల్లో డాలర్లలోనే చమురువిక్రయం కొనసాగింది. ముడిచమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలరు ప్రాధాన్యత బాగాపెరిగింది. ముడి చమురుకు అన్నిదేశాలు డాలర్లలో చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రపంచవాణిజ్యంలో డాలర్ ప్రాచుర్యం పొందింది. అంతర్జాతీయ మార్కెట్లో వస్తువులఅమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే కొనసాగటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికాకు ఆధిపత్యం ఏర్పడింది. డాలర్ గిరాకివల్ల ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే దానివిలువ బాగా పెరిగింది. అందరికీ డాలర్లు అవసరంకాబట్టి, దానినే తన ఆయుధంగా వాడుకునేందుకు అమెరికాకు అవకాశం ఏర్పడింది. ఉక్రెయిన్‌తో యుద్ధంవలన రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించటం డాలర్ ఆయుధీకరణకు నిదర్శనం. అమెరికాకు ఎదురుతిరిగే దేశాలకు డాలర్లు చిక్కకుండా చేస్తేవాటి ఎగుమతులు, దిగుమతులకు విఘాతంఏర్పడుతుంది. పెట్టుబడులు ఆగిపోతాయి. డాలర్ కారకంలో ఆయాదేశాల కరెన్సీ విలువ పడిపోయి విదేశీరుణాలపై అసలు, వడ్డీల చెల్లింపులు మోయలేని భారంగామారుతుంది. ఆయాదేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమదేశాల బ్యాంకుల్లో భద్రపర్చటం జరుగుతుంది. అందువల్ల అమెరికా తనకు నచ్చినదేశానికి కావాల్సినంత మేర డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు, నచ్చనప్పుడు ఆదేశపు బ్యాంకు ఎకౌంట్లను స్తంభింప చేసి డాలర్ల కొరత సృష్టించవచ్చు. ప్రస్తుతం మూడవ వంతు ప్రపంచదేశాలు అమెరికా నుండి ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నాయి. ఇతరదేశాల మెడలువంచి అవి తన పెత్తనానికి లోబడి ఉండేలా చేయటానికి కూడా డాలర్ పెత్తనంఅమెరికాకు తోడ్పడుతుంది. అమెరికాకుఆయా దేశాలుచేసే ఎగుమతులు కుదించుకుపోతే, ఆదేశాల దగ్గర ఉన్న డాలర్‌నిల్వలు తరిగిపోతాయి. ఫలితంగా ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవిడాలర్ ప్రమేయంలేని వ్యాపారం ద్వారా పొందవచ్చుకాని ఇప్పటికే ఆదేశాలు ఐఎమ్ఎఫ్ లేదాప్రపంచ బ్యాంకు దగ్గర పొందిన రుణాలు డాలర్లలోనే చెల్లించాల్సి ఉంది. అప్పుడు డాలర్ల అవసరం ఆదేశాలకు తప్పదు. ఆ విధంగా ఐ.ఎం.ఎఫ్ అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని మద్దతుగా ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం డాలర్లలోనే సాగాలనే నిబంధన లేకపోతే చాలాదేశాలు తమ, తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్‌పై ఆధార పడటం అనేదితగ్గితే, అదిఅంతర్జాతీయ వాణిజ్యాన్నిసులభం చేస్తుంది. అది అమెరికాకు ఇష్టంఉండదు. వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు బ్రెజిల్, రష్యా, చైనా, భారత్, దక్షిణాఫ్రికాదేశాలు బ్రిక్స్ దేశాల శాలకూటమిగా ఏర్పడ్డాయి. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ ఎమిరేట్ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా 30 దేశాలు బ్రిక్స్‌లో చేరాలనే ఆలోచనచేస్తున్నాయి. ఐఎంఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేకఆర్థికవ్యవస్థ దీని ఏర్పాటులక్ష్యం. అంతర్జాతీయ వాణిజ్యం ఆయాదేశాల కరెన్సీలలోనే జరగాలనే డిమాండును బ్రిక్ ఎందుకు తెచ్చింది. బ్రిక్స్ దేశాల జనాభా 310 కోట్లకుపైగా ఉంది. ఇదిప్రపంచ జనాభాలో 41శాతం, ప్రపంచ వ్యవసాయంలో 45 శాతం కలిగిఉన్నాయి. బ్రిక్స్ దేశాలు, తమ ద్వైపాక్షిక సంబంధాల్లో జోక్యం చేసుకోని, సమానత్వంతో కూడిన, పరస్పర ప్రయోజనాల ఆధారంగా నిర్వహించుకుంటాయి. అంతర్జాతీయ బ్యాంకులకు దీటుగా ప్రత్యేక అభివృద్ధిబ్యాంకును నెలకొల్పేందుకు బ్రిక్స్ దేశాలు సన్నద్ధమోతున్నాయి. వీటి ప్రయోజనాలు వీటికి ఉన్నా, అమెరికా డాలర్‌ఆధిపత్యాన్ని అడ్డుకోగలిగితే ప్రపంచ వాణిజ్యంలో మార్పులు సంభవిస్తాయి. డాలర్‌ఆధిపత్యాన్ని సహించని రష్యా, చైనాలు డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఆదేశాల కరెన్సీలోనే చెల్లింపులు జరపాలని నిర్ణయించాయి. బ్రిక్స్‌వేదికగా సమరశంఖం పూరించాయి. పెట్రోలిం విక్రయంలో డాలరుకు సౌదీ అరేబియా స్వస్తిచెప్పటం బ్రిక్స్‌కు బలంచేకూరుతుంది. ఇక నుంచి డాలర్లతోపాటు చైనా యువాన్, ఐరోపా సమాఖ్య (ఈయు) యూరో, జపానీస్యెన్లలోను చెల్లింపులు స్వీకరిస్తామని చెప్పింది. వివిధదేశాల కేంద్రబ్యాంకులు కలిసి ఉమ్మడికరెన్సీ వెలువరించే ప్రయత్నంలో ఉన్నాయి. ఆకరెన్సీ స్వభావం గురించి ఉమ్మడి అభిప్రాయం రావాల్సి ఉంది.

# ప్రజావాక్కు



### మానవ తప్పిదమే

మానవ తప్పిదం కారణంగానే తిరుపతి నగరంలో తొక్కిసలాట సంఘటన జరిగిందన్నది విస్పష్టం. తిరుమలకు వైకుంఠ ఏకాదశి నాడుభక్తులు పోటెత్తడం ఆనవాయితీగా వస్తున్నది. అంతేకాక క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో టిటిడి ఉద్యోగులకు అపారమైన అనుభవమున్నది. అయితే ఈ పరిస్థితిఎందుకు తలెత్తింది అన్నఅంశంపై ప్రభుత్వంలోతైన దర్యాప్తుజరిపించాలి. వైకుంఠ ఏకాదశి నాడు లక్షల సంఖ్యలో జనం తిరుమలకు వస్తారన్న అంచనాలు ఉన్నప్పటికీ దానికైచేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టత లోపించడం వైఫల్యంగా కనిపిస్తున్నది. ప్రతి గంటకు భక్తుల సంఖ్య పెరగడం ఉదయం నుంచి జరుగుతూనే వున్నా, పెరుగుతున్న సంఖ్యను దృష్టిలోపెట్టుకొని ప్రభుత్వ యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే బాగుండేది.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### ప్రాక్టీస్ ముఖ్యం

గత ఆరు నెలల నుంచి టీం ఇండియా క్రికెట్ వరుస పరాజయాలతో కుదేలవుతుంది. ముఖ్యంగా స్వదేశంలో న్యూజిలాండ్‌తో3-0ఓటమిజీర్ణించుకోలేకున్నాం. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంది. గంటల తరబడి నెట్ ప్రాక్టీస్‌లో చెమటోర్చి అపారమైన అనుభవం ఉంది కూడా. ఈ పేలవప్రదర్శనకు ముగింపు పలకలేకున్నారు. విదేశీగడ్డపై టెస్టువిజయం సాధించాలంటే పాస్టు, బౌన్సీ పిచ్‌ల్లో క్రమం తప్పకుండా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### సహకార ఉద్యమం విస్తరించాలి

భారతదేశం ఎంత వైవిధ్యం ఉన్న ఏకత అనే భావన మాత్రమే ఇవ్వాళ భారత దేశంను ఒక విభిన్న పరిపూర్ణ దేశంగా ఉంచుతుంది. అయితేదానికి ప్రధానమైన మౌలిక భూమిక గాంధీజీ ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్యం. అది గ్రామోదయంఉద్యమంలోను లేదాఅమూల్ ఉద్యమంలోను లేదా ముల్కనూర్ ఉద్యమ కోణం నుండి చూడాలిన అవసరం ఉన్నది. అయితే ఇందులో 60శాతం మహిళలు ఈ సహకార ఉద్యమంలో భాగంకావడం భారత్ సాధించిన గొప్ప ప్రగతికి నిదర్శనం. ఇలా చేసి వారు ప్రపంచానికి ప్రతీకలుగా నిలుస్తున్నారు. అయితే ఈ సహకార ఉద్యమం మరింత విస్తరించాలి.

- భారత అవినాష్, జనగామ

### ఎక్కడి విద్యా సంస్థలు అక్కడే ఉండాలి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాలలు డిగ్రీ కళాశాలలు ఎక్కడ ఏ ప్రాంతంలో మంజూరు అయితే అక్కడనే విద్యాసంస్థలు నడవాలి. క్లాసులు కూడా మంజూరు అయినప్రాంతంలోనడవాలి. ప్రభుత్వ రికార్డులప్రకారం ప్రభుత్వ గురుకుల కళాశాలలు మంజూరు అయినది ఒక చోట క్లాసులు జరిగేది మరొకచోటకావడం వలనవిద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. లెక్చరర్స్ కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వపరంగా రికార్డులపరంగా టెక్నికల్ సమస్యలు ఎదురవుతున్నాయి. సర్టిఫికెట్స్ రాయడంలో పరీక్షలు నిర్వహించడంలో వసతి కల్పించడంలో అధికారులకు మరీ ముఖ్యంగా ప్రిన్సిపాల్‌లకునిర్వహణ చాలాకష్టం అవుతుంది. 2025-2026 విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్ నెల నుండి ఎక్కడి విద్యాసంస్థలు అక్కడనే నిర్వహించే విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### ప్రమాదకరం

ఈమధ్య కొందరు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు దాటుతున్న పాదచారులని ఢీకొడుతూవారి ప్రాణాలు పోవడానికి, అంగ వైకల్యానికి కారణమవుతున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించమని, హెల్మెట్ పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనం పైన ఇద్దరు కంటే ఎక్కువమంది ప్రయాణించవద్దని, అతివేగం వద్దని ఎంతగానో ప్రచారం కల్పించి, జరిమానాలు విధిస్తున్నా కొందరు అస్సలు లెక్కచేయడంలేదు. ఇప్పటికైనావారు మేల్కొని ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ మంచి పౌరులుగా పేరు తెచ్చుకోవాలి.

-ఎన్. కృష్ణ, హైదరాబాద్

### నిర్లక్ష్యం ఎవరిదీ?

పవిత్రమైన తిరుమలలో వైకుంఠద్వారదర్శనం కోసం తిరుపతిలో టోకెన్లు జారీ కౌంటర్ల వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో ఆరుగురు చనిపోవడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. వైకుంఠఏకాదశి పర్వదినం సందర్భంగా లక్షలాది మంది భక్తులువస్తారని తెలిసి కూడా టోకెన్ల కోసం వచ్చే భక్తులను అంచనా వేయడంలో టి.టీ.డీ పూర్తిగా విఫలం అయింది అని చెప్పవచ్చు. ఎంత మంది భక్తులు వస్తారు? జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి దుర్ఘటన జరగకపోవచ్చు.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెనాలి బండ్ పై పద్మభూషణ్ విగ్రహం ఓ మైలురాయి

## -మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి, జనవరి 12 (ప్రభాతవార్త) : సూపర్‌స్టార్ కృష్ణ క్యాంశ విగ్రహాన్ని, తెనాలి బండ్‌పై ఆవిష్కరించుకోవడం అద్భుతమైన మైలురాయని, యాభై ఏళ్ళ సినీ రంగంలో ఆధునిక సాంకేతిక నైపుణ్యానికి కృష్ణ ఆద్యులుగా నిలిచారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక వివిఎస్ఆర్ అండ్ ఎన్‌వివిఆర్ కళాశాల ఎదురుగా తెనాలి బండ్‌పై ఆదివారం పద్మభూషణ్ సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. ఈ విశేష కార్యక్రమంలో ఆత్మీయ అతిధులుగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, పెమ్మసాని రవిబాబు తదితర సూపర్‌స్టార్ కృష్ణ అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ బుర్రిపాలెం గ్రామంలో జన్మించిన సూపర్‌స్టార్ కృష్ణ, సినీ రంగంలో 50సంవత్సరాలు విలువలకు పెద్ద పీఠ వేశారని అన్నారు. పార్లమెంటు సభ్యుడిగా, సినీ నటుడిగా, ప్రజల మనిషిగా సూపర్‌స్టార్ కృష్ణ సేవలు చిరకాలం గుర్తుంటాయన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ అభిమానుల శైలి ప్రత్యేకమని, డేరింగ్ డాషింగ్ విధానంలో ముందుంటారని అన్నారు. తెనాలి ట్యాంక్ బండ్‌పై సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం అన్నారు. మాజీ ఎమ్మెల్యే గోగినేని ఉమ మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ నిర్మాతలు మెచ్చిన హీరో అని అన్నారు. తను నటించిన సినిమా ద్వారా నిర్మాతకు నష్టం వచ్చే పరిస్థితి ఏర్పడితే, కృష్ణ వారికి తోడ ఆపటు ఇచ్చేవారని, అటువంటి నటుడి విగ్రహం ఏర్పాటు చేసిన ఈ రోజు, సుభదినమని అన్నారు. నేటి నటీనటులు సూపర్‌స్టార్ కృష్ణ సినీ జీవిత విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కృష్ణ సోదరులు ఘట్టమనేని శేషగిరిరావు మాట్లాడుతూ బుర్రిపాలెంలో జన్మించినా, తామంతా తెనాలిలో చదువుకున్నామని, తెనాలితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అశేష అభిమానుల సమక్షంలో సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ప్రారంభం పలు ప్రాంతాల సూపర్‌స్టార్ కృష్ణ అభిమానులలో జోష్ నింపింది.



# గుంటూరు వార్త

# పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేసిన చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ, జనవరి12, ప్రభాతవార్త:** గుంటూరు జేకేసీ కాలేజి రోడ్డులోని కేఎల్‌పి పబ్లిక్ స్కూల్‌లో శ్రీ కాకతీయ విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. విద్యార్థులు, మంచి లక్ష్యాలతో జీవితంలో ముందుకు సాగి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.



# అమరావతి రాజధానిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం : ఎంపి కేశినేని

**మంగళగిరి, జనవరి 12, ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తయారుచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం అందిస్తున్నారు. అందుకే రాజధాని ప్రాంతం మంగళగిరిలోని ఏసిఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని అభివృద్ధి చేయడంతోపాటు అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేసినట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో ఏసిఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈనెల 12 నుండి 23వ తేది వరకు మంగళగిరిలో ప్రిమియర్ లీగ్ (ఎంపిఎల్), సీజన్-3 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఈ ఎంపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంపిఎల్ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఎంపి కేశినేని టాస్ వేయగా మంగళగిరి టీమ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. అనంతరం ఎంపి కేశినేని, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో ఏపి స్టేట్ ఆర్యవైశ్య సంఘం నాయకులు సంకా బాలాజీ గుప్తా, టిడిపి నాయకులు తోట పార్థసారధి, గోవాడ దుర్గారావు, మల్లవరపు వెంకట్, ఆరుద్ర భూలక్ష్మీ, జొన్నాదుల బాలకృష్ణ, జనసేన నాయకులు మునగపాటి వెంకట మారుతీరావులతో పాటు ఎన్డీయే కూటమి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్యఅతిధిగా హాజరై ఎంపిఎల్ సీజన్-3 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఎంపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంపి కేశినేని శివనాథ్‌కి ఆంధ్రప్రదేశ్

# కోడిపందాలు, జూదము నిర్వహించడం నిషేదం

## అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు : బాపట్ల ఎస్పీ తుషార్‌డూడి

**బాపట్ల, జనవరి12, ప్రభాతవార్త:** తెలుగు సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకునే సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాలలో నూతన వెలుగులు, సంతోషాలను నింపాలని, జిల్లా ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలను జిల్లా ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందాలు, గుండాట, జూదము నిర్వహించటం నిషేదమన్నారు. ఎటువంటి జూద క్రీడలు నిర్వహించవద్దని, గతంలో కోడి పందాలు నిర్వహించిన, ఆడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో గతంలో కోడి పందాలు నిర్వహించిన ప్రాంతాల్లో అనుమానిత ప్రదేశాలలో గస్తీ నిర్వహిస్తున్నామని ఆయనతెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి కోడి పందాలు, గుండాట, జూదము, కోడి పందాలలో పాల్గొన్న, నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

**గుంటూరు కలెక్టరేట్, జనవరి 12, ప్రభాతవార్త :** భోగి పండుగ సందర్భంగా 13వ తేది సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరగదని (రద్దు పరచినట్లు) జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలియ జేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయి

**చందర్లపాడు జనవరి 12 ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని చందర్లపాడు ఎస్సై దుర్గా మహేశ్వర రావు పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని చందర్లపాడు పట్టణ పరిధిలో ఆటల పోటీలను ఎస్సై దుర్గా మహేశ్వరరావు ఆయన చేతులతో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల మక్కుల చూపాలన ఆయన అన్నారు. క్రీడలు ఆటడం వల్ల శారీర దారుణ్యానికి ఎంతగానో దోహదపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు

**నందిగామ జనవరి 12 ప్రభాతవార్త:** నందిగామ పట్టణంలో రథం బజార్లో మక్కోటి మహా మండపంలో 125 వ శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా నిర్వహింస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజుఆదివారం స్వామివారికి విశేష అర్చనలు హైదరాబాద్ పట్టణానికి చెందిన బ్రహ్మ మల్లాది వెంకట రామనాథ శర్మ చే శ్రీ మద్రామాయణం పురాణ ప్రవచనం విజయవాడ పట్టణానికి చెందిన బ్రహ్మ శ్రీ కప్పగంతుల రామకృష్ణ చే పండుగలు పరమార్థం అధ్యాత్మిక ప్రవచనం, హైదరాబాద్ పట్నానికి చెందిన లలిత గాన తిలక్ సంయుక్త చే భక్తి సంగీత విభావరి, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిని కథాగాన సుధామయ, సువర్ణ హస్త ఘంటా కంకణం కె.శారద భాగవతారినణిచే భక్త ధృవ హరికథ గానం అందరిని ఆకట్టుకున్నాయి.



# బిజెపి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**నందిగామ జనవరి 12 ప్రభాతవార్త :** నందిగామ భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు ఈ రోజు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయనకు నివాళులిర్పంచి వివేకా నందుడు ప్రతి ఒక్క పుస్తకాన్ని చదివి ఆచరణలోకి తసుకోబట్టే ప్రపంచ దేశాలలో హైందవ జాతి మేలుకొలుపునకు ఆయన చేసిన కృషి అని ఆ సందర్భగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణఅధ్యక్షుడు మునగంటి కామేశ్వరరావు, కన్వీనర్ తొర్లి కొండ సీతారామయయ కో కన్వీనర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు నరసింహారావు. కొత్త సాంబశివరావు, తూటారికృష్ణ ఊటుకూరు సత్యనారాయణ గుప్తా. శివ ఆంజనేయులు రమేషు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్సాహంగా మహతీ స్వరసుధ రజతోత్సవ వేడుకలు

**గుంటూరు కల్చరల్, జనవరి 12, ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి కళ్యాణవేదికపై ఆదివారం మహతీ స్వరసుధ రజతోత్సవ వేడుకలు ప్రధమ కార్యక్రమం సంస్థ అధ్యక్షులు పత్రి నిర్మల ఆధ్వర్యంలో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. గాయనీ గాయకులు సిహెచ్ రాజ్యలక్ష్మి, జరినా, హేమామాలిని, డాక్టర్ జే.ముకుంద ప్రియ, టి. రమాదేవి, వి. రాజేశ్వరిదేవి, జే. రేష్మ, ఎన్. కృష్ణ, నాగపల్లవి, ప్రద్యుమ్న, వీరయ్య, వీర రాఘవ, ఎస్‌కె వలి, కృష్ణప్రసాద్ అలనాటి సినీసౌరభాలు చక్కగా గానం చేసి ఆహుతులను అలరించారు. కీబోర్డుపై కె. రవిబాబు, తబలపై ఎస్. వెంకట్, ప్యాడ్స్‌పై వి.ప్రసాద్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా డాక్టర్ నరసింహారావు, గౌరవాతిథులుగా ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య, కోటా సాంబశివరావు, పట్టస్వామి గోపాలకృష్ణమూర్తి, కొడాలి వీరభద్రరావు పాల్గొన్నారు. కార్యక్రమాలను కె. మదన్మోహన్ నిర్వహించారు. కార్యక్రమానికి వ్యాఖ్యతగా బి. కృష్ణప్రసాద్ వ్యవహరించగా కె. మదన్మోహన్ పర్యవేక్షించారు.



# యువతకు స్ఫూర్తి వివేకానంద : ఎంపి లావు

**సత్తెనపల్లి, జనవరి 12 ప్రభాతవార్త :** యువతకు స్ఫూర్తి వివేకానంద అని నరసరావుపేట పార్లమెంట్‌సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. దేశాభివృద్ధిలో కీలకం యువత అని, అలాంటి శక్తికి స్ఫూర్తి స్వామి వేకానంద అని అన్నారు. స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నవచైతన్య వివేకాసమితి ఆధ్వర్యంలో జరిగే జయంతి కార్యక్రమ ఏర్పాటు అభినందనీయమన్నారు. దేశ, విదేశాలలో ఉన్న భారతీయ యువతను తన ప్రసంగాలతో ఉత్తేజపరిచారని తెలియజేశారు. స్వాతంత్ర్య సాధనకు ఆయన చేసిన కృషి అద్భుతమని ఎం.పి.లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలియజేశారు.



# కోడి పందాలు, జూదం నిర్వహిస్తే కఠినచర్యలు : పల్నాడు ఎస్పీ

**నరసరావుపేట క్రైం, జనవరి 12 ప్రభాతవార్త :** సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడి పందాలు, జూదం నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిషేధి ఆటలను ఆడేందుకు అనుమతులు ఎవరికీ లేవన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామంలో కోళ్ళ పందాలు వేసేందుకు ఏర్పాటు చేసిన స్థలాన్ని రొంపిచర్ల ఎస్.ఐ. అశోక్ ధ్వంసం చేశారన్నారు. స్థలాలను అద్దెలకు ఇచ్చివారిపై సైతం కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే పలువురు బైండోవర్ కేసుల్లో ఉన్నారని గుర్తు చేశారు. ఏదైనా సమాచారం ఉంటే 112కు తెలియజేయాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలియజేశారు.



# సర్వమానవ సేవే భగవంతుని సేవ

## - గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు తూర్పు, జనవరి 12 ప్రభాతవార్త :** సర్వమానవ సేవ దేవుని సేవతో సమానమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం నంబూరులో ఏర్పాటు చేసిన ఇస్తమా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్తమా కార్యక్రమానికి హాజరైన రెండు లక్షల మంది భక్తులకు ఉచితంగా మంచినీటి బాటిళ్ళను ఎమ్మెల్యే నసీర్ సొంత నిధులతో సరఫరా చేశారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఇస్తమా వంటి కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక చింతనతో పాటు మానసిక వికాసం కగుతుందన్నారు. భగవంతుడు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ఆయన చెప్పిన మాటలు ఆచరించాలని సూచించారు. అప్పుడే జీవితం సన్మార్గంలో పయనిస్తుందన్నారు. మైనార్టీల సంక్షేమానికి సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నంబూరులో ఏర్పాటు చేసిన ఇస్తమా కార్యక్రమానికి రెండు లక్షల మంది భక్తులు హాజరయ్యారని, వీరికి సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇస్తమాకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులు కేటాయించి సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నెలల్లోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. ముస్లిం కార్పోరేషన్ ద్వారా సులభరీతిన రుణాలు మంజూరు చేస్తుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనాలు అందిస్తున్నామని వెల్లడించారు. దీని ద్వారా రాష్ట్రంలోని 88 వేల మసీదుల్లోని మౌజన్లు, ఇమామ్‌లకు లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే నసీర్ తెలియజేశారు.



# సంక్రాంతి సోయగం... ముగ్గులతో ఆరంభం.. భోగి మంటలతో తేజోమయం

రెంటచింతల, జనవరి 12 ప్రభాతవార్త: భోగభాగ్యాల భోగి పండుగను మండలంల ప్రజలు ఉత్సాహంగా జరుపుకోనున్నారు. సోమవారం సోమవారం ఆరుద్ర నక్షత్రం భోగి విశేషమైంది కావడంతో నేటి సంక్రాంతి మరింత శోభను సంతరించుకుంది. దక్షిణాయంలో పడిన కష్టాలు, బాధలు తొలగిపోవాలంటూ అగ్ని దేవుడికి భోగి మంట సమర్పించి రాబోవే ఉత్తరాయణ కాలంలో సుఖసంతోషాలను ప్రసాదించాలని కోరుకోవడమన్న పరమార్థమే భోగి పండుగ విశిష్టత. తెల్లవారుజామునే మంగళస్నానాలు చేసి సంప్రదాయబద్ధంగా ఇళ్లు, లోగిళ్ల ముందు భోగి మంటలు వేయనున్నారు. ఏడాదంతా భోగభాగ్యాలు అందించాలని కోరుకుంటూ వేసిన భోగి మంటల చుట్టూ చేరి పిల్లలు, పెద్దలు సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. తెల్లవారుజామున హరిదారుల సంకీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, యువతులు ఇంటి ముందు రంగవల్లులను తీర్చిదిద్దడంతో పల్లెల్లో పండుగ కోలాహలం మొదలైంది. ఇళ్ల ముందు మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అందంగా అలంకరిస్తుండటంతో సంక్రాంతి శోభ వెల్లివిరుస్తోంది. ఇంటింటా వాకిట్లో ముగ్గులతో, పట్నం నుంచి వచ్చిన బంధుమిత్రుల ఆగమనంతో లోగిళ్ల కళకళలాడుతున్నాయి. భోగి రోజున ప్రత్యేక ఘట్టమైన భోగి పండ్ల పేరంటంలో భాగంగా చిన్నారుల తలపై రేగుపళ్ల, పువ్వులు పోసి దీవించి పెద్దలు మురిసేందుకు తాపత్రయపడుతున్నారు. అలాగే పండుగ వేళ సంప్రదాయ వస్త్రాలంకరణలో ఆడపడుచులు మెరియనున్నారు. ఇప్పటికే పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. భోగి రోజున రంగనాథస్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిందని పురాణ పండితుల ఉవాచ మేరకు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం, సుబ్బన్న తోటలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు సత్రశాల ఆలయంలో గోదా కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా జరిగే గోదాదేవి పరిణయ కార్యక్రమాన్ని భక్తులు కన్నులారా వీక్షించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి.





# భోగిమంటల వేడుకలో మంత్రి నాదెండ్ల మనోహర్

**తెనాలి, జనవరి 12 (ప్రభాతవార్త) :** సంక్రాంతి చైతన్యానికి ప్రతీకగా భోగి పండుగ ప్రాధాన్యతను చాటుతూ మండలంలోని పెదరావూరు గ్రామంలోని మంత్రి మనోహర్ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం రాత్రి భోగిమంటలు వేడుక ఉల్లాసంగా కొనసాగింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పార్టీ శ్రేణుల సమక్షంలో లాంచనంగా భోగి మంటల వేడుకను ప్రారంభించారు. వివిధ శాఖల అధికారులు, జనసైనికులు, వీర మహిళలు, బోగి మంటల వేడుకలో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగ మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మన సంస్కృతి ప్రతిభింబించేలా ప్రతి ఇంటా సంక్రాంతి శోభ వెల్లి విరియాలన్నారు. ఈ నూతన సంవత్సరం నుండి కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రజలందరి ప్రయోజనాలకు తగు ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. రైతుల ప్రయోజనం కోసం కట్టుబడి గత ప్రభుత్వం చెల్లించాల్సిన 1674కోట్ల బాకయిలు చెల్లించామన్నారు. జిల్లాలో ఖరీఫ్ సాగు చేసిన రైతులకు భరోసాగా చేపట్టిన కార్యక్రమాల ద్వారా రైతాంగంలో సంక్రాంతి శోభతో కూడిన వెలుగులు చూస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ బి.శేషన్న, తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, డిఎస్పీ బండి జనార్ధనరావు, వివిధ విభాగాల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# యువత క్రీడల పట్ల మక్కువ చూపాలి

**నందిగామ జనవరి 12 ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని దాములూరు టిడిపి నాయకులు చల్లా తులస రావు సంక్రాంతి సంబరాలు సందర్భంగా దాములూరు గ్రామంలో కబడ్డి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు చల్ల తులసరావు చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాములూరి గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు గాదెల వీరబాబు, నేలవెల్లి సిద్దార్థ మంద వినోద్ మరియు జనసేనా పార్టీ నాయకులు బృగుబండ్ల రాకేశ్ శకముడి శ్రీకాంత్ పాల్గొన్నారు.



# మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైన ఎల్‌ఓసి చెక్కు అందజేత

మంగళగిరి, జనవరి 12, ప్రభాతవార్త : మంగళగిరి పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న దామర్ల దుర్గామహేశ్వరరావుకు మంత్రి నారా లోకేష్ సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.4.50లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసి) ఇప్పించారు. మంగళగిరి పట్టణంలోని షరాఫ్‌బజార్‌కు చెందిన దామర్ల దుర్గమహేశ్వరరావు అనారోగ్యానికి గురై మంగళగిరి ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంత్రి నారా లోకేష్‌కు అర్జీ పెట్టుకోగా వెంటనే స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి రూ.4.50లక్షల ఎల్‌ఓసి మంజూరు చేయించారు. ఆ ఎల్‌ఓసి పత్రాన్ని టిడిపి నాయకులు ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్ళి అందజేశారు. దీనితో మంత్రి నారా లోకేష్‌కు దుర్గమహేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 30వ వార్డు అధ్యక్షులు బైరబోయిన శివశంకర్, పట్టణ బిసిసెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, పట్టణ కార్యదర్శి బైరబోయిన శ్రీనివాస్, టిడిపి నాయకులు వల్లభనేని భార్గవ్, కాకర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# నేటి యువత విద్యతో పాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి

## - ప్రముఖపారిశ్రామికవేత్త జెట్టి శివరాం ప్రసాద్



**పెదకాకాని, జనవరి12, ప్రభాతవార్త:** నేటియువత ఉన్నత విద్య, ఉద్యోగాలతో పాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనాఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త, గ్రీన్‌సోల్ పవర్ సిస్టమ్స్ చైర్మన్ అండ్ మేజేజింగ్ డైనెక్టర్ జెట్టి శివారాంప్రసాద్ అన్నారు. ఆదివారం ఉదయం పెదకాకాని మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామ శివారులోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో కౌండిన్య ఎడ్యుకేషనల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 19వ, ఉపకారవేతన ప్రధానోత్సవ సభలో ముఖ్యఅతిధిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు చైర్మన్‌డాక్టర్ ఈ.వి.నారాయణ అధ్యక్షత వహించారు. జెట్టి శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో ప్రతిభ కలిగి అర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆర్థిక చేయూతనివ్వడంతో పాటు కెరీర్ గైడెన్స్, పోటీపరీక్షలకుశిక్షణ ఇవ్వడం ద్వారా సామాజిక పురోభివృద్ధికి దోహదపడటంలో కౌండిన్యట్రస్ట్, ఐఏఎస్ అకాడమీలు సహకారం అందించడం ఎంతో అభినందనీయ మన్నారు. ప్రతి ఒక్కరిలో మేధాశక్తి తెలివితేటలు ఉంటాయని. వారు క్రమశిక్షణతో, నిరంతర శ్రమతో అంకితభావంతో కృషి చేస్తే ఏదెనా సాధించగలరన్నారు. మారుతున్న శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని యువత తమ అవసరాలకు వినియోగించుకొని ఉన్నత స్థితికి ఎదగాలని అకాంక్షించారు. అనంతరం అతిధులు జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. సభనంతరం అతిధులు వారి తల్లితండ్రులు, స్థానిక ప్రముఖులు విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. ఈ కార్యక్రమంలో వడ్డేగుంట సుబ్బారావుడాక్టర్ తాతా సాంబశివరావు, ఎక్స్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కారంకి లక్ష్మీనారాయణ, పామర్తి సాంబశివరావు, బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు, చిలకా చంద్రమౌళి, డాక్టర్ టి. సేవకుమార్, బెల్లంకొండ సదాశివగౌడ, డాక్టర్ ఎన్ కృష్ణ ఇతర ట్రస్ట్‌అండ్‌ఐఏఎస్ అకాడమీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

## -రాష్ట్ర పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర,జనవరి 12 ప్రభాతవార్త: రైతు సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.మండల పరిధిలోని అత్తోట గ్రామంలో రూ.1.85 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిర్మించిన గోకుల షెడ్‌ను మంత్రి మనోహర్,జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీతో కలసి ప్రారంభించారు.అనంతరం జరిగిన సభలో



మనోహర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలో ఉన్న కొన్ని ఇబ్బందులను లోతుగా అవగాహన తెచ్చుకుని మార్పును తీసుకురావాలని ముందుకు వచ్చామన్నారు.గత ప్రభుత్వం నిధులు తమ సొంత అవసరాల కోసం వాడుకుని గ్రామీణ వాతావరణాన్ని దెబ్బతీసిందని..గత ఐదు సంవత్సరాలలో ఏ పని చేయలేదన్నారు.ఉపాధి హామీ పథకం పేదరిక నిర్మూలనకు..గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు వేసవికాలంలో పనులు కల్పించేందుకు తీసుకురావటం జరిగిందన్నారు.పల్లెపండుగ కార్యక్రమంలో అత్తోట గ్రామంలో మూడు సీసీ రోడ్లను నిర్మించటం జరిగిందన్నారు.ఈరోజు మినీ గోకులం క్రింద రై.1.85 లక్షలతో నిర్మించిన షెడ్డును ప్రారంభించుకుంటున్నామన్నారు.లబ్ధిదారులు 10 శాతం చెల్లించాల్సి ఉందన్నారు.వ్యవసాయానికి అదనంగా పాడిపరిశ్రమ ద్వారా గేదెల పాల ఉత్పత్తి ద్వారా రైతు కుటుంబానికి ఆదాయం వస్తుందన్నారు.గ్రామంలో ఇంకా ఎవరైనా గోకుల షెడ్లు నిర్మించదలచుకుంటే ధరఖాస్తు చేసుకున్న ఎడల మంజూరు చేయటం జరుగుతుందన్నారు.ఉప ముఖ్యమంత్రి మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి నాబార్డ్ నుంచి రూ.25 కోట్లు సీసీ రోడ్ల నిర్మాణానికి శాంక్షన్ చేయించారని పేర్కొన్నారు.అత్తోట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ పల్లె పండుగలో భాగంగా అక్టోబర్‌లో సీసీ రోడ్లు ప్రారంభించటం జరిగిందని,సంక్రాంతి పండుగకు పనులు పూర్తి చేసేవిధంగా చూడాల్సి ఉందన్నారు.జిల్లాలో పల్లె పండుగ క్రింద సీసీ రోడ్లను గ్రౌండ్ చేయటం జరిగిందని,170 సీసీ రోడ్లు శాంక్షన్ చేయగా 60 శాతం రోడ్లు పూర్తి చేయటం జరిగిందన్నారు.ఇంకా 10 రోజుల్లో మిగిలి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.మినీ గోకులం



క్రింద 186 మందికి షెడ్లు శాంక్షన్ చేయటం జరిగిందని,అందులో 170 మంది షెడ్లు నిర్మాణం పూర్తి చేయటం జరిగిందన్నారు.నాలుగు పశువుల షెడ్‌కు రూ.1.85 లక్షలు,6 పశువుల షెడ్‌కు రూ.2.30 లక్షలు అందించటం జరుగుతుందని,వీటిలో లబ్ధిదారులు 10 శాతం చెల్లించాల్సి ఉందని,ఇంకా ఎవరైనా గోకులం షెడ్ కొరకు ధరఖాస్తు చేసకుంటే వారికి మంజూరు చేయటం జరుగుందన్నారు.గ్రామంలో పండుగ వాతావరణంలో సంక్రాంతి రంగోళీ ఏర్పాటు చేయటం చాలా బాగుందని ప్రశంసించారు,కార్యక్రమంలో పీడీ డ్వామా బి.శంకర్,తహశీల్దార్ గుమ్మడి సిద్దార్ధ,ఎంపీడీఓ విజయలక్ష్మీ,సెక్రటరీ లక్ష్మీ,గ్రామ ఉప సర్పంచ్ దివ్వెల ఏడుకొండలు,జనసేన మండల అద్యక్షుడు యర్రు వెంకయ్యానాయుడు,జనసేన నాయకులు అడపా నారాయణరెడ్డి,పొలిశెట్టి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

# అసిస్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు

## - అసిస్ట్ స్వర్ణోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి

**చిలకలూరిపేట,జనవరి12,ప్రభాతవార్త:** అసిస్ట్ స్వర్ణోత్స వాలలో బాగంగా ఆదివారం పలు కార్యక్రమాలను అసిస్ట్ ఆవరణలో నిర్వహించారు. అసిస్ట్ సంస్ద నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసిస్ట్




చేస్తున్న కార్యక్రమాలను పరిశీలిస్తే చాలా ఆశ్చర్యంగా ఉందని, గ్రామాలను దత్తత తీసుకొని చాలా కష్టపడి అభివృద్ధి పరిచారని తెలిపారు. జాస్తి రంగారావు 50 సంవత్సరాల సుధీర్ఘకాలం సేవ చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. గ్రామీణాభివృద్ధికి ఎన్నిరకాలుగా అభివృద్ధి చేయవచ్చునేది అసిస్ట్ చేసినటువంటి, చేస్తున్నటువంటి కార్యక్రమ వివరాలను చూస్తే తెలుస్తుందన్నారు. వనరులు ఉన్నవారు పేదవారి కోసం కొంతమేరకైనా సహాయం చేస్తే వారి అభివృద్దికి ఎంతో తోడ్పడినట్లు అవుతుందని తెలిపారు.



అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అసిస్ట్ స్వర్ణోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, మాజీ యంపి మోపిదేవి వెంకటరమణ, అసిస్ట్ అధ్యక్షులు డాక్టర్ వడ్లమాని రవి, అసిస్ట్ ఆపరేషనల్ డైరక్టర్ జాస్తి రంగారావు, అసిస్ట్ అసోసియేట్ డైరక్టర్లు జాస్తి కృష్ణహరీష్, విష్ణుప్రియ, రోటరి డైరక్టర్ డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అసిస్ట్ అసోసియేట్ డైరక్టర్లు జాస్తి కృష్ణహరీష్, విష్ణుప్రియలు పలువురికి జ్ఞాపికలు అందచేశారు.

# శ్రీ బగళాముఖి అమ్మవారినిదర్శించుకున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లలిత

**పిట్టలవానిపాలెం,జనవరి12,ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం మడలం చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయానికి కర్ణాటక స్టేట్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కన్నగంటి లలిత చేరుకుని అదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమె కుమార్తె వివాహ ఆహ్వాన శుభలేక అమ్మవారికి అందజేయడానికి గాపూ అమ్మవారికి పసుపు ,కుంకుమ చీర సారే తో శుభలేక సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తను నాలుగు పర్యాయాలు ఈ అలయానికి రావడం జరిగిందన్నారు. అమ్మవారి యొక్క దర్శనం ఎంతో సంతోషదాయకంగా ఉంటుందన్నారు.ఈ సందర్భంగా వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి శేషవస్త్రంతో వేద అశీర్వచన జరిపించామని ఆలయకార్య నిర్వహణాధికారి డాక్టర్‌ఘంటసాలనరసింహామూర్తి తెలిపారు.



# న్యాయవాది కర్రా దీపికకు అరుదైన గౌరవం

## ఎన్‌వైఎవైఎ రాష్ట్ర మహిళాసెక్రటరీగా దీపిక ఎంపిక

**బాపట్ల,జనవరి12,ప్రభాతవార్త:** బాపట్ల పట్టణం దగ్గుమల్లివారిపాలెం కుచెందిన న్యాయవాది కర్రా దీపికకు అరుదైన గౌరవం దక్కింది.నవభారత్ యంగ్ ఆడ్వకేట్స్,యంగ్ స్టూడెంట్స్ ఆసోసియేషన్‌లో రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీగా ధీపికకు సముచితస్దానం లబించింది.ఈ సందర్బంగా ఆడ్వకేట్ దీపిక మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన సంస్ద రాష్ట్ర అధ్యక్షులుఎన్ రుద్రవేదంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.రాష్ట్రంలో న్యాయ విద్యార్ధులు, న్యాయవాదుల సమస్యలపై ప్రభుత్వంతో సంప్రదింపులు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలికంగా రద్దు

**బాపట్ల,జనవరి12,ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జనవరి 13న భోగి పండుగ సందర్భంగా తాత్కాలికంగా4 రద్దు చేయడం జరిందని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అదివారం ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాదల్చిన ఆర్జీదారులు సదరు విషయాన్ని గమనించాలన్నారు.

# కోడిపందాల బరులు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు

## - పేకాట,గండాట,జూదం ,కోడి పందాలు నిర్వహిస్తే సహించేదిలేదు

**పిట్టలవానిపాలెం,జనవరి12,ప్రభాతవార్త:** కోడి పందాలు,గుండాట,పేకాట వంటి అంసాంఘీక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ రామాంజనేయులు



తెలిపారు. మండల పరిదిలోని చందోలు పోలీస్ స్టేషన్‌ను అదివారం ఆయన సందర్శించారు. ఈసందర్బంగా డిఎస్పీ మాట్లాడుతూ పిట్టలవాని పాలెం మండలంలో కోడి పందాలు బరులు ఏర్పాటు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు చందోలు పోలీస్ లను అప్రమత్తం చేశామని ఆయన తెలిపారు. బరులు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు బరులు ఏర్పాటు చేసేందుకు స్ధలాలు ఇచ్చిన 6 గురు యజమానుకు నోటీసులు ఇస్తున్నా మన్నారు. ఎస్పీ తుషార్‌దూడి అదేశాల మేరకు డోన్ కేమేరాలను ఏర్పాటు చేశామని ఎవరైనా కోడి పందాలు ,గుండు అటలు,పేకాటు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాపట్ల నియోజకవర్గం పరిధిలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని అ బృందాలు నిత్యం తిరుగుతుంటాయన్నారు. ఎంతటి వారినైనా వదిలేది లేదన్నారు. కోడి పందాలు ,పేకట గండాటలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. ఈకార్యక్రమంలో సర్కిల్ సిఐ హారికృష్ణ,చందోలు ఎస్ఐ స్వామిశ్రీనివాస్,పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# కనపర్రు గ్రామంలో సంక్రాంతి సంబరాలు

**నాదెండ్ల,జనవరి12,ప్రభాతవార్త:** మండలంలోని కనపర్రు గ్రామంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. అందులో బాగంగా ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు, యువత, చిన్నారులకు



కబడ్డీ, స్లో సైక్లింగ్, ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలు నిర్వహించారు. సోమవారం ఉదయం జరిగే కార్యక్రమాలలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

# నేడు డిఆర్ఎన్‌సివిఎస్ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**చిలకలూరిపేట,జనవరి12,ప్రభాతవార్త:** ఎస్‌సివిఎస్ జూనియర్ కళాశాల, డిఆర్ఎన్ఎస్‌సివిఎస్ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం సోమవారం పసుమర్రులోని డిఆర్ఎన్ ఎస్‌సివిఎస్ కళాశాల ప్రాంగణంలో జరుగుతుందని పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలలో స్దిరపడ్డ కళాశాలలకు చెందిన పూర్వవిద్యార్థులందరూ ఈ సమ్మేళనానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో హరిదాసుల శ్రీనివాసరావు, తోట కిషోర్, శ్రీనివాసరావు, శ్రీరాం చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు ప్రారంబించిన ఎమ్మెల్యే వేగేశన

**పిట్టలవానిపాలెం,జనవరి12,ప్రభాతవార్త:** మండలపరిదిలోని పోతనకట్ట వారిపాలెం ,పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, భవనంవారిపాలెం,కోమలి గ్రామాలలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వేగేవన నరేంద్రవర్మ అధివారం ప్రారంబించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మౌళిక సదుపాయాల కల్పనకు



తాను కృషిచేస్తానన్నారు. ఈకార్యక్ర మంలో పంచాయితీరాజ్ డిఈ రాజన్న,ఏఈ రఘు,శ్రీనివాసరావు,ఈఒపిఆర్‌డి ఏలిషాబాబు,పార్టీ అద్యక్షులుగుడారి అంకయ్య,కోటేశ్వరరావు, తెలుగుదేశం జనసేన,బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ ధర్మాన్ని ప్రపంచానికి చాటిన ఘనత వివేకానందునిదే

## -లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి

**పొన్నూరు, జనవరి 12,ప్రభాతవార్త:** భారతీయ ధర్మాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత స్వామి వివేకానందునికే దక్కుతుందని



లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి అన్నారు. స్థానిక పరాశరం శేషకుమారి ఇంట్లో జరిగిన స్వామివివేకానంద జయంతి సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వామి వివేకానందుని అడుగుజాడల్లో నేటి యువత నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమస్యలకు భయపడకుండా వాటికి ఎదురు నిలిచి పరిష్కరించుకునే శక్తి సామర్థ్యాలను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని స్వామి చెప్పారన్నారు. అన్ని ధర్మాల్లోకి భారతీయ ధర్మం గొప్పదని చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానందుడని చెప్పారు. స్వామి వివేకాందుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వామి వివేకానందుడు చికాగోలో ప్రసంగించిన ప్రసంగాన్ని ఒకసారి గుర్తు చేసుకొన్నారు. తొలుత స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోన్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి, జి.కృష్ణకుమారి, నాగమంజరి, లక్ష్మీకుమారి, మద్ది పద్మజ, కె.విజయలక్ష్మి, కె.సులోచన, సరిత తదితరులు పాల్గొన్నారు.

# 31న విజ్ఞాన్స్ వర్సిటీలో బాల మహోత్సవ్

## -విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే25పోస్టర్ల ఆవిష్కరణ -చిన్నారులకు రాష్ట్రస్థాయిలో పోటీలు -జూనియర్స్, సీనియర్స్ విభాగంలో రెండురోజులు వేడుకలు -పోటీలకు ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

పొన్నూరు, జనవరి 12,ప్రభాతవార్త: విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్ర మాన్ని జనవరి 31నుంచి రెండు రోజులపాటు ఏర్పాటు చేస్తున్నామని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ వర్సిటీలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే చిన్నారుల పండుగ విజా ్ఞన్ బాల మహోత్సవ్-2కే25పోస్టర్లను విజా ్ఞన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ తమ యూనివర్సిటీ చిన్నారులకు సంబంధించిన భారీ యువజనోత్సవాలకు వేదిక కాబోతోందన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూ.విజ్ఞాన్.ఎసి.ఇన్/బాలమహోత్సవ్ వెబ్‌సైట్‌ను సందర్శించి కూడా విదా ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు విజ్ఞాన్ బాల మహోత్సవ్ వేదికగా నిలుస్తుందన్నారు.

**50కి పైగా ఈవెంట్ల నిర్వహణ:**

విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా జనవరి 31నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు తొలిసారిగా నిర్వహిస్తున్న బాల మహోత్సవ్‌లో జూనియర్స్(5నుంచి7తరగతి) సీనియర్స్ (8నుంచి10వ తరగతి) విద్యార్థులకు మొత్తం 50కిపైగా ఈవెంట్లను నిర్వహించ నున్నారు. తొలుత నిర్వహించే స్పోర్ట్స్ ఫీట్‌లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, 100 మీటర్లు, 800 మీటర్లు నిర్వహిస్తామన్నారు. చిన్నారి బాలికలకు వీలీబాల్ కబడ్డీ, ఖో-ఖో, 100మీటర్లు, 800మీటర్లు రిలే పోటీలు ఉంటాయన్నారు. వీటితో పాటు మ్యూజిక్(క్లాసికల్ సింగింగ్ సోలో, సింగింగ్ ఐడల్-లిటిల్ చాంప్, గ్రూప్ సింగింగ్, ఇన్సు ్ట ్రమెంట్ సోలో), డాన్ ్స(క్లాసికల్,



వెస్ట్రన్, ఫోక్ (గ్రూప్) లిటరరీ(ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, జనరల్ క్విజ్, ఎలక్యూషన్), ఫైన్ ఆర్ట్ ్స(స్పాట్ పెయింటింగ్, క్లే మోడలింగ్) పోటీలు నిర్వహిస్తా మన్నారు. విద్యార్థులు తమ ప్రతిబను ప్రదర్శించేం దుకు, వారి సత్తాను పెంపొందించు కునేందుకు విజా ్ఞన్ బాల మహోత్సవ్ ఓ చక్కని వేది అని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచా చరు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**వినుకొండ,జనవరి12,ప్రభాతవార్త:** స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని యువజన దినోత్సవ వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పి.వి సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర భ్ంగా పి.వి సురేష్‌బాబు



మాట్లాడుతూ స్వామి వివేకానంద స్పూర్తితో యువత దేశభక్తి పెంపొందించుకోవాలని చెప్పారు. యువత అనుకుంటే ఏదైనా సాధించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు నాగార్జున, రాంబాబు, చందు, సాదిక్, బాజీ బ్రహ్మం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**వినుకొండ,జనవరి12,ప్రభాతవార్త:** స్థానిక మార్కాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాల యంలో ప్రత్యేక పూజలు, పడిపూజ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 మెట్ల జ్యోతులు వెలిగించారు. ఆలయంలో జరిగే కార్యక్రమాలన్ని దిగ్విజయం జరగాలని మక్కెన ఆకాంక్షించారు. మకర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ గుడివాడ చిన్న గురునాధం తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మక్కెన అభిమానులు, ట్రస్ట్ బోర్టు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# తులసి వనం నూతన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మక్కెన

**వినుకొండ,జనవరి12,ప్రభాతవార్త:** మండలంలోని చాట్రగడ్డపాడు వద్ద తులసి వనం నూతన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.



# ఎల్లలు దాటిన అనుబంధం

**కొల్లిపర,జనవరి 12 ప్రభాతవార్త:** ఆ వంశీయుల అనుబంధం ఎల్లలు దాటింది.ప్రతి సంవత్సరం అందరూ ఒక్కమారు సంక్రాంతి పండుగకు



కలుసుకునే సాంప్రదాయంతో గ్రామీణ వాతావరణానికి శోభ చేకూరింది.మండల కేంద్రం కొల్లిపరకు చెందిన ఆరిమండ,బొంతు, ఉయ్యూరు ,జొన్నల వంశీయులు ఆదివారం పరస్పరం కలుసుకున్నారు.దూర ప్రాంతాలలో ఎక్కడ ఉన్నా ఏటా కలుసుకునే సాంప్రదాయాన్ని ఆ వంశస్దులు పాటిస్తున్నారు.తమ ఆడపడుచులను కూడా పిలిచి పసుపు,కుంకుమలతో పాటు బట్టలు పెట్టి దీవించి పంపటం ఆనవాయితీగా వసుంది.అందులో భాగంగా ఆ వంశీయులు ఆదివారం ఏర్పాటు చేసిన సామూహిక విందు భోజనానికి సుమారు 6 వేల మంది హాజరయ్యారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు గ్రామంలోని అందరినీ కలిసి పరస్పర క్షేమ సమాచారం తెలుసుకున్నారు.గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.కుశల ప్రశ్నలు వేసుకుంటూ ఆనందంగా గడిపారు.పెద్దలను గుర్తు చేసుకున్నారు.అనంతరం సామూహికంగా విందు బోజనం చేసారు.దీంతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.

# 9 మంది జూదరులు అరెస్టు

**కొల్లిపర,జనవరి 12 ప్రభాతవార్త:** మండల కేంద్రం కొల్లిపర గ్రామ శివారు గుదిబండివారిపాలెం అరటి తోటలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నున్న రూ.80,700 రూపాయిలను స్వాధీనం చేసుకోవటంతో పాటు 4 బైకులు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.



# యువతకు మార్గదర్శి స్వామి వివేకానంద

**రాజుపాలెం, జనవరి 12 ప్రభాతవార్త :** నవభారత రూపశిల్పి, తత్వవేత్త, యువతకు మార్గదర్శి స్వామి వివేకానంద 162వ జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని కెఎన్ఆర్ విద్యాసంస్ధలు కొండమోడు పిఎస్ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్స్ మాట్లాడుతూ నా ఆశయాలన్ని యువతరంపైనేనని, మనకిప్పుడు కావాల్సింది ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, మీ కాళ్ళపై మీరు నిలబడండి అంటూ స్వామి వివేకానంద యువతను చైతన్యం చేశారని, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ కార్యాన్నైనా సాధించవచ్చని, మీకు సాయం చేస్తున్న వారిని మరువకండి, మిమ్మల్ని ప్రేమిస్తున్న వారిని ద్వేషించకండి, నిన్ను నమ్మిన వాళ్ళని మోసం చేయకండి, డబ్బు లేని వాడు పేదవాడు కాదు, ఆశయం లేని వాడే పేదవాడు అని వివేకానంద చెప్పారన్నారు. అమెరికాలోని చికాగో నగరంలో సర్వమత సమ్మేళనంలో పాల్గొని అన్ని మతాల సారం ఒకటేనని, మానవత్వానికి మించిన మతమే లేదని ప్రపచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానందఅని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సాధినేని నరసింహారావు, మోటమర్రి సోమశేఖర్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# రైతులకు చేయూతనిచ్చేందుకే మినీ గోకులాలు

**కారంపూడి, జనవరి 12 ప్రభాతవార్త:** గ్రామాల్లోని పేద రైతులకు చేయూత నిచ్చేందుకే మినీ గోకులాలను ప్రారంభించినట్లు ఉపాధిహామీ ఏపీఓ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని పేటసన్నెగండ్ల, నరమాలపాడు గ్రామాల్లో మినీ గోకులాలు ఆదివారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద ఒక్కొక్క మినీ గోకులానికి రూ.2.30 లక్షలతో నిర్మించిన షెడ్లను రైతులు ఉపయోగించుకోవాలని అన్నారు. ఇప్పటికే గ్రామాల్లో 10 మినీ గోకులాలు పూర్తి చేసి ప్రారంభించినట్లు ఏపీఓ తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నేతలు చప్పిడి రాము, చావా వీరాంజనేయులు, గాడిపర్తి పూర్ణయ్య, మునుగోటి సత్యం, టీపీ వెంకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# డాకు మహారాజ్ చిత్రం విడుదల సందర్భంగా అభిమానుల సందడి

కారంపూడి, జనవరి 12 ప్రభాతవార్త: నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా విడుదల సందర్భంగా తెదేపా నేతలు, అభిమానులు ఆదివారం సందడి చేశారు. స్థానిక పల్నాడు ఐనాక్స్ థియేటర్‌లో అభిమానులు తెల్లవారుజామున బెనిఫిట్ షో ప్రదర్శన సందర్భంగా కేకును కట్ చేసి, టపాసులు పేలుస్తూ కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, బాలునాయక్, బొల్నేడి కోటి, పూర్ణ, కాసుల శంకర్, ఐనాక్స్ యజమాని బాబు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ భాస్కర్

**గురజాల, జనవరి 12 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలైన కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆవుల భాస్కర్ హెచ్చరించారు. పట్టణంలో ఆదివారం ఆయన డ్రోన్స్ ట్రయిల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండల పరిధిలో డ్రోన్స్ నిఘా ఉంటుందన్నారు. కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే వీడియో ఆధారంగా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ భాస్కర్ హెచ్చరించారు.



## శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, జనవరి 12 ప్రభాతవార్త :** శ్రీశైలం మల్లికార్జునస్వామిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆలయ డైరీని, స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను ఈవో అందించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడుతూ శ్రీశైలంలో కూటమి పాలన ప్రారంభమైన తర్వాత దైవ దర్శనం కోసం చేసిన ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మల్లికార్జునస్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా స్వామివారి కృపతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్ర ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి వేగంగా జరగాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆకాంక్షించారు.

## న్యాయవాద కార్యాలయాన్ని సందర్శించిన ఎంపి లావు

**సత్తెనపల్లి, జనవరి 12 ప్రభాతవార్త :** సీనియర్ న్యాయవాది, పి.పి.బగ్గి నరసింహారావు కార్యాలయాన్ని ఆదివారం నరసరావుపేట పార్లమెంట్‌సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు సందర్శించారు. కార్యక్రమానికి పట్టణంలోని పలువురు ప్రముఖులు, న్యాయవాదులు



హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ న్యాయవాదుల సేవలను కొనియాడారు. న్యాయవ్యవస్థ బలంగా ఉంటేనే సమాజం సురక్షితంగా ఉంటుందన్నారు.

## తెలుగుదేశం సభ్యత్వంతో సమాజంలో గౌరవం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జనవరి12, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా సమాజంలో ఒక మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం ప్రత్తిపాటి నివాసంలో టిడిపి శాశ్వత సభ్యత్వం పొందిన కార్యకర్తలు నాయకులు ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ప్రత్తిపాటి అభినందనలు తెలియచేసి సభ్యత్వం తీసుకోవడం పట్ల కలిగే ప్రయోజనాలు, లభించే గౌరవం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. రూ 100 చెల్లించి తీసుకునే సభ్యత్వంతో రూ5లక్షల భీమా ప్రయోజనం లభిస్తుందన్నారు. ప్రమాదాల బారిన పడ్డప్పుడు



తెలుగుదేశం పార్టీ మృతుల కుటుంబసభ్యులను అండగా నిలుస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వైద్యసేవలు, విద్యాభ్యాసం వంటి ఎన్నో ప్రయోజనాలు పార్టీ మృతుల కుటుంబాలకు అందచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనాయకుడు మంత్రి లోకేష్‌లు టిడిపి సభ్యులను తమ స్వంత కుటుంబసభ్యులుగా భావిస్తారని తెలిపారు. నియోజకవర్గంలో గతంతో పోలిస్తే ప్రస్తుతం ఈ సంఖ్య బాగా పెరిగిందన్నారు. 45మంది లక్షరూపాయిలు చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందారని, వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగం శ్రీనివాసరావు, రంగానాధుల నాగేశ్వరరావు, కందిమళ్ల రఘురామారావు, కామినేని సాయిబాబు, జవ్వాజి మదన్‌మోహన్, ఈదర సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు విద్యాభివృద్ధికి చేయూతనివ్వాలి

### -ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**పొన్నూరు, జనవరి 12,ప్రభాతవార్త:** పూర్వ విద్యార్థులు విద్యాభివృద్ధికి చేయూతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే



కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. నిడుబ్రోలు పిబిఎన్ కళాశాల పూర్వ విద్యార్థులు 29వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. మనం విద్యనభ్యసించిన పాఠశాల, కళాశాల అభివృద్ధికి మన వంతు కృషి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు బలోపేతం అయినప్పుడే మన తర్వాతి తరాలకు విద్యను అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా మారుతున్న విద్యా విధానాన్ని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మనం చదివి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు మనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాంగా పలకరించుకొని ఆనాటి విశేషాలను నెమరువేసుకు న్నారు. కళాశాలల పూర్వ విద్యార్థులతో కళకళలా డింది. ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో ఒకరినొకరు అడిగి యోగక్షేమాలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పి.అమరేంద్రనాథ్ అధ్యక్షత వహించారు. సభలో పోలీస్ ట్రాన్స్‌ఫోర్టు ఆర్గనైజేషన్ కార్యాలయం ఎస్పీ కెఎస్ఎస్‌వి సుబ్బారెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు, కళాశాల ప్రెసిడెంట్ కెప్టెన్ ఎన్ అంకప్పచౌదరి, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఎన్.అన్నారావు, కళాశాల ప్రిన్సిపాల్ నన్నపనేని శివకుమారి, తెలంగాణా అడ్వకేట్ ఎం.సుజన జయంతి తదితరులు ప్రసంగించారు.

## ఘనంగా స్వామి వివేకానంద 163వ జయంత్యుత్సవాలు

**మాచర్ల, జనవరి 12 ప్రభాతవార్త:** నిద్రాణశక్తిని మేల్కొలిపే శక్తి స్వామి వివేకానంద అని గురజాల డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్ అన్నారు. స్వామి వివేకానంద 163వ జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఎదురుగా ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గురజాల డీఎస్పీ జగదీష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని నేషనల్ యూత్‌డేగా జరుపుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. వివేకానంద రచనలు చదివినా, ఆయన ప్రసంగాలు విన్నా నిద్రాణమైన శక్తి మేల్కొంటుందన్నారు. నేటి యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మానవసేవే మాధవసేవ అన్న సాన్వమి వివేకానంద సూక్తిని అందరూ పాటించి నవభారత నిర్మాణానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, వజ్రసంకల్పం గల 100 మంది యువతీ యువకులను నాకు ఇవ్వండి, ఈ ప్రపంచ చరిత్రను మార్చేస్తాను అన్న స్వామి వివేకానంద పలికిన మాటలు నేటికీ యువతకు ఉత్తేజాన్నిస్తాయన్నారు. గురజాల డీఎస్పీ జగదీష్‌ను రామకృష్ణ సేవాసమితి గౌరవ సలహాదారుగా స్వీకరిస్తున్నామని గోవిందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి కార్యదర్శి పోలిశెట్టి పుల్లారావు, ఉపాధ్యక్షులు గంధ్రకోట శివశంకర్ ప్రసాద్, దగ్గుల కోటిరెడ్డి, కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరెడ్డి, సంగీత ఉపాధ్యాయులు షేక్ చినలాలూసాహెబ్, గాజుల నరసింహారావు, చంద్రారావు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు గాదె అంజిరెడ్డి మృతి

**చిలకలూరిపేట, జనవరి12, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు గాదె అంజిరెడ్డి నరసరావుపేట సమీపంలోని రావిపాడు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మరణించారు. కాగా ఆయన భౌతికకాయాన్ని ఆదివారం పట్టణంలోని మదర్‌థెరిస్సా కాలనీలోని ఆయన నివాసానికి తీసుకురాగా విషయం తెలుసుకున్న శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అంజిరెడ్డి నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, ఎపిజెఎఫ్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు దండా గోపి, ఎపిజెఎఫ్ చిలకలూరిపేట అధ్యక్ష, కార్యదర్శులు నాగబైరు శ్రీనివాసరావు,



మురికిపూడి ప్రసాద్, గౌరవాధ్యక్షులు గాత్రం జగదీష్, ఆరాధ్యుల రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు,సిద్దిక్, రవి, హవేజ్ తదితర ఎపిజెఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

**సీనియర్ జర్నలిస్ట్ అంజిరెడ్డి మృతి బాధాకరం – ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్**

రోడ్డు ప్రమాదంలో మరణించిన సీనియర్ జర్నలిస్ట్ గాదె అంజిరెడ్డి మృతి బాధాకరమని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. ఆదివారం మృతిచెందిన అంజిరెడ్డి భౌతికకాయాన్ని మదర్‌థెరిస్సా కాలనీలోగల అంజిరెడ్డి నివాసంలో సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను సానుభూతిని తెలియచేశారు. చిన్న వయసులోనే మంచి వ్యక్తిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు.

## మాచర్లలో తాళం వేసిన ఇంట్లో చోరీ

**మాచర్ల, జనవరి 12 ప్రభాతవార్త:** తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని శరీన్ కాలనీకి చెందిన ఉమాదేవి పండుగ సందర్భంగా పిండి వంటలు చేసుకునేందుకు రోప్‌వే కాలనీలో నివాసముంటున్న కుమారుడి ఇంటికి వెళ్లింది. సాయంత్రానికి ఇంటికి తిరిగి రాగా వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో విస్మయానికి గురైంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. దీంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించి పట్టణ



పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ చోరీలో రూ.80 వేల నగదుతోపాటు, సామగ్రి, వస్తువులు సామయమైనట్లు బాధితురాలు తెలిపింది. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంధ్యారాణి తెలిపారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**చిలకలూరిపేటటౌన్, జనవరి12, ప్రభాతవార్త:** వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్ వద్దగల వివేకానంద స్వామి విగ్రహం వద్ద స్వామి వివేకానంద స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అర్బన్ సిఐ పి రమేష్ మాట్లాడుతూ వివేకానంద సేవాసమితి చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. సంక్రాంతి పండుగ వస్తుందంటే హరిదాసులు గుర్తొస్తారని, వారికి నిత్యావసర సరుకులు, బట్టలు అందచేయడమే కాక నిత్యం పారిశుధ్య పనులలో నిమగ్నమయ్యే పారిశుధ్య కార్మికులకు బట్టలు, మందులు అందచేయడం ఎంతో



అభినందనీయమని అన్నారు. కాపు వెంకట్రావు, చీరాల షణ్ముఖ ప్రాపర్టీస్ కొప్పోలు అరవిందబాబు, దేసు శ్రీనివాసరావు, వలివేటి మధుబాబుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లే సమితి అధ్యక్షులు వి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తమాసు శ్రీనివాసరావు, కనమర్లపూడి రమేష్, రాధాకృష్ణ, కంచర్ల శ్రీనివాసరావు, బీకం శ్రీనివాససింగ్, మున్సిపల్ శానిటరీ సిబ్బంది బైరా సతీష్, ఖాదర్, వివేకానంద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో స్వామి వివేకానంద విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## కొల్లూరులో రెండు కోడి పందాల బరులు ధ్వంసం

**బాపట్ల, జనవరి12, ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో జరుపుకోవాని ఏవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని కొల్లూరు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.ఈ సందర్భంగా అదివారం ఎస్ఐ ఏడుకొండలు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్‌దూడి,రేపల్లె డిఎస్పీ శ్రీనివాసరావు అదేశాల మేరకు సంక్రాంతి



పండుగను పరస్కరించుకుని కోడిపందాలు,పేకాట,ఇతర జూద క్రీడలను కట్టడి చేసేందుకు విసృతంగా సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనలో బాగంగా కొల్లూరు మండల క్రాపాడ రోడ్డు,అనంతవరం గ్రామాల సమీపంలో కోడి పందాలు నిర్వహించడానికి బరులు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారం అందిందన్నారు.సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి బరుల వ్ధకు చేరుకుని ట్రాక్టర్‌లో బరులను ద్వంసం చేసి బరుల చుట్టూ ఏర్పాటు చేసిన జెండాలు,టెంట్లు తీసివేశామన్నారు. ఎవరైనా పండుగ ముసుగులో అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితె వెంటనే 112 కు లేదా ఏస్ఐ కొల్లూరు నంబర్లకు కాల్ చేసి వివరాలు తెలియజేయలన్నారు.

## సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ: ఎస్సై సంధ్యారాణి

మాచర్ల, జనవరి 12 ప్రభాతవార్త: సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గుల పండుగ అని పట్టణ ఎస్సై సంధ్యారాణి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమంలో ఎస్సై సంధ్యారాణి, మున్సిపల్ ఛైర్మన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలు చాటేలా ముగ్గుల పోటీలు



నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. లయన్స్‌క్లబ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చుండూరు సరస్వతి వ్యవహరించారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు చుండూరు వెంకటేశ్వర్లు, అధ్యక్షులు కేపీ చంద్రశేఖర్, కార్యదర్శి కంభంపాటి ప్రకాష్, ఫాస్ట్ జోన్ ఛైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, ఫాస్ట్ ప్రెసిడెంట్ అల్లం కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విజయవంతమైన స్కాలర్‌షిప్ టెస్టు

**నరసరావుపేట, జనవరి 12 ప్రభాతవార్త :** అంతర్జాతీయ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్ విజయవంతమైంది. ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షకు 978 మందికి పైగా విద్యార్థులు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ప్రముఖ మోటివేషన్ స్పీకర్ వేణుగోపాల్ విద్యార్థులు, తల్లిదండ్రుల గురించి ఇచ్చిన సందేశం ఆకట్టుకోవడంతో పాటు ఆలోచింపజేసిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు, సంగీతం, యోగా వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు,



వారి ఉజ్వల భవిష్యత్తుకు పాఠశాలలో తగిన బోధన అందిస్తున్నట్లు తెలియజేశారు. ఛైర్మన్ నాగోతు ప్రకాష్‌తో పాటు ప్రముఖులు వేములపల్లి వెంకట నరసయ్య, స్కూల్ జనరల్ మేనేజర్ రామరాజు, ఏవో రఘుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు క్షేత్ర ప్రదర్శన

**సత్తెనపల్లి, జనవరి 12 ప్రభాతవార్త :** మండలంలోని గుడిపూడి రామకోటయ్యపొలంలో రైతు క్షేత్ర ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. ఈ క్షేత్ర ప్రదర్శనకు కంపెనీ ఏజిఎం నాసరరెడ్డి హాజరయ్యారు. మిర్చిలో 416 అనే రకం వైరస్‌ను, చీడపీడలను తట్టుకొని అధిక దిగుబడులను



ఇస్తుందన్నారు. ఏరియా సేల్స్ మేనేజర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పంట చివరి దశకు చేరే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు ఎల్లప్పుడు ముందుంటామన్నారు. కార యక్రమంలో డిస్ట్రిబ్యూటర్స్ సత్తెనపల్లి, క్రోసూరు, అచ్చంపేట, రాజుపాలెం, పిడురాళ్ల మండలాల నుండి రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**నరసరావుపేట, జనవరి 12 ప్రభాతవార్త :** స్వామి వివేకానంద 162వ జయంతిని ఆదివారం స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల వద్ద నిర్వహించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చిన్నరామిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని యువత మొత్తానికి స్వామి వివేకానంద ఆదర్శమన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు పెద్దిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ దేశానికి ఇనుప నరాలు, ఉక్కు కలిగిన కండరాలు ఉన్న యువత కావాలని వివేకానంద పిలుపునిచ్చారని గుర్తు చేశారు. భవిష్యత్తు తరాలకు వారు చూపిన ఆదర్శాలు



మార్గమన్నారు. దేశాభివృద్ధికి, సమాజ సంక్షేమానికి వివేకానందుని పిలుపే కావాలన్నారు. భారతదేశ ప్రతిష్ఠతను వివేకానందుడు ప్రపంచంలో ఇనుమడింపజేశారని తెలిపారు. ఆయన జయంతిని నిర్వహించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ స్ఫూర్తిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగర శివకుమార్, జన్నాభట్ల ఆదిత్య, రెడ్డి జాలయ్య, పత్తిపాటి రమేష్, సీతా రామాంజనేయులు, పులికొండ జయ వెంకట సత్యనారాయణ, సజ్జాపురం ప్రసాద్, అనుమోలు బుద్ధ ప్రహ్లద, త్రినాధ్, భాస్కరుని సీతారామయ్య, నర్సి రెడ్డి, గురుబ్రహ్మం, గురునారాయణ, సింధు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సూర్యశిల్పశాల శిల్పుల కళాత్మకశైలి మహోన్నతం

### -మాజీ మంత్రి ఆలపాటి

**తెనాలి, జనవరి 12 (ప్రభాతవార్త) :** ఇనుప రద్దు వ్యర్థాలతో తమదైన కళా నైపుణ్యాన్ని జోడించి, సమాజం గర్వించే నేతల విగ్రహాలను




సజీవ మూర్తులుగా తీర్చిదిద్దడంలో కాటూరి ఆర్ట్ గ్యాలరీ ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆపలాటి రాజేంద్రప్రసాద్ శిల్పులను ప్రశంశించారు. మండలంలోని సోమసురందపాలెం శివారు, ఆటోనగర్‌లో గల కాటూరి ఆర్ట్స్ గ్యాలరీలో ఇనుప వ్యర్థాలతో రూపొందించిన టిడిపి అధినేత ఎన్టీఆర్ విగ్రహం, పార్టీలోలో, పార్టీ సిబర్ సైకిల్‌ను ఆదివారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేంద్ర మంత్రి సోదరుడు పెమ్మసాని రవిలు ఆర్ట్ గ్యాలరీని సందర్శించి ఆవిష్కరించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తమదైన కళా నైపుణ్యంతో సూర్యశిల్ప శాల నిర్వాహకులు కాటూరు వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు విబిన్న ఆకృతుల్లో వివిధ విగ్రహాలను రూపొందిస్తూ, కళాత్మకంగా తెనాలి ఖ్యాతిని ఖండాంతరాలకు చాటుతున్నారని ఇదో శుభపరిణామం అన్నారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఉన్న వివిధ విగ్రహాల, కళా నైపుణ్యాన్ని గురి_ంచి శిల్పులను ప్రశంశించారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు కాటూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ, బిఆర్ అంబేద్కర్ వంటి మహానీయుల విగ్రహాలను రూపొందించడం ద్వారా తెనాలి శిల్ప కళల ఖ్యాతిని విశ్వానికి చాటామని అన్నారు. మరల నందమూరి తారక రామారావు విగ్రహం ఎంతో రమణీయంగా తీర్చిదిద్దామని, తద్వారా కాటూరి ఆర్ట్ గ్యాలరీ మరింత గుర్తింపు పొందనుందని అన్నారు. భవిష్యత్తులో కూడా మరెన్నో మంచి విగ్రహాలను రూపొందించి తమ కళాత్మకతను చాటుతామని అన్నారు. ఎన్టీఆర్ అభిమానులు పార్టీ శ్రేణులు మహమ్మద్ ఖుద్దూస్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు కేసన కోటేశ్వరరావు, 19వ వార్డు కౌన్సిలర్ త్రిమూర్తులు, శిల్పులు కాటూరి రవిచంద్ర, శ్రీహర్ష, ఆర్ట్ గ్యాలరీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి

### -మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బొనిగల రాజారావు

**పొన్నూరు, జనవరి 12,ప్రభాతవార్త:** న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై అక్రమంగా, దురుద్దేశపూర్వకంగా దాడిచేసిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ



అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బొనిగల రాజారావు డిమాండ్ చేశారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్షా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయవాది ప్రకాశరావుపై అక్రమంగా బనాయించిన రెండు కేసులను ఎత్తివేయాలని, ప్రకాశరావుపై దాడి చేసిన ఎస్సై, సిఐ, మరో ముగ్గురు కానిస్టేబుళ్ళపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీటంతటికి కారణమైన ప్రభుత్వ వైద్యశాల డాక్టర్‌ను, సిఐ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడి చేయడంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. ప్రశాంతమైన వాతారణాన్ని ఘర్షణకు దారితీసేవిధంగా వ్యవహరించిన వైద్యుడు, పోలీసులపై సంబంధిత శాఖాధికారులు న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకాశరావుకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. న్యాయవాదులకే రక్షణ కరువైనప్పుడు ప్రజలకు ఏ విధంగా రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. ఆదివారం ఆరవ రోజు దీక్షలు బేతాళ ప్రకాశరావు, విప్పర్ల సుబ్బారావు, కొసనా శ్రీనివాసరావు దీక్ష చేశారు. వీరికి న్యాయవాదులు జిఎస్ రాయెల్, లక్ష్మీకాంత్, బొనిగల అంకమ్మరావు, దమ్ము కోటేశ్వరరావు, షేక్ బాజిసాహెబ్, తుమాటి రమేష్ మద్దతు తెలిపారు.

## అసత్య ప్రచారాలపై పరువునష్టం దావా వేస్తాం : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట, జనవరి 12 ప్రభాతవార్త :** వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతో పాటు వ్యక్తిగతంగా తన గౌరవానికి భంగం కలిగించే అసత్య ప్రచారాలపై



పరువునష్టం దావా వేస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పట్టణానికి చెందిన వెంకాయమ్మ అనే మహిళ తన అనుచరులు ప్రభుత్వానికి చెందిన స్థలం విషయంలో ఆక్రమణ చేశారని సిఎం చంద్రబాబునాయుడుకు అవాస్తవాలతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మార్కెట్‌యార్డు స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఏ ప్రభుత్వం, ఏ ఎమ్మెల్యే రాసి ఇచ్చే హక్కు, అవకాశం ఉండదని ముందుగా గమనించాలన్నారు. మార్కెట్‌యార్డు షాపులకు సంబంధించి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన కార్యకర్తలకు అవకాశం కల్పించడం సర్వసాధారణంగా జరుగుతుందన్నారు. ఇప్పుడు తెలుగుదేశంపార్టీ అధికారంలో ఉందని ఆ పార్టీ కార్యకర్తలే షాపుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తుంటే తన అనుచరులు నిజంగా వెంకాయమ్మ అనే మహిళ స్థలాన్ని ఆక్రమించి ఉంటే స్థానిక పోలీసులకు గాని, ఎమ్మెల్యేకు గాని ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలని, ఇష్టానుసారంగా ఎల్లో మీడియాలో పదేపదే తన గౌరవాన్ని కించపరుస్తూ వార్తలు రాసే విధానం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు.

## అకడమిక్‌ఇయర్‌ను ప్రాతిపదికగా బదిలీలు జరపాలి

నకరికల్లు, జనవరి 12 ప్రభాతవార్త : అకడమిక్‌ఇయర్‌ను ప్రాతిపదికగా బదిలీలు జరపాలని ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. సంఘం సమావేశంలో నాయకులు బి.సంపత్‌బాబు, అశోక్‌బాబు, ఎం.మోహన్‌రావు, ఎల్.వి.రామిరెడ్డి, వి.వి.రవికుమార్, గోవిందరాజులు, చంద్రయ్య, సుభానిలు మాట్లాడారు. 2017 నుండి అమల్లో ఉన్న విధానాన్ని వదిలి కటాఫ్ తేదీ ప్రాతిపదికన బదిలీలు చేస్తే ఉపాధ్యాయులకు ఇబ్బంది జరుగుతుందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో సొంత ప్రాంతాలకు వెళ్ళే వెసులుబాటు బదిలీలలో ఉండే అవకాశం దూరమవుతుందన్నారు. ఐదు అకడమిక్ సంవత్సరాలను టీచర్లకు ఎనిమిది అకడమిక్ సంవత్సరాలు లాంగ్‌స్టాండింగ్‌గా పరిగణించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

### -జోన్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి

పొన్నూరు, జనవరి 12,ప్రభాతవార్త: రక్తదానం ప్రాణదానంతో సమానమని లయన్స్‌క్లబ్ జోన్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి అన్నారు. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో ఆమె మాట్లాడారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారిని ఆదుకున్నామనే సంతృప్తి కలుగుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రక్తం నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. కోవిడ్ సమయంలో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు ఉండడం వల్ల అనేకమంది ప్రాణాలను కాపాడుకోగలిగామన్నారు. మళ్ళీ రక్తం నిల్వలను బ్లడ్ బ్యాంకుల్లో నింపుకున్నట్లయితే అవసరార్థులకు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి యువకుడు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై అపోహలను నమ్మవద్దన్నారు. రక్తం దానం చేయడం ద్వారా మళ్లీ కొత్త రక్తం మన శరీరంలో ఉత్పత్తి అవుతుందన్నారు. ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా రక్తదాన్ని దానం చేయవచ్చన్నారు. ఇంతటి మంచి కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళలు భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు.రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, చిలకపాటి దేవరాజన్, లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, పరాశరం శేషకుమారి, శబలాదేవి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి అన్ని కుటుంబాలలో సుఖ సంతోషాలను తీసుకురావాలి : కొమ్మాలపాటి

**నరసరావుపేట టౌన్, జనవరి 12 ప్రభాతవార్త :** సంక్రాంతి పర్వదినం అన్ని కుటుంబాలలో సుఖ సంతోషాలను తీసుకురావాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం స్దానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి అతి పెద్ద పండుగ అన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునే ఇటువంటి వేడుకలను ఖచ్చితంగా నిర్వహించుకోవాలన్నారు. గ్రామాలు ఈ పండుగకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే కుటుంబసభ్యులతో కళకళలాడుతూ ఉంటాయన్నారు. అదే విధంగా ఆచారాలను పాటిస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దైవ సంకల్పంతో ముందుకు వెళ్ళాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు.



## నేడు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం రద్దు

**నరసరావుపేట క్రైం, జనవరి 12 ప్రభాతవార్త :** జనవరి 13వ తేదీన సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిషా ్కర వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదివారం తెలియజేశారు. బోగి పర్వదినం శెలవు రోజు కావడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అర్జీలను సమర్పించేందుకు వచ్చే వారు ఈ విషయాన్ని గమనించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు కోరారు.

## బేరింగ్ మౌలాలి జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, జనవరి12, ప్రభాతవార్త:** టిడిపి మైనారిటి సెల్ రాష్ట్ర కార్యదర్శి 10వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి జన్మదిన వేడుకలు ఆదివారం ప్రత్తిపాటి నివాసంలో నాయకులు ఏర్పాటుచేశారు. ముఖ్య అతిధిగా నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని కేక్ కట్‌చేసి మౌలాలికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బేరింగ్ మౌలాలి అన్నక్యాంటిన్ వద్ద మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ, అన్నక్యాంటిన్ వద్ద పేదలకు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. పేదల మధ్య జన్మదినోత్సవ వేడుకలు జరుపుకున్న బేరింగ్ మౌలాలిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలోసుభాని, జవ్వాజి బుచ్చిబాబు, గట్టినేని సాయి, ఆదంషఫీ, బొల్లయ్య, ఆర్‌కె వలి, మహమ్మద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గ్రాంట్ ద్వారానే ఏఎన్‌యులో సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాము

**-సిఎఫ్ఎంఎస్ ద్వారా వర్సిటికి నిధులు విడుదల చేసిన రాష్ట్రప్రభుత్వం**

**-రెగ్యూలర్ ఉద్యోగుల వేతనాలతో పాటు పెన్షనర్లకు కూడా పెన్షన్లు సకాలంలో చెల్లిస్తున్నాం.**

**-రిజిస్ట్రార్ ఆచార్య పి.సింహాచలం వెల్లడి**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి 12, ప్రభాతవార్త : ఏఎన్‌యూ రెగ్యులర్ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వ గ్రాంట్ ద్వారానే సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో నిధుల లేమి జీతాలు చెల్లింపుల్లో ఆలస్యం అనే ప్రచారంపై ఆయన స్పందించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నాగార్జున విశ్వవిద్యాలయంలో నవంబర్-2024 జీతభత్యాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5.5కోట్లు విడుదల చేసిందని ఆ నిధులను ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించడం జరిగిందన్నారు. అలాగే నాలుగో విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 17.5కోట్లను విడుదల చేయగా డిసెంబర్ 2024జీతాలను సిఎఫ్ఎంసీ ద్వారా చెల్లిస్తున్నామని వివరించారు. వర్సిటీలో రెగ్యూలర్ ఉద్యోగులతోపాటు పెన్షనర్లు కు కూడా పెన్షన్ సకాలంలో చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు కంటే ముందుగానే పెన్షనర్లకు ప్రాధాన్యత ఇచ్చి పెన్షన్లు చెల్లిస్తున్నామని ఇది వారికి కూడా తెలుసని స్పష్టంచేశారు. గత మూడేళ్ళలో రాష్ట్రప్రభుత్వం అనుమతి లేకుండా యూనివర్సిటీలో 140మంది వరకు క్యాజువల్ వర్కర్ పేరుతో ఉద్యోగాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఎటువంటి అవసరం లేకపోయిన వీరి నియామకం చేయడం జరిగిందన్నారు. అయితే వీరికి ప్రతినెలా జీతాలు చెల్లించేక్రమంలో వర్సిటీపై ఆర్థికభారం పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ఉద్యోగులకు 2023పెండింగ్‌లోఉన్న డిఏ బకాయిలను ఇప్పటికే రెండు విడతలు చెల్లించామని, వచ్చే నెలలో రెగ్యులర్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మూడవ విడత డిఏ బకాయిలను చెల్లించేందుకు విశ్వవిద్యాలయం సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఏఎన్‌యు ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు నిలిచిపోలేదని వారికి సకాలంలో జీతాలు చెల్లిస్తున్నట్లు ఆచార్య సింహాచలం స్పష్టంచేశారు. విశ్వవిద్యాలయంలో ఆర్థిక వ్యవహారాలు పరిగణనలోనికి తీసుకుంటే గడిచిన మూడేళ్ళలో ఆర్థిక లావాదేవీల వ్యవహారాల్లో అనేక అవకతవకలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అయితే ప్రాధాన్యత లేని కొన్ని ఇంజనీరింగ్ పనులకు కోట్ల రూపాయలు చెల్లించడం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంలో ఇప్పటికీ కూడా పాత ఇంజనీరింగ్ పనుల బకాయిలను చెల్లిస్తూనే ఉన్నామని, 2022-23, 2023-24ఆర్థిక సంవత్సరాల్లో ప్రాధాన్యత లేని 350కిపైగా ఇంజనీరింగ్ పనులకు బిల్లులు చెల్లించామని, ఇంకా చెల్లించాల్సిన ఉండడం తో ఈ ఏడాది కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. వీటివల్ల విశ్వవిద్యాలయ ఆర్థిక పరిస్థితి భారంగా ఉన్నట్లు ఆందోళన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు అందాల్సిన విద్యాదీవెన, వసతి దీవెనలు నిలిచిపోయినా కూడా వారికి వసతి గృహాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్‌తోనే విశ్వవిద్యాలయంలో ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు సకాలంలోనే చెల్లిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మరోసారి స్పష్టంచేశారు.

## ప్రపంచశాంతిని కాంక్షిస్తూ శాంతి సువార్త పండుగలు

**-జీసస్ గాస్పెల్ అసోసియేషన్ అధ్యక్షులు మోషే బాబు**

మంగళగిరి, జనవరి 12, ప్రభాతవార్త : ప్రపంచశాంతిని కాంక్షిస్తూ జనవరి 13నుండి 17వ తేదివరకు మంగళగిరి-తెనాలి బైపాస్ ఫ్లైఓవర్ డౌన్ అందె వంటి ఫ్లాట్స్‌లో జరుగుతాయని జీసస్ గాస్పెల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెవ.వివిఎ ఆర్ మోషేబాబు తెలిపారు. సువార్త సభలో జరిగే ప్రాంగణం వద్ద ఆదివారం ఉదయం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి కరపత్రాలను ఆవిష్కరించారు. గత 60సంవత్సరాలుగా దైవజాతి సువార్త పరిచర్య, సేవా కార్యక్రమాలు చేస్తున్నామని మోషేబాబు స్పష్టంచేశారు. కుల మతాలతో సంబంధంలేకుండా అందరూ ఆహ్వానితులేనని ఈ పండుగల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళగిరి జెబిఏ డైరెక్టర్ రెవ.డాక్టర్ ఎస్.వసంతరావు మాట్లాడుతూ 13వ తేది నుండి 5రోజుల పాటు జరిగే ఈ శాంతి సువార్త పండుగలకు వివిధ ప్రాంతాల నుండి సుమారు 10వేల మంది విశ్వాసులు పాల్గొంటారని తెలిపారు. సభలకు హాజరయ్యే వారికి వసతి, భోజనం, వాహన సదుపాయాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి ప్రజలు ఈ సువార్త పండుగలోపాల్గొనాలని నందిగం వసంతరావు విజ్ఞప్తి చేశారు. శాంతి సువార్త పండుగల కన్వీనర్ పాస్టర్ రావూరి దేవపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఐపీఎల్‌ని తలపించిన టిఎస్ఎల్

**-యువతను ఉర్రూతలూగించిన క్రికెట్ లీగ్**

**తాడేపల్లి, జనవరి 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉండవల్లి గ్రామంలో గత 6రోజులుగా అంగరంగ వైభవంగా సాగిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. చివరిరోజు జరిగిన సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు



హోరాహోరీగా సాగాయి. ఫైనల్‌మ్యాచ్‌లో నరసింహ సిసి ప్యాంథర్ సిసి జట్టు తలపడగా నరసింహ సిసి జట్టు అద్భుత విజయం సాధించింది. మొదటగా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ప్యాంథర్ సిసి నరసింహ సిసి జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్‌కు దిగిన నరసింహ సీసీ జట్టు 12ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 98పరుగులు చేసింది. అనంతరం 99పరుగుల లక్ష్య చేదనకు దిగిన ప్యాంథర్ సిసి జట్టు 7వికెట్లు కోల్పోయి 66పరుగులను చేయడంతో 32 పరుగుల తేడాతో విజయం సాధించి ఉండవల్లి సూపర్ లీగ్ టెన్నిస్ బాల్ టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, ఏపీఎంఎస్ఐడిసి డైరెక్టర్ చిల్లపల్లి శ్రీనివాసరావు లు మాట్లాడుతూ...క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. యువకులు క్రీడారంగంలో ప్రోత్సహించే విధంగా కూటమి ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నియోజకవర్గస్థాయిలో ఇంత విజయవంతంగా తాడేపల్లి సూపర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన జొన్న రాజేష్ (జనసేన), గాదె వినయ్(టిడిపి)లు ను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా యువ నాయకులు రాజకీయాల్లో మరింతగా రాణించి, ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## గో సేవలో ఆర్యవైశ్యులు



**గుంటూరు విద్య, జనవరి 12, ప్రభాతవార్త :** స్థానిక గుంటూరువారితోటలోని రాధాకృష్ణ గోశాలలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గోపూజ, గోసేవ ఆవోపా అధ్యక్షులు కే.వి.బ్రహ్మం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ సకల దేవతా స్వరూపమైన గోమాతను పూజించడం వలన అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని (గహదోషాలు నివారించబడతాయని గో ఉత్పత్తులు ఉపయోగించడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. మహిళలు వివిధ భక్తిగీతాలకు కోలాటం చేశారు. మహిళలు పాలపొంగళ్ళు చేశారు, సభ్యులకు గోఉత్పత్తులు పంపిణీ చేశారు. ఆవోపా సభ్యులు గోవులను శుభ్రంగా కడిగి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించి, గోవులకు ఆహారాన్ని అందించి గోమాత ఆశీస్సులు పొందారు. అనంతరం మహిళలు తిరుప్పావై గోష్టి ఆలాపించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోపాల్‌రావు, వామర్తి రమేష్, 100మంది సభ్యులు పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం



**పెదకాకాని, జనవరి12, ప్రబాత వార్త:** పెదకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆదివారం ఉదయం పదవ తరగతి(1999-2000) పూర్వవిద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ఆత్మీయ సమ్మేళనకార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా మాజీప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, బాలకృష్ణ , నాగేశ్వరరావు, బాలసూరి, ఉపాధ్యాయులు భవాని, మంజుల, మీనాదేవి, విజయలక్ష్మి, సుశీల, విమలాదేవి హాజరైనారు. ఈసందర్భంగా మాజీప్రధానోపాధ్యాయులు సుబ్బారావు మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాల తర్వాత మిమ్మల్ని కలవటం చాలా సంతోషంగాఅనందగా ఉందని, నేను పనిచేసిన ప్రతి పాఠశాలలోని విద్యార్థులు ఎంతో ఉన్నత స్థితికి చేరాలని కోరేవాడినని అన్నారు. మీరు చదివిన పాఠశాలకి 4లక్షల రూపాయలతో మరుగుదొడ్లను నిర్మించి, ఈకార్యక్రమాన్నిఏర్పాటు చేయటం ఎంతో అనందాన్ని కలిగించిందని తెలిపారు. మీరందరూ ఇలాంటి కార్య క్రమాల్లో కలుసుకుంటూ ఉండాలని కోరుకుంటూన్నాను అని అన్నారు. అనంతరం ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు శాలువాలతోపుష్ప గుచ్చాలతో, పూలమాలతో సత్కరించి పూర్వవిద్యార్ధులు వారి దగ్గర నుంచి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. ఈకార్యక్రమాని నిర్వహించడానికి యడపల్లి కిషోర్, చల్లపల్లి నరేష్, పెండెంకోటి, పిల్లి రమేష్, అకులసురేష్, నరేష్, ఉమా, చైతన్య, శ్రీకాంత్, భావన్నారాయణ, సాంబయ్య, బాను, సుధా, జ్యోతిష్ణ, ఝాన్సీ ముఖ్యపాత్ర పోషిచారు.

## సంక్రాంతి సంబరాలు



**గుంటూరు విద్య, జనవరి 12, ప్రభాతవార్త :** ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు తీర్చిదిద్దిన రంగు రంగుల రకరకాల ముగ్గులు ముచ్చట గొలిపాయి. చిన్నారులకు భోగి పళ్ళు పోశారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. చిన్నారులు చూడచక్కని సొగసైన దుస్తులను ధరించి ముందస్తు సంక్రాంతి వేడుకల్లో పాల్గొనగా, బాలికలు తెలుగుతనం ఉట్టిపడేలా లంగాఓణీలను ధరించి వేడుకలకు హాజరై తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు వేదికగా నిలిచారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల బకాయిలు తక్షణం విడుదల చేయాలి

**-ఐక్యవేదిక జిల్లా చైర్మన్ చాంద్ భాష**

**గుంటూరు విద్య, జనవరి 12, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల గుంటూరు జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఉద్యోగ ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించి ఉద్యోగులకు రావలసిన హక్కుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష మాట్లాడుతూ 12వేతన సవరణ కమిటీనీ తక్షణమే నియమించాలని, ఇప్పటికే దాదాపు 18నెలలు అయినప్పటికీ నేటి వరకు వేతన సవరణ కమిషన్‌ను నియమించకపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి దాదాపుగా 7నెలలు కావస్తున్నా ఉద్యోగులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాల గురించి మాట్లాడకపోవడం శోచనీయమని జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి సాంబశివరెడ్డి, మురళీకృష్ణ, రహిమాన్, హేమలత, సుమిత్రాదేవి, అరుణకుమారి, షబానా సుల్తానా, రోజా , కోట సాహెబ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కూడార్తై ఉత్సవం


**గుంటూరు కల్చరల్, జనవరి 12, ప్రభాతవార్త :** స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై తితిదే ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ఆధ్వర్యంలో కూడార్తై ఉత్సవం వైభవంగా జరిగింది. 27వ విశేష పాశురం పారాయణం చేశారు. గోదా అమ్మవారిని చక్కగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరంగనాయకి బృందం కూడార్తై పాయసాన్ని భక్తులకు అందించారు. ధార్మిక ప్రాంగణంలో చండీయాగం విశేషంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, వుట్టగుంట ప్రభాకరరావు తదితరులు పర్యవేక్షించారు.

## అపరగాన గంధర్వుడు జేసుదాస్

**గుంటూరు కల్చరల్, జనవరి 12, ప్రభాతవార్త :** స్వరరాగ గంగా ప్రవాహం, అపరగాన గంధర్వుడు, భారతీయ సంగీత ప్రపంచంలో జేసుదాసు పేరు తెలియని వారంటే అతిశయోక్తి లేదని, ఇంతవరకు 40వేల పాటలుపాడి అన్ని భాషల, అన్నిప్రాంతాల ప్రజల అభిమానం పొందారని అవగాహన మనమూ పాడుదాం రండి బృందసభ్యులు ప్రసంశించారు. జేసుదాసు జన్మదినోత్సవం సందర్భంగా సంస్థ కార్యాలయంలో గాయనీ గాయకులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి జేసుదాసు కి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన మంచి ఆరోగ్యం, ప్రశాంత జీవనాన్ని ఆ దేవదేవుడు ప్రసాదించాలని అభిలషించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు మాటాడుతూ 1961నవంబర్ 14న ఒక మళయాళ చిత్రానికి పాట పాటడం ద్వారా సినీరంగ ప్రవేశం చేసిన జేసుదాసు ఇంక వెనుతిరిగి చూడలేదన్నారు. సీనియర్ గాయకుడు పోతురాజు మాట్లాడుతూ మనదేశంలో ఒక్క కాశ్మీరీ, అస్సామి భాషల్లో తప్ప మిగతా అన్ని భాషల్లో పాటలు పాడిన ఘనత జేసుదాసుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సినీ దర్శకులు జయకుమార్, సాయిబాబు, మధుసూదనరావు తదితరులు ప్రసంగించారు.

## అవగాహనలో యుగకర్త స్వామి వివేకానంద జయంతి

**గుంటూరు కల్చరల్, జనవరి 12, ప్రభాతవార్త :** పేదవాని సేవే భగవంతుని సేవ అని చెప్పిన యుగకర్త "మానవ సేవే మాధవసేవ" అని చాటిచెప్పిన మహోన్నతమూర్తి, యువతరాన్ని ప్రేరేపించిన మహాశక్తి స్వామీ వివేకానంద అని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొన్నవారు నివాళులర్పించారు. కార్యక్రమానికి సంస్థ సీనియర్ సభ్యులు సిహెచ్‌పి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి లు మాట్లాడుతూ ఆయన ప్రసంగాలు భారతదేశ యువత, యువశక్తిని మేలొల్కొలిపాయన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.సత్యనారాయణ, వై.వి.రెడ్డి, శేషగిరిరావు లు స్వామి వివేకానంద కు నివాళులర్పించారు.



## గిరిజన మహిళా ప్రతినిధిపై ఎమ్మెల్యే కొలికపూడి దాడి హేయం

**ఎ కొండూరు, జనవరి 12, ప్రభాతవార్త :** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఎ కొండూరు మండలం గోపాలపురం గ్రామంలో వైసిపికి చెందిన వార్డు మెంబర్ భూక్యా చంటి కుటుంబ సభ్యుల వివాదంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని భూక్యా చంటి అనే గిరిజన మహిళ ఇంటిపై బజారు రౌడి లాగా వెళ్లి దాడి చేసి ఆ మహిళను బూటు కాలితో తన్ని జుట్టుపట్టి కొట్టి గాయపడటం పట్ల సిపిఎం పార్టీ ఆదివారం మీడియా సమావేశంలో మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఎమ్మెల్యే ఒక ప్రజా ప్రతినిధి అనే విచక్షణ కోల్పోయి ఆమెపై ఆమె కుటుంబ సభ్యులను నానా దుర్భాషలాడుతూ దాడిచేయడం ఒక గిరిజన మహిళపై ప్రజా ప్రతినిధి దాడి చేయడం చట్టాన్ని అపహాస్యం పాలు చేశాడని అవమాన భారం భరించలేక పురుగుమందు తాగిఅపస్మార స్థితిలో ఉండి విజయవాడలో చికిత్స పొందుతున్న చంటి అనే గిరిజన మహిళ కుటుంబానికి న్యాయం చేసి ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు నాయకులు ఎ అమ్మిరెడ్డి, పి వెంకటేశ్వరరావు, మోహన్‌రావు ఆర్ రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయి

చందర్లపాడు జనవరి 12 ప్రభాతవార్త: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని చందర్లపాడు ఎస్సై దుర్గా మహేశ్వర రావు పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని చందర్లపాడు పట్టణ పరిధిలో ఆటల పోటీలను ఎస్సై దుర్గా మహేశ్వరరావు ఆయన చేతులతో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల మక్కువ చూపాలన ఆయన అన్నారు. క్రీడలు ఆటడం వల్ల శారీరక దారుణ్యానికి ఎంతగానో దోహదపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**పొన్నూరు, జనవరి 12, ప్రభాతవార్త:** నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పదోతరగతి 1983-84బ్యాచ్ విద్యార్థులు స్థానిక శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయం కళ్యాణ మండపంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. ఆనాటి గురువులు చూపిన ఆప్యాయత, ప్రేమ, అనురాగాలను నెమరువేసుకొన్నారు. పూర్వవిద్యార్థులంతా వారి కుటుంబాలతో సహా హాజరవడం విశేషం. ఈ బ్యాచ్ విద్యార్థులు ఇప్పటికే ఓల్డ్ స్టూడెంట్స్ సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ కూడా చేసుకొన్నారు. ఈ సొసైటీ ద్వారా గతంలో వీరు చదివినటువంటి పాఠశాలకు రూ.లక్షకు పైగా ఖరీదు చేసే కుర్చీలు, బల్లలు అందజేయడం జరిగింది. ఈ బ్యాచ్‌లో ఉన్నటువంటి మిత్రునికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.70వేలు ఆర్థిక సహాయం కూడా చేయడం జరిగిందని సమావేశంలో తెలిపారు. కోవిడ్ సమయంలో సొసైటీ తరపున చేసిన సేవలను వివరించారు. భవిష్యత్తులో విద్యార్థులందరూ సమాజానికి ఉపయోగపడేవిధంగా చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జీవివి ప్రసాద్, కార్యదర్శి ప్రతాప్‌సింగ్, కోశాధికారి గంగాధర్ తదితరులు ఏర్పాట్లు చేశారు.

## తెలుగువారి పండుగలను తెలుసుకోవాలి

**-సుజాత జూనియర్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు**



**పొన్నూరు, జనవరి 12, ప్రభాతవార్త:** తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల గురించి విద్యార్థులు గుర్తెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుజాత జూనియర్ కళాశాల డైరెక్టర జి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక సుజాత కళాశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే పండుగని చెప్పారు. మహిళలు పెద్ద పెద్ద రంగవల్లులను తీర్చిదిద్ది, గొబ్బెమ్మలను ముగ్గులో పెట్టి గొబ్బిళ్ళ పాటలు పాడతారన్నారు. ఇకపోతే సంక్రాంతిని పురస్కరించుకొని గాలిపటాలు ఎగురవేయడాలు, ముగ్గుల పోటీలు, కోడి పందేలా పోటీలు తదితర ఆటలతో చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములవుతారన్నారు. కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో డైరెక్టర్ శ్రీనివాసరావుకు స్వాగతం పలికారు. ఈ క్యాక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, లెక్చరర్లు నాగరాజు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా నాయకత్వాన్ని జనసేన ప్రోత్సహిస్తుంది : రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ రూప

**నరసరావుపేట టౌన్, జనవరి 12 ప్రభాతవార్త :** మహిళా నాయకత్వాన్ని, వారిలో ఉన్న ప్రతిభను డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన ప్రోత్సహిస్తుందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప అన్నారు. జనసేన పార్టీ నాయకులు ఆదివారం నరసరావుపేటకు వచ్చిన డైరెక్టర్ రూపను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు బలంగా పని చేసేందుకు పార్టీలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. తనవంటి సాధారణ కార్యకర్తలకు సైతం రాష్ట్రస్థాయి పదవులను అందించిన ఘనత డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్రమశిక్షణతో పని చేసే ప్రతి నాయకునికి, కార్యకర్తకు ఖచ్చితంగా ఆలస్యమైనా మంచి గుర్తింపు లభిస్తుందని ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, కృష్ణంశెట్టి గోవిందు, కిషోర్, సిద్ధయ్య, మిరియాల సుబ్బమ్మ, శ్రావణి, నిర్మలా తదితరులు పాల్గొన్నారు.



## స్విమ్మింగ్ పోటీలలో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థికి రజిత పతకం

**నరసరావుపేట టౌన్, జనవరి 12 ప్రభాతవార్త :** స్విమ్మింగ్ పోటీలలో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్‌కు రజిత పతకం లభించింది. ఆదివారం జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు అభినందించారు. కార్యక్రమానికి పి.డి. వై.మధుసూదనరావు అధ్యక్షత వహించారు. ఈస్ట్ గోదావరి ఆత్రేయపురంలో జరిగిన సర్‌ఆర్థర్ గోదావరి కాటన్ ట్రోఫీ స్విమ్మింగ్ పోటీలలో జగదీష్ పాల్గొని వెయ్యి మీటర్ల విభాగంలో రన్నర్స్ ట్రోఫీని సాధించారన్నారు. 400 మీటర్ల ఫ్రీ స్టైల్ పోటీలలో రజిత పతకం సాధించడం జరిగిందన్నారు. నరసరావుపేటతో పాటు ఎస్ఎస్ఎన్ కళాశాలకు రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకువచ్చారని అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు తెలియజేశారు.

## గ్రంథాలయంలో జాతీయ యువజన దినోత్సవం

**రొంపిచర్ల, జనవరి 12 ప్రభాతవార్త :** గ్రంథాలయంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి యడ్లపాటి రాధ, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన స్వామి వివేకానంద తన అద్భుతమైన ప్రతిభా పాఠవాలతో ప్రపంచంలోనే భారతదేశానికి మంచి పేరు తీసుకువచ్చారన్నారు. హిందూ ధర్మం, వేదాంత సూత్రాలను ఆకలింపుచేసుకొని రామకృష్ణపరమహంసకు శిష్యునిగా తన జీవితాన్ని గడపారన్నారు. ధ్యానం చేస్తూనే తుదిశ్వాస విడిచారని వక్తలు ఈ సందర్భంగా తెలిపారు.

## నీతి నిజాయితీకి ప్రతిరూపం పీడీఎఫ్ ఎమ్మెల్సీలు: ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు

**మాచర్ల, జనవరి 12 ప్రభాతవార్త:** నీతి నిజాయితీలకు ప్రతిరూపంగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలు నిలిచారని ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 14 మంది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు గెలుపొందారని, వారిపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, నిజాయితీగా పని చేసిన ఘనత పీడీఎఫ్ ఎమ్మెల్సీలకు దక్కిందన్నారు. మాచర్ల నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, విద్య ద్వారానే ఈ ప్రాంతంలో మార్పు సాధ్యమన్నారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థల అభివృద్ధికి ఎన్నోమార్లు శాసనమండలిలో మాట్లాడానన్నారు. మార్చిలో జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. మాచర్ల నియోజకవర్గంలో 5 వవేల మందికిపైగా పట్టభద్రులు ఉన్నారన్నారు. ఈ సమావేశానికి యూటీఎఫ్ నాయకులు నాసరరెడ్డి అధ్యక్షత వహించగా, యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, జనవిజ్ఞాన వేదిక నాయకులు జేవీకేఎస్ ప్రసాద్, కేళం ఆదినారాయణ, ఉపాధ్యాయసంఘం నాయకులు ఆయేషా సుల్తానా, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, స్థానిక యూటీఎఫ్ నాయకులు నాగరాజు, నాసర్, గాలిబ్, కిరీటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్థానిక సీఐయూటీ నాయకులు బండన్ల మహేష్, వెంకట్రావు, ఆశ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కుడి కాలువలో విద్యార్థి మృతదేహం లభ్యం

**మాచర్ల, జనవరి 12 ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ కుడి కాలువ బుగ్గవాగు సమీపంలో విద్యార్థి మృతదేహం లభ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన అమరలింగేశ్వరరావు (21) విజయవాడలో ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల సందర్భంగా మాచర్లకు చేరుకున్నాడు. బుధవారం స్నేహితులతో కలిసి సమీపంలో కుడికాలువ బొంబాయి కంపెనీ వంతెన వద్ద ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. కాలువలో దూకుతున్నట్టుగా ఫొటో తీసుకుంటుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. స్నేహితులు, బంధువులు గత మూడు రోజులుగా గాలించగా బుగ్గవాగు సమీపంలో అమరలింగేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. దీంతో బంధువులు స్నేహితుల రోదనలు మిన్నంటాయి. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది.

## ఏళ్ల తర్వాత కలిసి.. జ్ఞాపకాలతో మురిసి

**రెంటచింతల, జనవరి 12 ప్రభాతవార్త:** మండలంలోని తుమృకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఒకరినొకరు కలుసుకుని సందడి చేశారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుని పాఠశాలలోని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పి, తమ ఉన్నతికి తోడ్పడిన ఉపాధ్యాయులు సాయిబాబా, దుర్గా సౌజన్య, చక్రపాణి జాన్, ఈశ్వరయ్యలతో పాటు ప్రసాద్ మాస్టర్‌ని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఆత్మీయ సమ్మేళనానికి తోడ్పాటునందించిన పూర్వ విద్యార్థులు ఎం.కృష్ణమూర్తి, అబ్దుల్ సలీం, పోట్ల శైలజ, రవీంద్ర యాదవ్, రామకృష్ణ, సైసావలీలను పలువురు అభినందించారు.




13-1Pg5.qxd:13-1Pg5.qxd 01/01/01 9:19 AM Page 1



# అటు కార్చిచ్చు..ఇటు మంచు తుఫాను

## అమెరికాలో విభిన్న పరిస్థితితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి, లాస్‌ఏంజెల్స్‌లో 52వేల ఇళ్లకు కార్చిచ్చు ముప్పు



**లాస్‌ఏంజెల్స్, జనవరి 12:** దేశంలోని కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్‌లో కార్చిచ్చు మరింతగా విస్తరిస్తోంటే టెక్సాస్, ఒక్లహామా వంటి రాష్ట్రాల్లో మంచుతుపాను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇళ్లపైనా రోడ్లపైనా మంచు కుంభవృష్టిగా కురుస్తుండటంతో మొత్తం జనజీవనం స్తంభించిపోయింది. కాగా కార్చిచ్చు పరంగా ఇప్పటివరకూ జరిగిన మరణాల సంఖ్య 16కి పెరిగింది. ఒక్క ఎటోన్‌ఫైర్‌లోనే 11 మంది చనిపోయారు. తీవ్రమైన గాలులు వీస్తుండటంతో మంటలు ఒకవైపునుంచి మరోవైపునకు వేగంగా వ్యాపిస్తున్నాయి. పాలిసేడ్స్ ఫైర్‌ను 11శాతం మాత్రమే అదుపు చేయగలిగినట్లు అధికారులు చెపుతున్నారు. ప్రస్తుతం ఇది బ్రెంట్‌వుడ్‌వైపు మళ్లిందని అంచనా. ఈ ప్రాంతంలోనే లబ్రోన్ జేమ్స్, ఆర్నాల్డ్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ నివాసాలున్నాయి. ఇక్కడిపరిస్థితి కారణంగా ఆమె తన చిట్టచివరి విదేశీపర్యటనను రద్దుచేసుకున్నారు. మరోవైపు ఎటోన్‌ఫైర్ ఇప్పటికీ కట్టడిలోకి రాలేదు. హాలివుడ్ స్టార్లు లాస్‌ఏంజెల్స్‌లో జలాలను ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేయడంతో ఇపుడు వేల ఇళ్లను మంటల బారినుంచి కాపాడేందుకు నీటికొరత ఎదురవుతోంది. ఈ స్టార్లు తమకు కేటాయించిన నీటకంటే కొన్ని రెట్లు అదనంగా వాడేసుకుని తమ గార్డెన్లను పెంచుతున్నారని ఆంగ్లపత్రికల్లో విమర్శలు వెలువడ్డాయి. 2022నుంచి లాస్ ఏంజెల్స్‌లో నీటివినియోగంపై ప్రభుత్వం నిబంధనలు కఠినం చేసింది. తోటకు నీరుపెట్టాలంటే వారానికి రెండుసార్లు ఎనిమిది నిమిషాలు మాత్రమే వాడుకోవాలని సూచించింది. నటి కిమ్ కర్దాషియన్ ది ఓక్స్‌లోని తన 60 మిలియన్ డాలర్ల ఇంటిచుట్టూ తోటను పెంచేందుకు తనకు కేటాయించిన నీరుకంటే 2.32 లక్షల గ్యాలన్లను అదనంగా వాడుకున్నట్లు అధికారులు గుర్తించారు. కండలవీరుడు సిల్వస్టర్ స్టాలోన్, కెవిన్ హార్ట్ వంటివారు అదనంగా నీరు వాడుకుని జరిమానాలు చెల్లించారు. కార్చిచ్చు ప్రారంభమైన ప్రదేశానికి సమీపంలోనే కిమ్ కర్దాషియన్ ఇల్లు ఉంది. ఇపుడు ఆమె ఆ ఇంటిని ఖాళీచేసింది. హాలీవుడ్ స్టార్లు గంటకు రెండు వేలు డాలర్లు చెల్లించి ప్రైవేటు ఫైర్‌ఫైటర్లను నియమించుకున్నారు. ప్రస్తుతం లాస్‌ఏంజెల్స్ నగరంలో 57వేల ఇళ్లకు కార్చిచ్చు ముప్పు పొంచి ఉంది. పసిఫిక్ పాలిసేడ్స్‌లో అన్ని హైడ్రెంట్లు పనిచేస్తున్నాయని డిపార్టుమెంట్ ఆఫ్ వాటర్ అండ్ పవర్ పేర్కొంది. కానీ 20శాతం హైడ్రెంట్లలో నీటి ప్రెషర్ చాలడంలేదని కొనిన చోట్ల ట్యాంకర్లతో నీటిని తరలిస్తున్నారని వెల్లడించింది. ఇప్పటికే సుమారు 13 వేల ఇళ్లు ఇతర కట్టడాలు బూడిదగా మారాయి. బ్రెంట్‌వుడ్ గెట్టీ సెంటర్లు వదిలి వెళ్లాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. టెక్సాస్ ఒక్లహామా మరికొన్నిరాష్ట్రాలను ఇపుడు మంచుతుపాను కూడా వణికిస్తోంది. ఓవైపు కార్చిచ్చు మరోవైపు మంచుతుపానుతో అమెరికా అల్లకల్లోలం అవుతోంది. మంచుతుపానుతో విమానసేవలకు కూడా తీవ్ర అంతరాయం కలుగుతోంది.



## నిరుద్యోగులకు ఉడాన్ కింద రూ.8500 సాయం

**న్యూఢిల్లీ, జనవరి 12:** ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఢిల్లీ ఎన్నికలు మరికొన్ని వారాల్లో జరగనుండటంతో ప్రచారాన్ని ఉధృతం చేసింది. నిరుద్యోగులకు యువ ఉడాన్ యోజన కింద రూ.8,500 ఇస్తామని ప్రకటించింది. ఇది ఉచితంగా ఇచ్చే మొత్తం కాదని వెల్లడించింది. ఆ పార్టీనేత సచిన్ పైలట్ మాట్లాడుతూ ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీలో తమకు ఉన్న నైపుణ్యాలను చూపించిన యువతకు ఆర్థికసాయం చేస్తాం. వారు ఈ కంపెనీల నుంచి ఆ సొమ్మును పొందుతారు. ఇది ఇళ్లల్లో ఖాళీగా కూర్చునేవారికి ఉచితంగా సొమ్ములు ఇచ్చే పథకం కాదని, ప్రజలు శిక్షణపొందిన రంగాల్లో స్థిరపడేలా సాయంచేయడానికే ఈ పథకం తెచ్చినట్లు పైలట్ తెలిపారు. ఈనెల 6వ తేదీ పార్టీ దీదీ యోజనను ప్రారంభించింది. కాంగ్రెస్ విజయం సాధిస్తే ఈపథకం కింద మహిలలకు రూ. 2500 ఇస్తామని వెల్లడించింది. 8వ తేదీ పార్టీ జీవన్‌రక్షా యోజనను ప్రకటించింది. దీనికింద రూ.25లక్షల వరకూ ఉచితబీమా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చింది. ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5వ తేదీ పోలింగ్ జరుగుతుంది. ఓట్లను ఫిబ్రవరి 8వ తేదీ లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు.

# రాజ్యాంగాన్ని అవమానించే అహంకారమా?

## సీఎం స్టాలిన్‌పై గవర్నర్ చురకలు



**చెన్నై, జనవరి 12:** తమిళనాడులో అధికార డిఎం కె ప్రభుత్వానికి గవర్నర్ ఆర్‌ఎన్ రవికి మధ్య అభిప్రాయబేధాలు తారస్థాయికి చేరాయి. అసెంబ్లీ తొలిసమావేశం సందర్భంగా జాతీయ గీతం ఆలపించలేదన్న కారణంగా తన ప్రసంగం చదవకుండానే గవర్నర్ వెళ్లిపోయారు. ఈపరిణామం గవర్నర్; సీఎం స్టాలిన్‌కుమధ్య మరింత అంతరాలను పెంచింది. సీఎంకు అంత అహంకారం మంచిదికాదంటూ తమిళనాడు రాజ్‌భవన్ తాజాగా ప్రకటించింది. జాతీయ గీతాన్ని గౌరవించాలని రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాతమిక విధులను నిర్వర్తించాలని చెప్పడాన్ని అసంబద్ధ చరనయగా చిన్నపిల్లలచ ఏష్టగా సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. దేశమే సర్వోన్నతం రాజ్యాంగమే అత్యున్నత విశ్వాసమనే విషయాన్ని ఆయన మరిచిపోవద్దని వాటిపట్ల అవమానాన్ని దేశప్రజలు సహించరని రాజ్‌భవన్ ప్రకటించింది. భారత్‌నున ఒకదేశంగా గుర్తించని, ఆదేశ రాజ్యాంగాన్ని గౌరవించని నేత వాటి వెనక ఉన్న ఉద్దేశ్యాలను వంచించడం సరికాదని ఇటువంటి అహంకారం మంచిదికాదని వెల్లడించింది. అన్ని శాసనసభల్లోను గవర్నర్ ప్రసం గానికి ముందు తర్వాత జాతీయ గీతాన్ని ఆలపిస్తారని ఇక్కడ ప్రసంగానికి ముందు ఆలపించాలని కోరినా ఉద్దేశ్యపూర్వకంగానే నిరాకరించారని రాజ్‌భవన్ ప్రకటించింది. రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అవమానించే చర్యలకు తోడుగా ఉండకూడదనే సభనుంచి గవర్నర్ వెళ్లిపోయారని వివరణ ఇచ్చింది. గవర్నర్ చర్యలు ఆయన పదవికి వన్నె తీసుకురావని సీఎం స్టాలిన్ తన సోషల్‌మీడియా ఖాతాలో స్పందించారు. రాష్ట్రాభివృద్ధిని గవర్నర్ జీర్ణిం చుకోలేకపోతున్నారని విమర్శించారు. ఆ క్రమంలోనే రాజ్‌భవన్ ఈమేరకు స్పందించింది.

# సంపన్నుల పార్టీ బిజెపి



ఆప్ అధినేత కేజ్రీవాల్ విమర్శ

**న్యూఢిల్లీ, జనవరి 12:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీలో ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీల్లో ఉత్సాహం పెరుగుతోంది. పార్టీలు ఒకరిపై ఒకరు పోటీకి దిగుతూ విమర్శలు సంధించుకుంటున్నారు. ఈక్రమంలో బిజెపిపై ఆమ్ ఆద్మీపార్టీ అధినేత కేజ్రీవాల్ తన వాణి బాణి పెంచారు. బిజెపి అదికారంలోకి వస్తే మురికవాడలను పూర్తిగా తొలగించేస్తుందని హెచ్చరించారు. ఐదేళ్లుగా మురికివాడల్లోని ప్రజలవదనదకు బిజెపి వెళ్లలేదని కానీ ప్రస్తుతం వారిచుట్టూతిరుగోతందని, ఎన్నికల్లో వారి ఓట్లు పొందేందుకు ఆపార్టీ ప్రయత్నిస్తోందని ఒకవేళ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే ఢిల్లీలోని అన్ని మురికివాడలను కూల్చివేస్తుంది. అక్కడి ప్రజలపై ఆ పార్టీకి ఎలాంటి ప్రేమలేదని విలేకరుల సమావేశంలోకేజ్రీవాల్ ఆరోపణలుచేసారు. సంపన్నుల పార్టీ బిజెపి అని అలాంటి నాయకులు మురికివాడల్లోని ప్రజలగురించి ఎందుకు పట్టించుకుంటారని వారిని చులకనగా చూస్తుంటారని ఎన్నికలవేళ వారి ఓట్లతోనే బిజెపికి పని అని అన్నారు. ఆ తర్వాత వారిభూములు లాగేసుకుంటుందని కేంద్ర మంత్రి అమిత్‌షా మురికివాడల్లోని ప్రజల నుద్దేశించి మాట్లాడారని అదే సమయంలో ఆయన నన్ను ఉద్దేశిస్తూ వాడిన పదజాలం అభ్యంతరకరమని అన్నారు. ఆయనతో నాకు ఎలాంటి శతృత్వంలేదని, నేను ప్రజాప్ర యోజనాల కోసమే రాజకీయాల్లోకి వచ్చానని కేజ్రీవాల్ అన్నారు.

# ఏ పదవికి నేను హక్కుదారు కాదు..



కేజ్రీవాల్ వ్యాఖ్యలకు బిధూరి కౌంటర్

**న్యూఢిల్లీ, జనవరి 12:** బిజెపి తనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేసిందంటూ అరవింద్ కేజ్రీవాల్ చెప్పడాన్ని ఆ పార్టీ మాజీ ఎంపి రమేశ్ బిధూరి తోసిపుచ్చారు. తనపై తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నారంటూ కేజ్రీవాల్‌పై మండిపడ్డారు. ఏ పదవికి తాను హక్కుదారుని కాదని, పార్టీకి విధేయ కార్యకరనతను మాత్రమేనని చెప్పారు. 'పార్టీ నాకెంతో ఇచ్చింది. ఏ పదవిని నేను కోరడం లేదు. అరవింద్ కేజ్రీవాల్ నిరంతరం నాపై తప్పుడు ప్రచారం సాగిస్తూనే ఉన్నారు. నావైపు నుంచి ఆయన సిఎం అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం చూస్తే ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం రాబోతోందని ఆయన అంగీకరించినట్లు అర్థమవుతోంది. తన ఓటమిని కూడా ఆయన అంగీకరించారనే అనుకోవాలి. ఎందుకంటే ఢిల్లీ ప్రజలు ఆయనపై చాలా ఆగ్రహంతో ఉన్నారు. లిక్కర్ కుంభకోణం, విద్యా కుంభకోణం, హెల్త్ స్కామ్, శీషమహల్ స్కామ్, రోడ్ల దుస్థితి, కలుషిత మంచినీటి దుస్థితి నుంచి విముక్తి పొందాలని ఢిల్లీ ప్రజలు కోరుకుంటున్నారు' అని బిధూరి ఒక ప్రకటనలో తెలిపారు.

**బిజెపికి అధికారమివ్వండి:** కేజ్రీవాల్ మాయలో ఢిల్లీ ప్రజలు చిక్కుకోవద్దని బిధూరి సూచించారు. ఢిల్లీ ప్రజల కోసం అంకితమైన బిజెపికి మెజారిటీ ఇవ్వాలని కోరారు. బిజెపి అంటే తనకు ఎంత అంకితభావం ఉందో ప్రజల పట్ల కూడా అంతే అంకితభావం ఉందని, ముఖ్యమంత్రి పదవి తనకేననడం పూర్తిగా నిరాధారమని ఆయన వివరించారు. బిజెపికి విధేయ సేవకుడిగానే కొనసాగుతానని చెప్పారు. దీనికి ముందు, బిజెపి సిఎం అభ్యర్థిగా రమేశ్ బిధూరిని ఎంపిక చేసినట్లు తనకు ఆ పార్టీ వర్గాల నుంచే తెలిసిందని, ఒకటి రెండు రోజుల్లో బిధూరి సిఎం అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ ప్రకటించనుందని కేజ్రీవాల్ తెలిపారు. దీనిపై కేంద్ర హోం మంత్రి ఆక్షేపణ తెలిపారు. మా పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్తి ఎవరో ఆయన (కేజ్రీవాల్) చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.

# పదేళ్లయినా చల్లారని పగ..యుపిలో పరువు హత్యలు

## కుమార్తె లేచిపోయిందన్న కక్షతో మనవరాలు, వృద్ధురాలు హత్య

**హాయత్‌నగర్(యుపి), జనవరి 12:** పక్కింటి యువకుడితో తమ కుమార్తె పారిపోవడాన్ని తలవంపులుగా భావించిన కుటుంబం పదేళ్లు గడిచినా ప్రతీకారేచ్ఛతో రగిలిపోయింది. అదునుచూసి మూడేళ్ల పాపను, 55 ఏళ్ల వృద్ధురాలిని దారుణంగా హత్య చేసారు. ఆ పసికందు తమ కూతురు సంతానమేనని కూడా పట్టించుకోలేదు. ఉత్తరప్రదేశ్‌లోని హయత్‌నగర్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామంలోని రామ్‌నాథ్, ప్రేమ్‌పాల్ ఇద్దరూ ఒకే కమ్యూనిటీ వ్యక్తులు. పదేళ్లక్రితం ప్రేమ్‌పాల్‌కూతురు ఆశాదేవి రామ్‌నాథ్‌కొడుకు విజయ్‌కుమార్‌తో పారిపోయింది. ఇద్దరూ పెళ్లిచేసుకుని చెన్నైలో కాపురం పెట్టారు. కూలి పనిచేస్తూ బతుకుతున్నారు. మూడేళ్లక్రితం ఈ జంటకు కూతురుపుట్టగా కల్పన అని నామకరణం చేసారు. భార్యాభర్తలు ఇద్దరూ పనిచేస్తుండటంతో కల్పనకు ఆరునెలలు నిండగానే తీసుకెళ్లి నాయనమ్మకు అప్పగించారు. అప్పటినుంచి కల్పన హయత్‌నగర్‌లో తాత రామ్‌నాథ్, నాయనమ్మ గీతాదేవి వద్ద పెరుగుతోంది. అయితే కూతురు ఆశాదేవి లేచిపోయి పెళ్లిచేసుకోవడం తమకు అవమానంగా భావించిన ప్రేమ్‌పాల్ పగతో రగిలిపోయాడు. పదేళ్లు గడిచినా ఆ కుటుంబంలో పగ చల్లారలేదు.

ఈక్రమంలోనే రామ్ నాథ్‌లేని సమయంలో ఆయన భార్య గీతా దేవిని, మనవరాలు కల్పనను ప్రేమ్‌పాల్ ఆయన కొడుకు కలిసి దారుణంగా హత్యచేసారు. కల్పన తనకూ మనవరాలేననే విషయంకూడా ప్రేమ్ పాల్‌కు పట్టలేదు. ఈ హత్యలపై విజయకుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కాశీవిశ్వనాధుని చెంత యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్‌జాబ్ సతీమణి



**వారణాసి, జనవరి 12:**మహాకుంభ్‌మేళాకు విదేశీ యాత్రికులు, ప్రముఖులు కూడా వస్తున్నారు. యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్‌జాబ్స్ సతీమణి లారెన్ పావెల్ జాబ్స్ కాశీలోని విశ్వనాథ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రయాగరాజ్‌కు వెళ్లేముందు లారెన్స్ కాశీ విశ్వనాథ మందిరంలో ప్రత్యేక పూజలు చేసారు. భారతీయ సాంప్రదాయ దుస్తులు దరించిన ఆమె కాశీ దేవాలయం పవిత్ర శివునికి పూజలు చేసారు. ఆమె హిందూ సాంప్రదాయాన్నే గౌరవిస్తారు. అదే సాంప్రదాయం ఆచరిస్తున్నట్లు తెలుస్తోంది. హిందువులు తప్ప మరే ఇతర మతస్తుడు కూడా శివలింగాన్ని స్పృశించే అర్హత ఉండదని చెపుతారు. అందువల్లనే ఆమె బయటినుంచే శివలింగాన్ని చూసి ప్రత్యేకప్రార్థనలు చేసారు. స్వామికైలాసానంద్ గిరిజి మహారాజ్ ఆమెను దేవాలయానికి తోడ్కొని వచ్చారు. ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా మహాకుంభ్ సజావుగా సాగాలని దేవదేవుడిని కోరినట్లు చెప్పారు. అమెరికానుంచే మాతోపాటు మహర్షి వ్యాసానంద్ వచ్చారు. లారెన్ తన పేరును కమలాగా మార్చుకున్న సంగతి తెలిసిందే. ఆమె ప్రయాగరాజ్‌లోని మహాకుంభ్‌ప్రాంతానికి వెళతారని కైలాసానంద్ గిరి మహరాజ్ చెప్పారు. గంగా నదిలో పవిత్రస్నానం ఆచరించి త్రివేణిసంగమంలోకూడా స్నానంచేస్తారని ఆయన చెప్పారు.



# తొలిరోజే విస్తృత మార్పులకు ట్రంప్ శ్రీకారం

## 100 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు రెడీ

**వాషింగ్టన్, జనవరి 12:** డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన మొదటిరోజే పెనుమార్పులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఏకంగా 100 ఎగ్జిక్యూటవ్ ఆర్డర్లను ఆయన కార్యవర్గం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బైడెన్ జారీ చేసిన ఆదేశాల్లో చాలా వాటిని ట్రంప్ వెనక్కి తీసుకొనే అవకాశాలున్నాయి. ముఖ్యంగా సరిహద్దు భద్రతకు సంబంధించిన కీలక విధానపరమైన నిర్ణయాలు దీనిలో ఉంటాయని భావిస్తున్నారు. క్యాపిటల్ హిల్‌లో జరిగిన ఓ ప్రైవేటు సమావేశంలో ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల గురించి ట్రంప్ తన పార్టీ సెనేటర్లకు వెల్లడించినట్లు సమాచారం. సరిహద్దులపై తీసుకునే నిర్ణయాలను ట్రంప్ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ ఇప్పటికే సెనేటర్లకు చెప్పారు. ఈ ఆర్డర్లలో అమెరికా-మెక్సికో సరిహద్దును కట్టడి చేయడం, ఫెడరల్ షెడ్యూల్ ఎఫ్‌లో ఉద్యోగుల నిబంధనలు మార్చడం, స్కూల్ జెండర్ పాలసీలు, టీకాలపై నిర్ణయం వంటివి ఉన్నాయి. ట్రంప్ సహచరులు ఇప్పటికే వీటిని తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రమాణ స్వీకారం రోజునే వీటన్నింటిపై ఆయన ఆదేశాలు జారీ చేసేలా నిర్ణయం తీసుకోనున్నారు. శ్వేతసౌధంలో కొత్త అధ్యక్షుడు అడుగుపెట్టాక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేయడం సహజం. కానీ, ట్రంప్ కార్యవర్గం మాత్రం ఇటీవలి కాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో వీటిని జారీ చేయనుంది.

# ట్రంప్ ప్రమాణ స్వీకారానికి విదేశాంగమంత్రి జైశంకర్ హాజరు



**న్యూఢిల్లీ, జనవరి 12:** అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్‌ట్రంప్ ఈనెల 20వ తేదీ అధ్యక్షుడుగాప్రమాణస్వీకారం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్‌ప్రతినిధిగా కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ హాజరవుతున్నట్లు విదేశాంగశాఖ ప్రకటించింది. జైశంకర్ అమెరికా కొత్త పరిపాలనాధికారులతోపాటు వివిధ దేశాధినేతలతో చర్చల్లో పాల్గొంటారని తెలిపింది. నవంబరులోజరిగినఅమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్‌ను రిపబ్లికన్ పార్టీనేత డొనాల్డ్‌ట్రంప్ ఓడించి ఘనవిజయం సాధించారు. ఈనెల 20న అమెరికా 47వ అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అమెరికా క్యాపిటల్ భవనంలోని వెస్ట్‌ఫ్రంట్ ప్రాంతం వేదిక అవుతుంది. ఇందుకోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ దేశాల అదినేతలు ట్రంప్ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరుకానున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో భారతీయ అమెరికన్ డోల్ బ్యాండ్ సందడిచేయనున్నది.



# కెనడా ప్రధాని రేసు నుంచి తప్పుకుంటున్నా

## భారత సంతతి ఎంపి అనితా ఇందిరా ఆనంద్

**ఒట్టావో, జనవరి 12:** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. లిబరల్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు తెలిపారు. దీంతో కెనడా ప్రధానిగా పోటీపడే మొదటి ఐదుగురిలో ప్రస్తుత రవాణా శాఖ మంత్రి, భారత సంతతి ఎంపి అనితా ఇందిరా ఆనంద్ పేరు కూడా ఉంది. కాగా తాజాగా ఆమె కీలక ప్రకటన చేశారు. కెనడా ప్రధాని రేసు నుంచి తప్పుకొంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఓక్విల్లే పార్లమెంట్ ఎంపి మరలా ఎన్నికవ్వాలని కోరుకోవట్లేదని తెలిపారు. అయితే తదుపరి ఎన్నికల వరకు ప్రస్తుతం తనకు ఉన్న బాధ్యతలను నిర్వర్తిస్తానన్నారు. పార్లమెంటు సభ్యురాలిగా లిబరల్ టీమ్‌లో తనను స్వాగతించినందుకు కీలకమైన కేబినెట్ పోర్ట్‌ఫోలియోలను అప్పగించినందుకు ట్రూడోకు, తనను ఎన్నుకున్నందుకు ఓక్‌విల్లే ప్రజలకు అనిత కృతజ్ఞతలు తెలిపారు.

'మనం దేశానికి, సమాజానికి అనేక విధాలుగా సేవ చేయవచ్చు. ప్రజా ప్రతినిధిగా కెనడాను సురక్షితంగా, బలంగా, స్వేచ్ఛగా ఉంచడానికి చేయాల్సి వన్నీ చేశారు. నేను పుట్టకముందే కెనడాకు వలస వచ్చిన నా తల్లిదండ్రులు ఈ దేశ గొప్పదనాన్ని మాకు అందించిన సహకారాన్ని చెప్తూ పెంచారు. మా లిబరల్ టీమ్ కోసం, ఓక్‌విల్లే కోసం అన్నింటికంటే కెనడా కోసం నేను ఇక్కడ ఉంటాను' అని అనిత పేర్కొన్నారు.

**ఎవరీ అనితా ఆనంద్?:** తమిళ్, పంజాబీ మూలాలున్న 57 యేళ్ల అనితా ఆనంద్ ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. 2019లో ఓక్‌విల్లే నుంచి ఎంపిగా ఎన్నికైన వెంటనే ట్రూడో కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. 2019 నుంచి 2021 వరకు ప్రజాసేవల మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత రెండేళ్లపాటు రక్షణమంత్రిగానూ వ్యవహరించారు. ఆమె రక్షణ మంత్రిగా ఉన్న సమయంలోనే ఉక్రెయిన్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. గత నెలలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తర్వాత రవాణా, అంతర్గత వాణిజ్యవ్యవహారాలమంత్రిగా బాధ్యతలు అందుకున్నారు. అనిత తండ్రి తమిళనాడుకు చెందిన ఫిజీషియన్, తల్లి పంజాబ్‌కు చెందిన వారు.

# మానవ కవచాలు వాడుతున్న హమాస్

## పాలస్తీనా అథారిటీ ధ్వజం



**వెస్ట్‌బ్యాంక్(పాలస్తీనా), జనవరి 12:** హమాస్ మానవకవచాలను వాడుతోందని పాలస్తీనా అథారిటీ సంస్థ తీవ్ర ఆరోపణలు చేసింది. వెస్ట్ బ్యాంక్‌లో ఆ సంస్థ కార్యకలాపాలు ఎంత మాత్రం అంగీకరించబోమని తెలిపింది. అయితే హమాస్‌నేత అబ్దుల్‌రహ్మాన్ షడిడ్ ఈ ఆరోపణలు ఖండించారు. పాలస్తీనా అతారిటియే తమ సభ్యులను హత్యచేసేందుకు యత్నిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్‌ఛానెల్‌లో ప్రకటించారు. తుల్కార్మ్ గవర్నరేట్ వద్ద ఏంజరిగిందో చూసారని, భద్రతా దలాలు హమాస్ వాహనంపై కాల్పులుజరిపాయని అందులోని వారిని హత్య చేసేందుకు యత్నించినట్లు ఆరోపించారు. కొన్ని రోజులవ్యవధిలోనే జరిగిన రెండో దాడి అని వెస్ట్‌బ్యాంక్‌లో హమాస్ సభ్యులను చంపాలని పాలస్తీనా అథారిటీసూచనలు చేసిందని ఈసంఘటనలు రుజువుచేస్తున్నాయన్నారు. గత 38 రోజుల్లో జెనిన్ శరణార్థి శిబిరంలోజరిగిన ఘటనలను చూస్తే పాలస్తీనీయుల రక్తంచిందించడానికి పిఎ కుట్రపన్నుతున్నట్లు తెలుస్తోందని ఆరోపించారు. అక్కడ 19 మంది మరణానికి ఆ సంస్థకారణమని తెలిపారు. పాలస్తీనా అథారిటీని నియంత్రించే ఫతా సంస్థ స్పందిస్తూ హమాస్‌ను వెస్ట్‌బ్యాంక్‌లోకి అనుమతించబోమని ఇరాన్‌కోసం ఇక్కడి ప్రజలప్రయోజనాలు ఆస్తులను నాశనం చేసిందని, గాజా వినాశనానికి కారణమైందని, ఇజ్రాయెల్‌యుద్ధంచేయడానికి అవసరమైన కారణాలు హమాసే ఇచ్చిందని ఆ సంస్థప్రజలను కవచాలుగా వాడుకోవడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గాజాలోని మానవీయ సంక్షోభానికి హమాసేకారణమని, వెస్ట్ బ్యాంక్‌లో మళ్లీ హమాస్ కార్యకలాపాలు ప్రారం భించనీయమని ఇరాన్ విస్తరణ కాంక్షకోసం పాలస్తీనాలోప్రభావాన్ని పెంచుకుందని ఆరోపిం చింది. ప్రస్తుతం పాలస్తీనా అతారిటీ ఆధ్వర్యం లోని దళాలుజెనిన్ క్యాంప్‌లో హమాస్‌ను నిర్మూలించే చర్యలు చేపట్టాయని ఫతా తెలిపింది.



# ఢిల్లీ ఎన్నికల్లో అజిత్‌వర్గం ఎన్సీపీ పోటీ

**న్యూఢిల్లీ, జనవరి 12:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ఈ ఎన్నికల బరిలోకి ఇపుడు మహారాష్ట్ర డిప్యూటి సీఎం అజిత్‌పవార్‌కు చెందిన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ దిగుతోంది. 25నుంచి 30స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దించుతోంది. ఇప్పటివరకూ ఢిల్లీలో ఆమ్ ఆద్మీపార్టీ, కాంగ్రెసన బిజెపిలమధ్యనే త్రిముఖపోటీ ఉంటుందని భావించారు. ఇకపై ఎన్సీపీ కూడా పోటీకి వస్తుండటంతో చతుర్ముఖపోటీ అవుతుంది. ఎలాంటి పొత్తులేకుండా ఒంటరిగా పోటీచేసేం దుకు సిద్ధం అయింది. వివిధ కమ్యూనిటీలకు చెందిన ఓటర్లున్న ప్రాంతాలపై దృష్టిపెట్టింది. కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులను ఖరారు చేసింది. రాజధానిలో తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు తీవ్రస్థాయిలోప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది ఎన్సీపీ ఢిల్లీ ఎన్నికల బరిలో దిగడం ఇదేమీ తొలిసారి కాదు. 2020లోనూ ఆపార్టీ ఐదుస్థానాల్లో పోటీచేసింది కానీ ఒక్క సీటుకూడా రాబట్టలేదు. అయితే 2023లో ఎన్సీపీలోని ఎమ్మెల్యేలతో కలిసి అజిత్‌పవార్ తన బాబాయ్ శరద్‌పవార్‌పై తిరుగుబాటు చేయడంతో పార్టీలో చీలిక ఏర్పడింది. ఆసంఘటన తర్వాత ఢిల్లీ ఎన్నికల్లో ఎన్సీపీ పోటీకి దిగడం ఇదే మొదటిసారి. ఢిల్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాదించేదిశగా ఆప్ కృషిచేస్తుంటే రాజధాని గద్దె ఎక్కేందుకు కాంగ్రెస్, బిజెపిలు విశ్వప్రయత్నాల్లో తలమునకలయ్యాయి. ఇపుడు ఎన్సీపీ కూడా పోటీచేస్తుండటంతో ఢిల్లీలో పరిణామాలు శరవేగంగా



# పాక్‌తో జట్టు కట్టిన బంగ్లాదేశ్

**ఢాకా, జనవరి 12:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవిని కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందడం ఆదేశంలోని హిందువులు మైనార్టీలపై దాడి నేపథ్యంలో భారత్ బంగ్లామధ్య సంబందాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్ అనుకూలంగా అనేక చర్యలు తీసుకుంటున్నది. ఆ దేశంతో వాణిజ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు వీసా ప్రక్రియను యూనస్ ప్రభుత్వం సులభతరంచేసినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. పాకిస్థాన్ రాయబారులు ఉన్నతాధికారులకు వీసాలు జారీచేసే సమయంలో ఢాకా నుంచి క్లియరెన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. వీటిని తొలగిస్తున్నట్లు ప్రస్తుతప్రభుత్వం ప్రకటించినట్లు పాకిస్థాన్‌లోని బంగ్లాదేశ్ హైకమిషనర్ ఇక్బాల్ హుస్సేన్ లాహోర్ ఛాంబర్ ఆఫ్‌కామర్స్ అండ్ ఇండస్ట్రీ వ్యాపార వర్గాలకు వెల్లడించారు. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ఆసక్తి చూపిస్తోందని అన్నారు. ఇందులోభాగంగానే ఇరుదేశాలమధ్య వాణిజ్యం పెట్టుబడులను పెంచడంకోసం ఈచర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పరస్పర వాణిజ్యం సహకారానికి ఉన్న అడ్డంకులను తొలగించడం ఇరుదేశాల బాధ్యత అన్నారు. 18 కోట్లజనాభా ఉన్న బంగ్లాదేశ్ పాకిస్థాన్‌కు ముఖ్యమైన వాణిజ్య మార్కెట్‌గా మారుతుందని హుస్సేన్ అన్నారు. ఈ అవకాశం పాక్ సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ప్రపంచం వ్యాప్తంగాప్రాంతీయ సహకారం పెరుగుతున్నా దక్షిణాసియా ఇప్పటికీ సవాళ్లను ఎదుర్కొంటున్నదని వీటిని అధిగమించేందుకు సమిష్టికృషి అవసరమని అన్నారు. ప్రాంతీయ వాణిజ్యం సహకారాన్ని పెంపొందించేందుకు దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. షేక్ హసీనా పదవి కోల్పోయిన తర్వాత తాత్కాలిక సారథి నేతృత్వంలోని బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో పూర్తిగా మార్పులు వచ్చాయి. ఈ క్రమంలోనే రెండుదేశాలమధ్య వాణిజ్య సంబందాలు బలోపేతం అవుతున్నాయి. అందులో భాగంగానే 53 ఏళ్లలో తొలిసారి గతనెల పాక్‌నుంచి నేరుగా బంగ్లాకు కార్గోషిప్ సరకు రవాణా నౌకలు చేరుకున్నాయి. హసీనా ప్రభుత్వం ఉన్నపుడు పాకిస్తాన్‌నుంచి వచ్చే కార్గోను భౌతికంగా తనిఖీచేయాలనే నిబంధన ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం దానిని తొలగించింది. దాంతో కార్గో తరలింపు పాక్‌నౌకలకు సులభం కానుంది. అయితే సరకు రవాణా ముసుగులో ఈశాన్యరాష్ట్రాల్లోని వేర్పాటు వాద గ్రూపులకు ఆయుధలు ఆందే ప్రమాదం ఉందని భారత్ ఆందోళన వ్యక్తం చేస్తున్నది.

13-1Pg6exHMNWJQE.qxd:13-1Pg6exHMNWJQE.qxd 01/01/01 9:43 AM Page 1





ఆదివారం అధికారులు,అర్చకులతో సమీక్షిస్తున్న ఇఓ బాపిరెడ్డి

# గిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు

**శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే సంక్రాంతి సంబరాలకు విస్తృతస్థాయి ఏర్పాట్లను ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆలయ పరిపాలనా భవనంలోని తన ఛాంబర్‌లో అర్చకులు అధికారులతో సమీక్షించారు. ఆలయంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించటం ఆనవాయితి. ధనుర్మాసం ప్రారంభం అయినప్పటి నుంచి పట్టణంలో ప్రతి రోజూ గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గిరి ప్రదక్షిణ భారీ ఎత్తున నిర్వహించాలని సంక్రాంతి, శివరాత్రి బ్రహ్మోత్సవాలకు బారీ ఎత్తునజనం హాజరౌతారని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికారులను పరుగులు తీయిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఈ నెల 15న కనుమ సందర్బంగా స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షిణను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 14న గిరిప్రదక్షిణకు ముందు శూలం పల్లకి గిరి ప్రదక్షిణను నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ నెల 14న సంక్రాంతి పర్వదినం సందర్భంగా అమ్మవారిని గొబ్బెమ్మగా బంగారు సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.

**మూడు రోజులు ఆర్జిత సేవలు రద్దు:** గిరి ప్రదక్షిణ సందర్బంగా ఉత్సవర్లు ప్రదక్షిణకు వెళతారు కాబట్టి మూడు రోజుల పాటు భక్తుల ఆర్జీత సేవలు రద్దు చేసినట్లు ఆలయాధికారి టి.బాపిరెడ్డి ఓప్రకటనలో తెలిపారు. 14,15 తేదుల్లో మూడు కాలాల అభిషేకాలను దేవస్థానం రద్దు చేసినట్లు వివరించారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు యథావిధిగా నిర్వహించ బడుతుందని తెలిపారు. ఈ సమీక్షల్లో ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ మురళీ ధర్‌రెడ్డి, ఎఇఓలు లోకేష్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి ఎస్ఓ నాగభూషణం యాదవ్, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్‌లు పాల్గొన్నారు.

# టిటిడి పాలనలో ప్రక్షాళన తప్పదా!?

## అధికారుల పెత్తనంపై పాలకమండలి ఆగ్రహం

## సిఎం ఎదుటే ఛైర్మన్, ఇఓ వాగ్వాదం ఉదంతం మరింత సీరియస్



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ప్రసిద్ధ హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ఐదేళ్ళలో జరిగిపోయిన నష్టాన్ని, తప్పిదాలపై ప్రక్షాళన చేసేదిశగా ఎనిమిదినెలల ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్న సమయంలో ,దేవస్థానం పరిపాలనలో కీలకంగా వ్యవహరించే పాలకమండలితో అధికారులు విభేధించడం ఇప్పుడు ఎక్కడకు దారితీస్తుందనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది. టిటిడిలో గత నిర్ణయాలపై ప్రక్షాళనకంటే తాజా పరిణామాలతో పాలనలో అధికారుల ప్రక్షాళన చేయాల్సిన దిశగా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇందుకు నిదర్శన ఘటనగా ఐదురోజుల క్రిందట తిరుపతిలో తొక్కిసలాట ఘటనతో ఆరుగురు భక్తులు మృతి చెందడం చోటుచేసుకున్న అంశం తీవ్రంగా దేశవ్యాప్తంగా కలచివేసింది. మృతుల కుటుంబాలను ఓదార్చేందుకు, క్షతగాత్రులను పరామర్శించేందుకు గత గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతికి వచ్చారు. ఆ సందర్బంలో సిఎం ముందే టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఓ జె.శ్యామలరావు మాటామాటా పెరిగి గట్టిగా విభేధించారు. ఈ పరిణామాన్ని గమనించి ఇద్దరినీ వారించిన చంద్రబాబు దీన్ని సీరియస్‌గానే తీసుకున్నారు. ఇదే ఘటనపై ఏకంగా టిటిడి ఇఓ,అదనపు ఇఓ మధ్య అవగాహనలేదని, సమన్వయంలేకపోయిందని విరుచుకుపడ్డారు. తప్పిదం జరగడానికి ఇఓ,అదనపు ఇఓ పనితీరు ,పర్యవేక్షణ సరిగా లేదనే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత స్వయంగా సిఎం నే, సీనియర్ ఐఎఎస్ అధికారి.మంచివ్యక్తిత్వం ఉన్న శ్యామలరావును ఇఓగా నియమించారు.ఆ తరువాత అదనపు ఇఓగా సీనియర్ ఐఆర్ఎస్ అధికారి, భక్తిభావం, విశ్వాసం ఉన్న సిహెచ్. వెంకయ్యచౌదరిని తీసుకువచ్చారు. కొంతకాలానికి తనకు నమ్మకస్థుడైన, దేవునిపట్ల విశ్వాసం, భక్తిభావం ,చిత్తూరుజిల్లా వాసిగా ఎంతో అనుభవం ఉన్న బిఆర్ నాయుడును పాలకమండలి ఛైర్మన్‌గా నియమించి టిటిడిలో పాత విధానాలను మార్పుచేసి, కొత్తవిధానాల అమలుచేయాలని, సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం చేయించాలనే దిశగా అడుగులు వేయాలని స్పష్టమైన సంకేతాలిచ్చి పంపారు. ఆదిలోనే టిటిడిలో అధికారులు, పాలకమండలి మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే స్థాయిలో వివాదం రాజుకుంది. దీనికి తోడుగా మండేమంటకు ఆజ్యంపోసినట్లు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో ఉచిత టోకెన్లు జారీచేసేందుకు తీసుకున్న చర్యల్లో వైకుంఠద్వారాలు తెరచుకోకముందే విషాద ఘటన జరిగిపోయింది. తదనంతరం పాలకమండలి, అధికారుల మధ్య సమన్వయంలేదని, ఆధిపత్యపోరు ఉందనేది రాజకీయ చతురత కలిగిన సిఎం చంద్రబాబుకు అర్థమైంది. దీంతో ఈ వివాదం పెద్ద తలనొప్పిగా మారకముందే ఇప్పుడు టిటిడి పరిపాలనలో పూర్తిస్థాయిలో మార్పులు చేసేందుకు సిద్దమైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆరుగురు మృతికి, 40మందివరకు క్షతగాత్రులవడానికి టిటిడి ఇఓ పనితీరులో లోపాలు కూడా ఒక కారణమని పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సిఎంకు విన్నవించారు. సిఎం పరామర్శ సందర్బంలోనే ఇఓపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వెలిబుచ్చారు. అయితే ఇప్పటికే ఈ ఘటనలో టిటిడి జెఇఓ గౌతమి, సివిఎస్ఓ శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు బదిలీ అనివార్యమయ్యాయి. మరో ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటుపడింది.

**ఆయన బదలీ తప్పదా!?:** తనెంతో నమ్మికొలిచే ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వారాలు తెరచుకోకముందే తిరుపతిలో జరిగిన విషాధ ఘటనపై తీవ్ర ఆగ్రహం, అసహనం చెందిన సిఎం చంద్రబాబునాయుడు నిశితంగా పరిణామాలను గమనించారు. టిటిడి ఇఓ పనితీరు ఆగ్రహం తెప్పించింది. టిటిడి పరిపాలనలో సుప్రీమ్ అయిన పాలకమండలితో సఖ్యతగా వ్యవహరించలేకపోవడం,భక్తులకు సేవలందించడంలో సహకరించడంలేదనే అంశంపై ఇఓను తప్పించాలని ఛైర్మన్ కూడా గట్టిగా సిఎంకు విన్నవించారు. తిరుమలలో ఆ ముగ్గురు కీలకుల మధ్య సమన్వయం లేదని, ఎవరికి వారే నిర్ణయాత్మక శక్తులుగా ఎదగాలని వ్యవహరిస్తుండటంతో సమస్య మరింత జఠిలమై చెడ్డపేరు మూటగట్టుకోకముందే పరిష్కారం చూపే దిశగా ఆలోచనచేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇఓను మార్పుచేసి మరింత సఖ్యతగా ,అనుభవం ఉన్న ఐఎఎస్ అధికారిని నియమించడమే మంచిదనే నివేదికలు కూడా ప్రభుత్వానికి అందాయి. ఈ నివేదిక ఆధారంగా ఆయనను తప్పించేందుకే చూస్తున్నారనేది టిటిడి వర్గాల్లో పెద్ద చర్చ జరుగుతోంది. ఇదేగాక గతనెలలోనే ఛైర్మన్ నాయుడు అమరావతి వెళ్ళి సిఎంను కలసి ఇఓ తీరుపై ఫిర్యాదు చేయడం, ఇఓను పిలిచి కలసి పనిచేసుకోవాలని ,సమన్వయం అవసరమని తనదైన మాటగా సూచించారు. అయినా మార్పు కనిపించకపోవడంతో కొంతకాలం ఉంచినా చెడ్డ పేరు వస్తుందని, బదిలీనే శరణ్యమన్నట్లు సమాచారం.

# తెలుగు రాష్ట్రాల రైల్వే డీజిల్ షెడ్డులలో పెరుగుతున్న సూపర్‌వైజర్ ఖాళీలు

## పనిభారంలో డీజిల్ షెడ్ సెక్షన్ ఇంజినీర్లు




**గుంతకల్లు రైల్వే,జనవరి 12,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని డీజిల్ షెడ్‌లలో కీలకమైన సూపర్‌వైజర్ కేటగిరిలో ఖాళీల స్కోర్ ఏరోజుకారోజు పెరుగుతూనే ఉంది. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే డీజిల్ షెడ్‌లో మెకానికల్ వింగ్‌లో-7,ఎలక్ట్రికల్ వింగ్‌లో మరో 4వెరసి మొత్తంగా 11సెక్షన్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని గుత్తి డీజిల్ షెడ్‌లో మెకానికల్ వింగ్‌లో-10, ఎలక్ట్రికల్ వింగ్‌లో-3 వెరసి మొత్తం 13సెక్షన్ ఇంజనీర్ పోస్టులు,గుంతకల్లు డీజిల్ షెడ్‌లో మెకానికల్ వింగ్‌లో-6,ఎలక్ట్రికల్ వింగ్‌లో-7 వెరసి మొత్తం 13సెక్షన్ ఇంజనీర్ పోస్టులు, మౌలాలి డీజిల్ షెడ్‌లో మెకానికల్ వింగ్‌లో 2,విజయవాడ డీజిల్ షెడ్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్ వింగ్‌లలో ఒక్కొక్కటి చొప్పున రెండు సెక్షన్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెరసి మొత్తం దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో మెకానికల్ వింగ్‌లో 26,ఎలక్ట్రికల్ వింగ్‌లో మరో 15 చొప్పున మొత్తం 41సెక్షన్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైల్వే వర్గాల సమాచారం. వీటిని తక్షణమే భర్తీ చేసి సిబ్బందిపై అదనపు పనిభారాన్ని నివారించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

# నేటి నుంచి పలు రైళ్ల రద్దు..

**గుంతకల్లు రైల్వే,జనవరి 12,ప్రభాతవార్త:** నిర్వహణ పరమైన కారణాల వల్ల తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ ప్రాంతాల మధ్య తిరిగే పలు రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07032ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం ఈ నెల(13)న రద్దు చేశారు. అలాగే చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్ వెళ్లే నెంబర్ 07031ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 14న,మచిలీపట్నం నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07122ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 13న సోమవారం,షోలాపూర్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 01437ఎక్‌ప్రెస్‌ను ఈ నెల 16న,తిరుపతి నుంచి షోలాపూర్ వెళ్లే నెంబర్ 01438ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 17న,గుంటూరు నుంచి కొల్లం వెళ్లే నెంబర్ 07181ఎక్స్‌ప్రెస్‌ను, కొల్లం నుంచి గుంటూరు వెళ్లే నెంబర్ 07182 ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 20న రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

# తిరుచానూరులో డొమెస్టిక్ గ్యాస్ పైప్‌లైన్ సరఫరాను ప్రారంభించిన సిఎం

## లబ్దిదారుల కుటుంబతో మాట్లాడి తక్షణమే ఇల్లు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు



**తిరుపతి కలెక్టరేట్, జనవరి 12 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా తిరుచానూరులో నివాసం ఉంటున్న శరవణ ఇంటిని సందర్శించి వారి కుటుంబ సభ్యులను కలిసి వారి ఇంటికి అమర్చిన డొమెస్టిక్ పైప్ లైన్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) సరఫరాను సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించి స్వయంగా చంద్రబాబు టీ పెట్టాడు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ గ్యాస్ పైల్ లైన్ గురించి అడగగా వారు ఈ గ్యాస్ పైప్ లైన్ చాలా ఉపయోగకరంగా ఉందని ప్రతి సారి సిలిండర్లు అయిపోతే మళ్ళీ సిలిండర్ తెచ్చుకునే అంత వరకు ఇబ్బంది ఉండేదని ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదని, 24 గంటలు గ్యాస్ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు. మీటరు అమర్చతారని ఎంత గ్యాస్ వాడితే దానికి మాత్రమే ప్రతి నెల కరెంటు బిల్లు లాగా గ్యాస్ బిల్లు కట్టుకోవడానికి చాలా సులభతరంగా ఉందని తెలిపారు. వారి వృత్తి, ఆర్థిక పరమైన విషయాలను గురించి అడుగగా తాను కార్పెంటర్ పని చేస్తున్నానని ప్రస్తుతం పనులు లేక రెండు ఆవులు ఉన్నాయని తెలిపారు. వారు తమ సొంత ఇల్లు లేదని తెలుపగా అప్పటికప్పుడే రూ.3లక్షల రూపాయలు గృహ నిర్మాణ సంస్థ ద్వారా గృహాన్ని మంజూరు చేస్తూ అదనంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లక్ష రూపాయలు మంజూరు చేసి పీఎంఈజీపీ క్రింద నాలుగు ఆవులకు రెండు లక్షల రూపాయలు మంజూరు పత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఏపీ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఆర్ అండ్ బి మినిస్టర్ బీసీ జనార్థన్‌రెడ్డి, చంద్రగిరి, తిరుపతి, నగరి, శ్రీ కాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరని శ్రీని వాసులు, గాలి భాను ప్రకాష్, బొజ్జల సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# గోవిందుని కానుకలకే కన్నం వేస్తున్న కంత్రీగాళ్లు!

## ఆధునిక పరకామణి భవనంలోనూ సిబ్బంది చేతివాటం



**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి మొక్కుబడుల రూపంలో భక్తులు ముడుపులను కానుకలుగా సమర్పించుకున్న నగదునే తస్కరించే కంత్రీగాళ్ళు పరకామణిభవనంలో తిష్టవేశారంటే ఆశ్చర్యం కలిగించడం లేదు. ఆపదమొక్కులవాడికి ఎంతో భక్తివిశ్వాసాలతో భక్తులు తమ కష్టార్జితాన్ని కానుకలుగా రోజుకు సరాసరి 3.50కోట్లరూపాయల నుండి 4కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తోంది. ఇందులో దేశ,విదేశీ భక్తులు తమతమ కరెన్సీని సమర్పించుకుంటారు. కోట్ల రూపాయల కానుకల లెక్కింపుకు అధునాతన టెక్నాలజీ పరకామణి భవనం ఉంది. సుమారు 25కోట్లు రూపాయలు వ్యయంతో చుట్టూ నిఘానేత్రాలతో నిరంతరం పర్యవేక్షణ సాగించేలా లెక్కింపు జరుగుతుంది. విదేశీ కానుకలకు ఎంతో విలువ. ఈ కానుకలు లెక్కించేందుకు పరకామణిలో ఔట్‌సోర్సింగ్ క్రింద సిబ్బందిని నియమించుకుంటారు. ప్రస్తుతం 105మంది వరకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉండగా వీరిలో 70మంది నాలుగేళ్ళక్రిందట అప్పటి వైసిపి ప్రభుత్వంలోని టిటిడి పెద్దలు అప్పగించిన కాంట్రాక్టర్ ద్వారానే పనిచేస్తున్నారు. ఆరునెలల క్రిందట ప్రస్తుత ప్రభుత్వం మరో కాంట్రాక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. వీరిలో 35మంది కొత్తవారు ఉన్నారు. మరో 35మంది తిరుపతిలోని పరకామణిలో సేవలందిస్తున్నారు. వీరికి సహాయకులుగా పరాకమణి సేవకులు ఉంటారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే వారిపై పర్యవేక్షణకు డిప్యూటీ ఇఓ అధికారి, 15మంది వరకు శాశ్వత ఉద్యోగులు ఉంటారు. పరకామణి భవనంలోపల, వెలుపల నిరతంరం నిఘానేత్రాలతో విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. మరీ ఇంత పటిష్ట నిఘా సమయంలోనే పరకామణిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెంచలయ్య 100గ్రాముల బంగారు బిస్కెట్‌ను చోరీ చేయడం దొరికిపోవడం విశేషం. ఈ కానుకల బంగారు నగలు,నగదును లెక్కించే సిబ్బంది పలువురు గతంలో చేతివాటం చూపించి విదేశీ కరెన్సీని అందినకాడికి దండుకున్న సందర్భాలు, కేసులు ఉన్నాయి. మరీ తాజాగా పట్టుబడిన పెంచలయ్యకు ఎవరు సహకారం అందిస్తున్నారనేది ఇప్పుడు సంచలనంగా మారింది. కాగా రెండు షిఫ్టుల్లో ఉద్యోగులు సేవలందిస్తున్నా, పకడ్బందీగా నిఘానేత్రాలతో 24గంటలూ పర్యవేక్షిస్తున్నా దొంగలు దేవుని సొమ్మునే కాజేస్తున్నారంటే వీరికి ఏ శిక్ష వేయాలనేది ఆ వడ్డీకాసులవాడే నిర్ణయించాలి. ఆలయంలోపల ఉన్న ప్రధాన హుండీ కానుకలతో నిండిపోతుంటుంది. సరాసరి రోజుకు 9దఫాలుగా హుండీలోని కానుకలు పరకామణికి తరలించి లెక్కిస్తుంటారు.

# పాతబకాయిలు విడుదల చేసిన సిఎంకు ధన్యవాదాలు

**విజయవాడ, జనవరి 12, ప్రభాతవార్త :** సంక్రాంతి కానుకగా రు.1300 కోట్ల పాతబకాయిలు విడుదల చేసిన ఆంధ్రరపదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లకు ఏపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు మాట్లాడుతూ ఉద్యోగులకు మేలు చేసిన ముఖ్యమంత్రి ఐఆర్ ప్రకటిస్తారని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నామని, రు.25వేల కోట్ల బకాయిలకు గాను రు.1300 కోట్లు మాత్రమే విడుదల చేశారని మిగిలిన మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. అలాగే రిటైరైనవారి బెనిఫిట్స్ చెల్లింపు, ఏపిజిఎల్ఐ బాండ్స్ ద్వారా రావాల్సిన నగదు చెల్లింపు, సరెండర్‌లీవ్‌లకు సంబంధించిన బకాయిల చెల్లింపు, పెండింగ్ డిఏలు చెల్లింపు లు చేయాలన్నారు. అలాగే పిఆర్‌సి కమిటీరిపోర్టు వెంటనే ప్రభుత్వానికి నివేదించేలా ఆదేశాలిచ్చి ఉద్యోగులకు మంచి ఫిట్‌మెంట్ ఇవ్వాలని సిఎంను కోరారు.



# నకిలీ సిగరెట్ల విక్రయ ముఠా పట్టివేత

## రూ.2 కోట్ల విలువ చేసే సరుకు స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, జనవరి 12, ప్రభాత వార్త:** ప్రముఖ బ్రాండ్లకు చెందిన సిగరెట్లకు నకిలీలు తయారు చేసి విక్రయాలు జరుపుతున్న ముఠా సభ్యుడు ఒకరిని నెల్లూరు జిల్లా విజిలెన్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం నగరంలోని రామలింగాపురం సమీపంలో ఉన్న ఒక గోదాముతో పాటు నగర శివాలల్లోని ఇనమడుగు సెంటర్ వద్ద ఉన్న ఒక ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలోనూ సోదాలు నిర్వహించారు. రామలింగాపురం గోదాములో విక్రయాలు జరిపేందుకు సిద్ధంగా ఉంచిన ప్రముఖ బ్రాండ్లకు చెందిన రూ. 1,73,59,600 విలువచేసే సిగరెట్ ప్యాకెట్లను, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో రూ. 47,52,000 విలువచేసే నకిలీ సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

చెన్నై నగరానికి చెందిన కమల్ తివారి అనే వ్యక్తి గత కొంతకాలంగా ఉత్తరాది రాష్ట్రాల నుండి ఈ నకిలీ బ్రాండ్ సిగరెట్లు ఇక్కడకు తీసుకొచ్చి విక్రయాలు జరుగుతున్నాడని విజిలెన్స్ సిబ్బంది విచారణలో వెల్లడైంది. ఇక్కడ విక్రయాలు నిర్వహించేందుకు జగదీష్ అనే వ్యక్తిని మేనేజర్‌గా ఏర్పాటు చేసు కొని నెల్లూరు జిల్లాతో పాటు పక్క జిల్లాలకు కూడా ఈ నకిలీ సిగరెట్లను సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ప్రస్తుతం జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నామని, కమల్ తివారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుని విచారిస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

# డాక్టర్ ప్రభావతిపై లుక్ అవుట్ నోటీసులు

## త్రిబుల్ ఆర్ కేసులో బిగిస్తున్న ఉచ్చు

**విజయవాడ, జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసనసభ ఉపసభాపతి, మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజును గత ప్రభుత్వ హయాంలో సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి, అంతమొందిం చేందుకు యత్నించిన కేసులో కీలక నిందితురాలైన గుంటూరు జీజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిపై లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి. ఆమె విదేశాలకు పారిపోయే అవకాశం ఉండటంతో కేసు దర్యాప్తు అధికారి,ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.డాక్టర్ ప్రభావతి అరెస్టుకు నాలుగు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు. అప్పట్లో వైకాపా ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి, తీవ్రంగా గాయపరిచారు. ఆయన శరీరంపై గాయాలేమీ లేవంటూ డాక్టర్ ప్రభావతి తప్పుడు ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నది అభియోగం. జీజీహెచ్‌లో అప్పట్లో రఘురామకు వైద్యపరీక్షలు చేసిన వైద్యు లు ఆయన రెండు పాదాలు కమిలిపోయి ఉన్నట్లు కేస్ షీట్‌లో పేర్కొనగా, ఆ వాస్తవాలన్నింటినీ మెడి కల్ బోర్డు కప్పిపుచ్చుతూ రఘురామ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, బయటకు కనిపించే గాయా లేవీ లేవని, కొట్టడం వల్ల ఎలాంటి గాయాలు కాలేదని మోసపూరిత నివేదిక సమర్పించింది. రఘురా మను కోర్టులో హాజరుపరచడానికి ముందు వైద్యపరీక్షల నిమిత్తం జీజీహెచ్ కార్డియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బేతం రాజేంద్రను సీఐడీ కార్యాలయానికి పిలిపించారు. ఆయనపై నాటి ఏఎస్పీ విజయ్‌పాల్‌తో పాటు సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రభావతి ఒత్తిడి తెచ్చి , మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌పైసంతకం చేయించుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంతో ఆమె పాత్ర కీలకమని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ముందస్తు బెయిల్ కోసం ప్రభావతి దాఖలుచేసిన పిటిషన్‌ను ఈ నెల 10న ఏపీ హైకోర్టు కొట్టేసింది.దీంతో తనను ఏ క్షణమైనా అరెస్టుచేసే అవకాశముందనే ఉద్దేశంతో ఆమె అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

# నేటి నుండి దుర్గమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు

**ఇంద్రకీలాద్రి, జనవరి 12, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం కమనీయంగా శ్రీ శివకామసుందరి, నటరాజస్వామివార్ల దివ్యలీలా కళ్యాణోత్సవం నిర్వహించారు. శనివారం నుండి వేదోక్తంగా ప్రారంభమైన ఆర్ద్రోత్సవాల్లో భాగంగా ఉదయం నుండి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం శ్రీ స్వామి అమ్మవార్లకు కళ్యాణక్రతువును నిర్వహించారు. అనంతరం శ్రీ శివకామ సుందరి సమేత నటరాజస్వామివార్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, వేదపండితులు, వైదిక సిబ్బంది, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈనెల 13వ తేదీ వరకు ఆర్ద్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్ర మోహన్ వెల్లడించారు. ఈనెల 13న ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం ఉత్సవర్లకు నగరోత్సవం నిర్వహిస్తామన్నారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి: దుర్గమ్మవారిని ఆదివారం కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె లలిత దరి ్శంచుకున్నారు. వారికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం , మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశ్వీచనాలు పలికారు.

**దుర్గమ్మవారికి వెండిబిస్కెట్లు కానుక:** దుర్గమ్మవారికి విజయవాడకు చెందిన చల్లపల్లి అనీశ్వర కృష్ణ, కుటుంబసభ్యులతో కలిసి 3192గ్రాముల బరువైన వెండి బిస్కెట్లను ఇఓ కె రామచంద్రమోహన్‌కు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మ ప్రసాదం, వేదాశ్వీరచనాలు పలికారు.

**దుర్గమ్మ ఆలయంలో నేటినుండి సంక్రాంతి ఉత్సవాలు:** దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం నుండి 3 రోజులపాటు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్రమోహన్ తెలిపారు. సోమవారం ఉదయం బోగిమంటలు చినరాజగోపురం వద్ద నెలవైయున్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి మందిరం వద్ద నిర్వహిస్తామన్నారు. హరిదాసు సంకీర్తనలు, బసవనల (గంగిరెద్దుల) విన్యాసాలు, పలు సాంస్కృతిక కార్యరకమాలు నిర్వహిస్తామన్నారు. 7వ అంతస్తు శ్రీ మలికార్జున మహామండపం వద్ద బొమ్మల కొలువు, సాయంత్రం 5.30 గంటలకు గొబ్బెమ్మల ఏర్పాటు, బోగిపండ్లు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మ వారి ఆలయం, ఆలయప్రాంగణంలోని ఉపాలయాలన్నింటిని పూలదండలతో చూడముచ్చటగా అలంకరించారు.



# విద్యుత్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ నుంచి ఊరట..

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యుత్తుకార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకునేవారికి నూరుశాతం లైఫ్‌ట్యాక్స్ మినహాయిస్తూ ఉత్తర్వు జారీచేసింది. గత ఏడాది డిసెంబరు 11న ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 ని ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. అది కొనసాగినంత కాలం అంటే 2029 వరకు ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొంది.

ప్రస్తుతం ద్విచక్ర వాహనాలకు లైఫ్‌ట్యాక్స 12% ఉంది. ఈవీలకు ఈ పన్ను ఉండదు. ఉదాహరణకు ఓలా ఎస్ 1 ప్రో ధర రూ.1.35 లక్షల వరకు ఉంది. దీనికి 12% అంటే. రూ. 16200 మేర ఊరట లభిస్తుంది. కార్లకు నాలుగు శ్లాబుల్లో ఈ పన్ను వసూలు చేస్తున్నారు. రూ.5 లక్షలలోపు ధర ఉన్న కారుకు 13% రూ.5-10 లక్షల మధ్య కార్లకు 14%. రూ.10-20 లక్షల మధ్య కార్లకు 17% రూ.20 లక్షల కంటే ఎక్కువ ధర ఉండే కార్లకు 18% లైఫ్‌ట్యాక్స్ ఉంటుంది. ఈవీలకు ఈ పన్ను మినహాయిస్తారు. ఉదాహరణకు టాటా నెక్సాన్ ఈవీ కారు ధర రూ.12.5 లక్షలు ఉండగా దీనికి రూ.2.12 లక్షలు పన్ను మినహాయింపు లభిస్తుంది. బీవైడీ సీల్‌ఈవీ ధర రూ.41లక్షలు ఉండగా దీనికి రూ.7.38 లక్షలు పన్ను చెల్లించాలి.

ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఆ సొమ్ము కొనుగోలుదారుకు మిగిలినట్లే. జీవితపన్ను రాయితీ హైబ్రిడ్ విద్యుత్ నాలుగు చక్రాల వాహ నాలకు వర్తించదని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. బ్యాటరీతోపాటు,పెట్రోల డీజిల్‌తో కూడా నడిచే వాహనాలు ఈ కోవలోకి వస్తాయి.

13-1P□g7exHMNWJQE.qxd:13-1P□g7exHMNWJQE.qxd 01/01/01 9:42 AM Page 1



## ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండగ సందర్భంగా వేసే భోగిమంటలు అందరి జీవితాల్లో భోగభాగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. మకర రాశిలోకి సూర్యుడి ప్రవేశంతో ప్రారంభమయ్యే ఉత్తరాయణం.. పుణ్య కాలమని, ప్రజల జీవితాల్లో ఈ సంక్రాంతి పండుగ సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలతో ముందుకుపోతుందని గుర్తు చేశారు. ప్రతి రైతు కుటుంబం ఆనందంగా గడుపుతున్నారని.. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తి, సన్నవడ్లకు రూ. 500 బోనస్, రైతు భరోసా రూ.12 వేలకు పెంచడం, ఇందిరమ్మ ఆత్మీయ కానుక ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల ఆర్థిక సహాయం, కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఈ పండగ సందర్భంగా ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

### ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దు

### పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్‌సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌టీ యూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, నల్గొండ-వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో పీఆర్‌టటీపీ సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడు వేంరెడ్డి దిలీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమా వేశంలో శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ గురుకులాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న పాఠశాలల పనివేళలపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఉత్తర్వులిస్తామని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులకి బోధనేతర పనులు లేకుండా, అన్ని కాలేజీలకి కేర్‌టేకర్లను నియమించేలా యత్నిస్తానన్నారు.

## పామాయిల్ విస్తరణతోనే స్వావలంబన

### ప్రభుత్వ సలహాదారు బిఎన్ రావు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** పామాయిల్ సాగు విస్తరణ ద్వారానే వంట నూనెల ఉత్పత్తిలో స్వావలంబన సాధించగలుగుతుందని పామాయిల్ సాగు నిపుణులు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ బి.ఎన్.రావు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో ఆయిల్‌పామ్ సాగు, ప్రాసెసింగ్ ఆహార, ఆహారేతర రంగాల్లో ఉపయోగాలు అనే అంశంపై జరిగిన జాతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఎకరానికి ఏటా కనీసం లక్ష రూపాయల వరకూ నికరమైన ఆదాయం వస్తుందన్నారు. ఏ ఇతర పంటల్లో లేని విధంగా ఆయిల్‌పామ్ రైతులకు నిరంతర ఆదాయం వస్తుందని చెప్పారు. అయితే ఏడాది పొడవునా కాలువ, బోరు నీటి సదుపాయం పుష్కలంగా ఉండి, 30 ఏళ్ల పాటు నీటి సమస్య ఉండదనుకున్న రైతులే పామాయిల్ సాగు చేపట్టాలని సూచించారు. పామాయిల్ ఉత్పత్తికి సంబంధించిన శాస్త్రవేత్తలు, ప్రాసెసింగ్ శాస్త్రవేత్తలు కలసి పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పరిశోధనా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీసీఎంబీ విశ్రాంత ప్రిన్సిపల్ సైంటిస్ట్, అగ్రి హార్టీకల్చర్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఏపీ రావు వాతావరణ పరిస్థితు గూర్చి వెల్లడించారు. పరిశోధనల లేమి కారణంగా పామాయిల్ సాగులో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.

## పండుగ వేళ 5 లక్షల మందికిపైగా గమ్యస్థానాలకు చేర్చిన ఆర్‌టిసి

### ఇప్పటికే గమ్యాలకు చేరుకున్న 5వేల స్పెషల్ బస్సులు

### బస్సుల సంఖ్యను పెంచాలంటున్న ప్రయాణికులు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్‌టీసీ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణీలకు సౌకర్యార్థం స్పెషల్ బస్సులను నడుపుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా గత రెండు రోజులుగా పండుగ నేపథ్యంలో సుమారు 5 లక్షల మందికి పైగా ప్రయాణీకులను తమ గమ్యస్థానాలకు చేర్చినట్టు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కి స్పెషల్ బస్సులను నడుపుతున్న సంగతి తెలిసిందే. పండుగ నేపథ్యంలో 6432 స్పెషల్ బస్సులను నడపాలని టీజీఎస్‌ఆర్‌టీసీ నిర్ణయించింది. ఈ నెల 10 నుంచే ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇప్పటి వరకు 5వేలకిపైగా బస్సులు ప్రయాణీకులను తమ గమ్య స్థానాలకు చేర్చింది. నేడు(సోమవారం) కూడా రద్దీ కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో మరికొన్ని బస్సులను అదనంగా ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాన్ని ప్రయాణీకులు వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. రైళ్లు ఎక్కువగా లేకపోవడంతోపాటు ప్రైవేటు వాహనదారులు విపరీతంగా రేట్లను పెంచిన నేపథ్యంలో ఎక్కువ మంది ప్రజా రవాణా అయిన ఆర్‌టీసీ వైపు మొగ్గుచూపుతున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

## పాలమూరు-డిండి ప్రతిపాదన రద్దు చేసుకోవాలి

### పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 12, ప్రభాతవార్త:** ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గోదవరి కృష్ణ నదులు స్వాదీన ఉత్తర్వుల రద్దు కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పాలమూరు డిండి ప్రతిపాదన రద్దుచేసుకోవాలని, గోదావరి కృష్ణా నదుల అనుసంధానం మానుకోవాలని, తెలంగాణకు కృష్ణానది నీటి వాటా పెంచడంతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సగం శ్రీశైలం నుండి సగం జూరాల ఎగువ నుండి చేపట్టి రెండు జిల్లాల నీటి సమస్య తీర్చాలని సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో పాలమూరు డిండి ప్రతిపాదన రద్దుచేసుకోవాల డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అదే విధంగా .అచ్చంపేట లిపులో రుషల్ చెరువును రిజర్వాయర్‌గా చేపట్టి భూముల ముంపు నివారించాలని, నిర్వాసితులకు భూమి ఉద్యోగం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాన రాష్ట్రానికి సాధించిన నీటిని రాష్ట్రంలోపల న్యాయమైన ప్రాతిపదికలతో పున పంపిణీ చేసి వినియోగంలోకి తేవాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా విడుదల చేస్తున్న అన్ని నివేదికలు ప్రామాణికమైన జీవన రంగాల ప్రగతిలో తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లా వెకనబడి వుందని చెబుతున్నాయని అన్నారు.

## రామాంతాపూర్‌లో దారుణం

### మతిస్థిమితంలేని మహిళపై అత్యాచారం

**వెల్దుర్తి, జనవరి 12, ప్రభాతవార్త:** మాసాయిపేట మండల పరిధిలోని రామాంతాపూర్‌లో 44వ జాతీయ రహదారిపై గల అంబేద్కర్ విగ్రహం వెనక మతిస్థిమితం లేని మహిళపై ముగ్గురు యువకులు అత్యాచారం చేసిన సంఘటన సీసీ టీవీ ఫుటేజీలో ఆదివారం వెల్లడైంది. రామాంతాపూర్‌కు చెందిన స్వామి తన పశువులు కనబడడం లేదని ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రామాంతపూర్‌లో హంస దాబాలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు చూస్తుండగా మతిస్థిమితంలేని మహిళపై జరిగిన అత్యాచార సంఘటన వెలుగు లోకి వచ్చింది. రామాయంపేట సీఐ వెంకట రాజాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితంలేని మహిళపై సామూహిక అత్యాచారం సంఘటనపై విచారణ చేపట్టామని తెలిపారు. ఈ నెల 8న ఈ ఘటన జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు. బాధిత మహిళను పోలీసులు భరోసా సెంటర్‌కు తరలించారు.

# ఐలోని మల్లన్న ఉత్సవాలకు బారులు తీరిన భక్తజనం



**ఐనవోలు, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా ఐనవోలు శ్రీ మల్లి కార్జున స్వామి ఆలయం విరజల్లు తుంది. ప్రతి ఏటా మకర సంక్రాంతి నుండి ఉగాది వరకు అత్యంత వై భవంగా ఉత్సవాలు జరుగుతాయి . ఆదివారం ధ్వజరోహణంతో ఉత్సవాలు ప్రారంభం కాగా వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఐనవోలు వైపు దారి పట్టి త రలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో సందడిగా మారింది. ఉదయం తెల్లవారు జామున భ క్తులు ఆలయానికి చేరుకొని విడిది చేశారు. వేకువ జామునే అర్చకులు స్వామి వారికి మేలుకొలుపు తర్వా త శైవాగమ పద్ధతిలో అభిషేకాలు స్వామివారి కళ్యాణం, రుద్రాభిషేకా లు నిర్వహించారు. భక్తులు పట్నాలు వేసి బోనం వండి భక్తిశ్రద్ధలతో మల్లన్నకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామాగ్రి ముట్ట చెప్పారు. ఒగ్గు పూజారులు పట్నా లు వేసి పూర్వీకులను స్తుతించారు. బోనాలపై దీపాలు వెలిగించి శివతాండవం చేస్తూ ఆల యం చుట్టూ ప్రదక్షణ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తజనంతో పోటెత్తింది.

### నేడు భోగి పండుగ

**స్వామివారికి ప్రత్యేక పూజలు..**

స్వామివారికి ఒగ్గుపూజారుల మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు నూతన వస్త్రాలంకరణ, విగ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, ధ్వజరోహణం, మహ న్యాస పూర్వక, ఏకదశ రుద్రా భిషేకం, మహా నివేదన, నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

**విధుల్లో ఆయా శాఖల అధికారులు..**

రెవెన్యూ, ఎక్సైజ్, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్ శాఖల అధికారులు జాతరలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా వరంగల్ ఈస్ట్‌జోన్ డిసిపి పులిగిల్ల రవీందర్, మాము నూర్ ఏసిపి తిరుపతి నేతృత్వంలో ప ర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్ జాతర నిర్వ హణను పర్య వేక్షించారు. మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే, టెస్కాబ్ చైర్మన్ మార్నేని... వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, రాష్ట్ర కోపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు, అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగ తం పలికారు. స్వామివారిని దర్శించుకున్నాక ఎమ్మెల్యే, టెస్కాబ్ చైర్మన్‌తోపాటు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులకు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలందజేశారు.

## విమలక్కపై కామెంట్లు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

### అరుణోదయ రాష్ట్ర కార్యవర్గం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 12, ప్రభాతవార్త:** వివిధ ప్రజా సమస్యలపై పోరాటాల్లో ముందుండి గొంతులో రక్తాలు కారుతున్నా, తెలంగాణ సాధన పోరాటాన్ని భుజాలకెత్తుకొని, బహుజన బతుకమ్మగా, ప్రజా గాయనిగా పేరును సంపాదించిన విమలక్కపై సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒక స్త్రీని, అదీ ఒక సీనియర్ సిటిజెన్‌ను, అదీ ప్రజల కోసమే జీవితాంతం పాటై, ఆటై, మాటై, పోరాటమై నిలిచిన విమలక్క పై ఈ దుర్మార్గమైన కామెంట్ ను ఖండిస్తూ, ఈ దుర్మార్గుని సైబర్ నేరస్తుడిగా పరిగణించి శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తన పోస్టును ఉపసం హరించుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిచో తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిం చారు. దీనిపై సైబర్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కూడా అరుణోదయ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించిందని తెలియజేస్తున్నాం. ఈ సంద ర్భంగా ఎవరికైనా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి ప్రజాస్వామిక హక్కు ఉందని చెబుతూనే బూతులు, శీలహలనన కామెంట్లు, దుర్భాషలు విషయాలను పక్కదారి పట్టిస్తాయని పేర్కొన్నారు. ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక(విజృంభణ), స్త్రీ విముక్తి లో భాగమైన అరుణోదయ 'వర్గీకరణకు సై అందాం మాలమాదిగల మొకట వుదాం'అంటూ ఒక సిడి రూపొందించి విడుదల చేసింది. రిజర్వేషన్ల సమర్థిస్తూ ఎస్సి సామాజిక వర్గంలో వర్గీకరణ ద్వారా అందరికీ సామాజిక న్యాయం అందాలని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రబోధించిన సామాజిక న్యాయానికిది ప్రామాణికమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా 'రిజర్వేషన్‌లు వర్గీకరణ ప్రజాస్వామిక హక్కులు' అనే పుస్తకం విడుదల చేసింది. న్యాయమైన, చట్టబద్ధమైన అంశాలుంటే స్వీకరించి మార్చుకుంటానని తెలియజేసింది. వంద పూలు వికసించాలి వేల భావాలు ఘర్షించాలని ఆశించింది. ప్రొఫెసర్ హర గోపాల్, అరుణోదయ రాష్ట్ర నాయకుడు రమేశ్ పోతుల, అధ్యక్షుడు మల్సూర్, జీవన్‌కుమార్, గంగారత్నం, రాకేశ్ సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సిఎం రేవంత్‌రెడ్డి మూలాలు ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్నాయి: ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 12:** సీఎం రేవంత్ రెడ్డి మూలాలు ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్నాయి. అందుకే మైనారిటీల పట్ల ముఖ్యమంత్రి వివక్ష చూపుతున్నట్లున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్‌లో ఆదివారం ఆమె మాట్లాడుతూ..గాంధీల కుటుంబాన్ని చూసి మైనారిటీలు కాంగ్రెస్ కు ఓట్లు వేశారు. కానీ, ఇప్పుడు మైనారిటీల నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ వమ్ము చేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఒక్క మతకల్లోలం కూడా జరగలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక మతకల్లోలాలు జరిగాయని ఆరోపించారు. మతకల్లోలాలను నిరోధించడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని? ప్రశ్నించారు. గంగా జమునా తెహజీబ్‌లా ఉన్న తెలంగాణలో చిచ్చుపెడుతున్నారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని మండిపడ్డారు. మైనారిటీ డిక్లరేషన్ అమలు ఏమైంది? మైనారిటీ డిక్లరేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్‌లో కనీసం 25 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. రూ.3000 వేల కోట్లు కేటాయించి కేవలం రూ.700 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. షాదీ ముబారక్ కింద రూ.1.6 లక్షలతో పాటు తులం బంగారం ఇస్తామని ఎగ్గొట్టారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు.

## ప్రధానోపాధ్యాయుడిపై దాడి కేసు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలి

### తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 12, ప్రభాతవార్త:** తుక్కుగుడా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పై దాడి చేసిన నిందితులపై ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే శిక్షి ంచాలని ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది.

ఈ సమావేశంలో ప్రొ. హరగోపాల్, ప్రొ. లక్ష్మీ ణ్నారాయణ, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కిష్టప్ప, న్యాయవాది విష్ణు, ప్రొ, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు రాములు, అనిల్ కుమార్, సోమయ్య, శ్రీపాల్‌రెడ్డి, వెంకన్న, నన్నెబోయిన తిరుపతి, లింగారెడ్డి, యాదగిరి, వెంకట్ , శంకర్, అశోక్ కుమార్, కె.ఎస్ ప్రదీప్, రవి కుమార్, రామకృష్ణ , ఆజాద్, మహేష్, విజయ్,, రఘునందన్ ,మామిడి నారాయణ, లక్ష్మణ్ సింగ్, రాజయ్య, కిషన్ రావు, దామోదర్, తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొ. లక్ష్మీ ణ్నారాయణ తదితరులు పాల్గొని ఈ తీర్మానాలను ఆమోదించారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో కళాశాలలో విశ్వవిద్యాలయాల్లో సమావేశాలు జరిపి మతోన్మాద శక్తుల జోక్యాన్ని వివరిస్తూ, ఖండిస్తూ బ్లాకు బాడ్జెస్ ధరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా మండల జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మతోన్మాద శక్తుల జోక్యం ఆపడానికి ఆఫీసర్లు, టీచర్స్, పౌర సమాజ వ్యక్తులతో ప్రభుత్వమే కమిటీలు వేయాలని, మతాలకు సంబంధించిన విగ్రహాలు, గుర్తులు విద్యాసంస్థలలో ఏర్పాటు చేయకూడదని, విద్యాసంస్థలలో టీచర్స్ మధ్య గాని, విద్యార్థుల మధ్య గాని కుల వివక్ష, కుల దురహంకార భావజాలాన్ని భావ జాలానికి వ్యతిరేకంగా అందరం కలిసి పోరాడాలని సమావేశం పిలుపునిచ్చింది.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్



వ్యవసాయ విద్యాలయంలో తనిఖీలు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

## వ్యవసాయ వర్సిటీలో పులి ఆనవాళ్లు లేవు

### తేల్చేసిన అటవీశాఖ అధికారులు

### ఆ జంతువు ఏమిటో త్వరలో నిర్ధారిస్తాం

**హైదరాబాద్ (అత్తాపూర్) జనవరి 12, ప్రభాతవార్త:** రాజేంద్రనగర్ వ్యవసాయ విద్యాలయంలో సంచరిస్తున్నది పులి కాదని అటవీ శాఖ అధికారులు తేల్చేశారు. శనివారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన గగన్‌పహాడ్ బస్తీకి చెందిన ఓ వ్యక్తికి ప్రొ. జయశంకర్ విగ్రహం వద్ద పులి దర్శనమిచ్చిందని, ఆ చిరుత అతని ముందు నుంచి నడుచుకుంటూ పొదల్లోకి వెళ్లినట్లు చెప్పడంతో వీధిలో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, వాకర్స్‌తో కలిసి పులి వెళ్లిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ అడుగుజాడలను చూసినవారు అది నిజంగానే పులి ఆనవాళ్లే అని అనడంతో అటు విద్యార్థులు, ఇటు స్థానికులను భయాందోళను గురిచేసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఆదివారం వ్యవసాయ విద్యాలయంలోని పులి సంచరిస్తుందన్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిరుత సంచరిస్తుందని చెప్పిన ప్రాంతాన్ని పరిశీలించామని అయితే అక్కడ పడిన ఆనవాళ్లు పులివీ కాదని తేల్చి చెప్పారు. ఎటువంటివి ఆనవాళ్లు లేవని, వ్యవసాయ విద్యాలయంలో సంచరిస్తున్న ఆ జంతువును గుర్తించడానికి ప్రత్యేకంగా తనిఖీలు చేస్తామని జంతువు ఎలాంటిదో నిర్ధారణకు వచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## తగ్గనున్న విద్యుత్ పంపిణీ నష్టాలు

### ఓపెన్ యాక్సిలరీ చార్జీల హేతుబద్ధీకరణ

### వినియోగదారులకు మెరుగైన సేవలు

### కొత్త నిబంధనలు తెచ్చిన విద్యుత్ మంత్రిత్వ శాఖ

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** విద్యుత్ రంగాన్ని సంస్కరించే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించడంతో పాటు, ఓపెన్ యాక్సలరీ చార్జీల హేతుబద్ధీకరణ, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రధానంగా గ్రీన్ హైడ్రోజన్ తదితర వాటితో విద్యుత్ ఉత్పత్తి చేపట్టే వాటికి ఇంధన ఇంటెన్సిటివ్‌ను ఇవ్వడంతో పాటు, పరిశ్రమలకు వ్యాపారాన్ని సులభతరం చేస్తోంది. ఇదే సమయంలో ఇంధన పరివర్తన మరియు భద్రతను పెంచేలక్ష్యంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ అవసరమైన చర్యలు చేపట్టింది. ఈ నిబంధనలు, విద్యుత్ పరివర్తన మరియు భద్రతను పెంపొందించే విస్తృత వ్యూహంలో భాగంగా, పంపిణీ కంపెనీల నష్టాలను తగ్గించేందుకు దోహద పడతాయని మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇప్పటికే చేపట్టిన చర్యల కారణంగా 2014లో 27 శాతం ఉన్న పంపిణీ నష్టాలను 2022-23 కాలంలో 15.41కి గణనీయంగా తగ్గించడంలో సహాయపడ్డాయి. కొత్త నిబంధనల ప్రకారం, ఇంటర్‌స్టేట్ ట్రాన్స్మిషన్ సిస్టంలో 25 ఐదు మెగావాట్ల కంటే తక్కువ లోడ్ కలిగిన వినియోగదారులు మరియు ఎనర్జీ స్టోరేజి సిస్టం పదిమెగా వాట్లను ఇప్పుడు స్థాపించుకోవడమే కాకుండా వాటిని నిర్వహించుకునే వీలును కల్పిస్తోంది. లైసెన్స్ అవసరం లేకుండా ట్రాన్స్మిషన్లు. ఇప్పటికే ఉత్పత్తిచేసే కంపెనీలు తదితర వాటికి అందుబాటులోకి తెస్తోంది. ఇది మరింత సరసమైన విద్యుత్‌తో పాటు, మెరుగైన గ్రిడ్ విశ్వసనీయత నుండి ప్రయోజనం పొందగలదని భావిస్తోంది. ఫలితంగా విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించి, వాటి సాధ్యతను పెంచుతాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలను అందించడానికి దారితీస్తుందని అన్నారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి, ఉద్యోగాల సృష్టిని పెంచడానికి, పునరుత్పాదక శక్తిని స్వీకరించడాన్ని వేగవంతం చేయడానికి, తద్వారా ఉద్గారాలను తగ్గించడానికి ఈ మార్పుల సామర్థ్యాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు. కొత్త నిబంధనలలోని మరో కీలక అంశం ఓపెన్ యాక్సరీ ఛార్జీల హేతుబద్ధీకరణ చేపటుతోంది. కొన్ని రాష్ట్ర నియంత్రణ కమిషన్లు విధించిన అధిక ఛార్జీలు గతంలో వినియోగదారులచే ఓపెన్ యాక్సలరీలను సమర్థవంతంగా ఉపయోగిం చడాన్ని అడ్డుకున్నాయి. అదనం గా, నియమాలు ఖర్చు ప్రతిబింబించే టారిఫ్లను తప్పనిసరి చేయడం ద్వారా విద్యుత్ రంగం ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తాయని స్పష్టం చేస్తున్నారు. ఆమోదించ బడిన వార్షిక రాబడి అవసరాలు మరియు ఆమోదించబడిన టారిఫ్ల నుండి అంచనా వేయబడిన వార్షిక రాబడి మధ్య ఏదైనా అంతరం సహజ వైపరీత్యాల వంటి అసాధారణ పరిస్థితులలో మినహా కనిష్టంగా ఉంచబడు తుందని వారు నిర్ధారిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆదాయ అంతరాలను సకాలంలో పరిసమాప్తికి నిబంధనల ఫ్రేమ్‌వర్కును అందిస్తాయి.

## ప్రభుత్వం 1/2005 చట్టాన్ని రద్దు చేయాలి

### ప్రాథమిక స్థాయిలోనే తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల పోస్టులను మంజూరు చేయాలి

### ఆర్‌యుపిపి రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వెంటనే 1/2005 చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ(ఆర్‌యూపీపీ తెలం గాణ) డిమాండ్ చేసింది. ప్రాథమిక స్థాయిలోనే తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల పోస్టులను మంజూరు చేయాలని ఆర్‌యూపీపీ రాష్ట్ర అధ్యక్షులు మహ మ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుల్లపల్లి తిరుమల కాంతికృష్ణ డిమాండ్ చేశా రు. ఆర్‌యూపీపీ రాష్ట్ర కార్యవర్గం ఆదివారం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకుంది. హైదరాబాదులో జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో సీనియర్ సభ్యులు కమటం లక్ష్మణ్‌గౌడ్, ఇలావుద్దీన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమావేశంలో అబ్దుల్లా రాష్ట్ర అధ్యక్షులుగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాంతి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కోశాధికారిగా నాగుల బిక్షపతి ఎన్నికయ్యారు. ప్రభుత్వం వెంటనే 1/2005 చట్టాన్ని రద్దుచేయాలని.. మిగిలిపోయిన 670 భాషాపండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ)లుగా ప్రక టించి పదోన్నతులు కల్పించాలని తీర్మానించినట్టు తెలిపారు.

## రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ సర్కారు

### నాయకులు గ్రామాల్లోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని నిలదీయాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రేవంత్‌రెడ్డి సర్కారు రైతులను నట్టేట ముంచి సిగ్గులేకుండా సంబరాలు చేయమంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డితో పాటు రాహుల్ గాంధీ సైతం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని నిలదీయాలన్నారు. మూడు పంటలకు రైతు భరోసా ఇవ్వల్సి ఉండగా ఒక్క పంటకు కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. ఉపాధి హామీలో సైతం కూలీలకు నష్టం చేస్తున్నారని తెలిపారు. దేవుళ్ల మీద ప్రమాణం చేసిన సిఎం నేటికీ పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదన్నారు. రేవంత్‌రెడ్డి బుకాయింపులు మాని ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయాలన్నారు. రైతులను అడుగడుగునా దగా చేస్తూ నట్టెట ముంచుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారును రైతులు తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టిని మళ్లించేందుకు హింసా రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. కౌశిక్‌రెడ్డి, అల్లు అర్జున్ ఇళ్లపై బిఆర్‌ఎస్, బిజెపి కార్యాలయాలపై కాంగ్రెస్ గుండాలు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం కంటే సిఎంకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమయ్యాయని...రాష్ట్రాన్ని రావణకష్టంగా మారుస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వా దాడుల సంస్కృతి మారకుంటే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. రాష్ట్రపతి పాలన పెట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలన్నారు. రాష్ట్రంలో క్రైం రేటు 23 శాతం పెరిగిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, పార్టీ నాయకులు గుండు భూపేష్, కొండం సంపత్‌రెడ్డి, కాముని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 9, 10 తేదీల్లో ఎఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు

### సంఘం రాష్ట్ర కార్యాలయంలో కరపత్రాల ఆవిష్కరణ

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఐఎస్‌ఎఫ్) జాతీయ సమావేశాలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. జాతీయ సమితి సమావేశాలను ఫిబ్రవరి 9, 10 తేదిల్లో హైదరాబాద్ నగరంలో నిర్వహించాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కమిటీ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగే ఎఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. కేంద్రంలో ప్రధాని మోడీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం-2020 పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తూ.. విద్య కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణతోపాటు కాషాయికరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తుందని మండిపడ్డారు. దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. తక్షణమే జాతీయ నూతన విద్యావిధానాన్ని ఉపసహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

13-1pg10exHB.qxd:13-1pg10exHB.qxd 01/01/01 9:23 AM Page 1





## వరల్డ్ బ్యాడ్మింటన్.. సెమీస్‌లో భారత్ స్టార్ జోడీ ఓటమి

**ఢిల్లీ:** కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనుకున్న భారతబ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయి రాజ్-చిరాగ్ శెట్టికి నిరాశ ఎదురైంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సాత్విక్-చిరాగ్ జంట సెమీ ఫైనల్లో పరాజయం పాలైంది. కౌలాలంపూర్‌లో జరిగిన సెమీ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 10-21, 15-21తో దక్షిణా కొరియాకు చెందిన కిమ్ వన్ హో-సియో సెయంగ్ జే జోడీ చేతిలో ఓడింది. 40 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్రప్లేయర్ చిరాగ్‌స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేక పోయారు. గత ఏడాది ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరిన భారతషట్లర్లు ఈసారి సెమీస్‌తోనే ఇంటిదారి పట్టారు.



## హాకీ ఇండియా లీగ్‌లో.. హైదరాబాద్ తూఫాన్స్ గెలుపు

**ఢిల్లీ:**హాకీఇండియా లీగ్‌లోహైదరాబాద్ తూఫాన్స్ జట్టు మూడో విజయం ఖాతాలో వేసుకుంది. రూర్కెలాలో హోరాహోరీగా సాగినపోరులో హైదరాబాద్ తూఫాన్స్ షూటౌట్లో సూర్మా హాకీ క్లబ్‌పై విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలవగా, విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన షూటౌట్లో 4-3 గోల్స్ తేడాతో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు తరపున అమన్‌దీప్ లక్రా (40వ నిమిషంలో) గోల్ సాధించగా, సూర్మా హాకీ క్లబ్ తరఫున నికోలస్ డెల్లా (8వ నిముషంలో) ఏకైక గోల్ కొట్టాడు.

ఆట ఆరంభంలోనే సూర్మా క్లబ్ గోల్ సాధించి ఆధిక్యంలోకి వెళ్లగా, మూడో క్వార్టర్లో హైదరాబాద్ జట్టు స్కోరు సమం చేసింది. దీంతో షూటౌట్ అనివార్యమైంది. తాజా సీజన్లో 5 మ్యాచ్‌లాడి 3 విజయాలు, 2 పరాజయాలు మూటగట్టుకున యూపీ రుద్రాస్ తరఫున ఫ్లోరిస్ (30వ నిమిషంలో), కాన్ రసెల్ (43వ నిముషంలో), టంగ్యూ కసిన్స్ (54వ నిముషంలో) తలా ఒక గోల్ కొట్టగా, ఢిల్లీ జట్టు తరఫున జాక్ వెటన్ (29వ నిముషంలో) ఏకైక గోల్ సాధించాడు.

## ఇంగ్లండ్‌తో టి20 సిరీస్‌కు.. టీమిండియా ఖరారు



**ఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో ఈ నెల 22 నుంచి తో జరగనున్న టీ20 సిరీస్‌కు బీసీసీఐ భారత జట్టును ఎంపిక చేసింది. కెప్టెన్ సూర్యకుమార్ నాయకత్వంలో, 15మంది సభ్యులతో కూడిన జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఈ జట్టులో సెలక్టర్లు షమీకి చోటు కల్పించారు. దీంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమీ జాతీయ జట్టులోకి రీ ఎంట్రీ ఇవ్వనున్నాడు. 2023 వరల్డ్ కప్‌లో గాయపడ్డ షమీ, ఆ తర్వాత టీమ్‌ఇండియాకు దూరమయ్యాడు. కొంత కాలం నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సిఏ)లో కోలుకున్నప్పటికీ పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించనందున సెలక్టర్లు ఎంపిక చేయలేదు. ఇక ఇటీవల కాలంలో షమీ సయ్యద్ ముస్తాక్ అలీ, విజయ్ హరారే టోర్నీల్లో రాణించి సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు. దీంతో షమీ ఎదురు చూపులకు ఎండ్ కార్డ్ పడింది. కాగా, దాదాపు 14 నెలల తర్వాత షమీ ఈ సిరీస్‌తో టీమ్‌ఇండియా తరపున బరిలోకి దిగనున్నాడు. కాగా యంగ్ ప్లేయర్ ఇషాన్ కిషన్‌కు మళ్లీ నిరాశే మిగిలింది. ఈ సిరీస్‌తో అయినా టీమ్‌ఇండియాలో రీ ఎంట్రీ ఇస్తాడని అనుకున్నా సెలక్టర్లు అతడికి మొండిచేయి చూపారు. 2023 డిసెంబర్‌లో ఇషాన్ కిషన్ టీమ్‌ఇండియా తరఫున ఆఖరి మ్యాచ్ ఆడాడు. ఇక 2025 ఐపీఎల్‌కు గాను అతడిని సన్ రైజర్స్ హైదరాబాద్ వేలంలో రూ.11.40 కోట్లకు కొనుగోలు చేసింది. అలాగే స్టార్ ప్లేయర్ రిషభ్ పంత్, శివమ్ దూబేను కూడా సెలక్టర్లు దూరం పెట్టారు. పంత్ స్థానంలో శాంసన్, ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్లుగా ఎంపిక అయ్యారు. ఇక దూబేకు బదులుగా ఇటీవల బోర్డర్ గావస్కర్‌లో అదరగొట్టిన నితీశ్ కుమార్ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపింది. ఇక యువ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్‌కు ప్రమోషన్ లభించింది. ఈ సిరీస్‌లో అతడు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇక 5 టీ20, 3 వన్డే మ్యాచ్‌ల సిరీస్ కోసం ఇంగ్లాండ్ భారత్‌లో పర్యటించనుంది. టీ20 సిరీస్‌కు ఖరారు చేసిన భారత జట్టులో సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, రింకు సింగ్, నితీశ్ కుమార్, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, మహ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్) కాగా టీ20 సిరీస్ షెడ్యూల్ ప్రకారం తొలి టీ20 ఈ నెల 22 కోల్‌కతాలో, రెండో టీ20 చెన్నైలో 25న, మూడో టీ20 రాజ్‌కోట్‌లో 28న, నాలుగో టీ20 పుణెలో 31న, ఐదో టీ20 ఫిబ్రవరి 2 ముంబయిలో జరగనుంది.

## మహిళా వన్డేలో.. భారత్ అత్యధిక స్కోర్

### ఐర్లాండ్ మ్యాచ్‌లో 50 ఓవర్లలో 370 పరుగులు

**ఢిల్లీ:** భారత మహిళల క్రికెట్ జట్టు వన్డేల్లో తమ అత్యధిక స్కోర్ నమోదు చేసింది. మూడు మ్యాచ్ల సిరీస్లో భాగంగా ఐర్లాండ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ నిర్ణీ 50 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 370 పరుగులు చేసింది. వన్డేల్లో టీమిండియాకు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ మ్యాచ్లో భారత టాపార్డర్ బ్యాటర్లు వీరవిహారం చేశారు. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగెజ్ (91 బంతుల్లో 102 పరుగులు, 12 ఫోర్లు) సూపర్ సెంచరీతో కదం తొక్కగా, తొలి ముగ్గురు బ్యాటర్లు స్మృతి మంధన (54బంతుల్లో 73 పరుగులు,10ఫోర్లు,2 సిక్సర్లు), ప్రతిక రావల్ (61 బంతుల్లో 67 పరుగులు, 8 ఫోర్లు, సిక్సర్),





హర్లీన్ డియోల్ (84 బంతుల్లో 89 పరుగులు, 12 ఫోర్లు) మెరుపు అర్ధ సెంచరీలతో రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో ఓర్లా ప్రెండర్‌గాస్ట్, అర్లీన్‌కెల్లీ తలో 2వికెట్లు పడగొట్టగా, జార్జినా డెంప్సే ఓ వికెట్ దక్కించుకుంది.కాగా, ఐర్లాండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238పరుగులు చేసింది. కెప్టెన్‌గాబీ లెవిన్ (92)ఆజట్టు తరపున అత్యధికస్కోర్ చేసింది. లియా పాల్ (59) అర్ధ సెంచరీతో రాణించింది. భారత బౌలర్లలో ప్రియా మిశ్రా 2 వికెట్లు, టిటాస్ సాధు, సయాలీ సత్ఘరే, దీప్తిశర్మ తలో వికెట్ పడగొట్టారు. ఛేదనలో భారత్ 34.3 ఓవర్లలో విజయతీరాలకు చేరింది. ప్రతిక రావల్ (89), తేజల్ హసబ్నిస్ (53 నాటౌట్) అర్ధ సెంచరీతో సత్తా చాటారు. స్మృతి మంధన (41) ఓ మోస్తరు స్కోర్ చేసింది. ఐర్లాండ్ బౌలర్ ఏమీ మగూర్ 3 వికెట్లు పడగొట్టింది. కాగా గతంలో భారత అత్యధిక స్కోర్ 2 వికెట్లు నష్టానికి 358 పరుగులుగా ఉంది. 2017లో ఇదే ఐర్లాండ్‌తో భారత్ 2 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది.



## ఐపిఎల్‌లో.. ఓపెనర్లుగా కోహ్లీ, ఫిల్ సాల్ట్

### రాయల్ ఛాలెంజర్స్ మాస్టర్ ప్లాన్

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2025) సీజన్ 18 ప్రారంభానికి ఇంకా 2నెలల సమయం ఉంది. అయితే, ఈ సారి మెగా వేలం ద్వారా డుప్లెసిస్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. దీంతో ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీకి కొత్త ఓపెనింగ్ జోడీతో బరిలోకి దిగడం ఖాయం.అంతకంటే ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ మాస్టర్ ప్లాన్ చేస్తోంది. ఈ ప్లాన్‌తో ఈసారి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఎవరు ఓపెనింగ్ చేస్తారో ఖరారైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు విరాట్ కోహ్లీ, ఫాఫ్ డుప్లెసిస్ ఓపెనర్స్‌గా బరిలోకి దిగనున్నారు. ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారని ధృవీకరించారు. ఈ విషయాన్ని ఆర్సీబీ హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ కూడా ధృవీకరించాడు. దీంతో ఈసారి కోహ్లీ, సాల్ట్ జోడీ ఆర్సీబీకి ఓపెనర్లుగా బరిలోకి దిగనున్నారు. విరాట్ కోహ్లీ ఐపీఎల్‌లో 113 మ్యాచ్‌లు ఓపెనర్‌గా ఆడాడు. 8 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు చేశాడు. అతను 45.81 సగటుతో మొత్తం 4352 పరుగులు చేశాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఓపెనర్‌గా నిలిచాడు. మరోవైపు ఫిల్ సాల్ట్‌కు ఇంగ్లండ్‌కు ఓపెనర్‌గా అనుభవం ఉంది. దీనికి తోడు గత సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఫిల్ సాల్ట్ 12 మ్యాచ్‌ల్లో ఇన్నింగ్స్ ప్రారంభించాడు. ఈసారి 4 అర్ధసెంచరీలతో మొత్తం 435 పరుగులు చేశాడు. ఇప్పుడు కింగ్ కోహ్లీఫిల్ సాల్ట్‌ను కలిసి రంగంలోకి దింపాలని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ మాస్టర్ ప్లాన్ వేసింది. కాబట్టి ఈసారి రాయల్ ఛాలెంజర్స్ ఓపెనర్ల నుంచి ఫైర్‌స్టార్మ్ ప్రదర్శనను చూస్తామని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

## ఒక్క రన్‌తో దుబాయ్ క్యాపిటల్స్ గెలుపు

### గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడిన ముంబయి ఇండియన్స్

**ఢిల్లీ:** ఇంటర్నేషన్ లీగ్ టీ20-2025 ఎడిషన్ (రెండో ఎడిషన్) తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్. దుబాయ్ క్యాపిటల్స్‌తో తలపడింది. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌కు పరాభవం ఎదురైంది. తప్పక గెలుస్తుందనున్న మ్యాచ్‌లో ఎంఐ ఎమిరేట్స్ పరుగు తేడాతో ఓటమిపాలైంది. విధ్వంసకర ఆటగాళ్లు నికోలస్ పూరన్, కీరన్ పోలార్డ్ జట్టులో ఉన్నా ముంబై ఇండియన్స్‌ను గెలిపించలేకపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన దుబాయ్ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి కేవలం 133 పరుగులు మాత్రమే చేసింది. దుబాయ్ ఆటగాళ్లలో బ్రాండన్ మెక్‌ముల్లెన్ (42 బంతుల్లో 58 రన్స్, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఒక్కడే అర్ధ సెంచరీతో రాణించాడు. రోవమన్ పావెల్ (25), దసున్ షనక (13), కెప్టెన్ సికందర్ రజా (10) రెండంకెల స్కోర్లు చేయగా, షాయ్ హోప్ 9, రొస్సింగ్టన్ 9, గుల్బదిన్ నైబ్ 2, ఫర్హాన్ ఖాన్ 2 (నాటౌట్) పరుగులు చేశారు. ముంబై పేసర్ ఫజల్‌హక్ ఫారూకీ 5 వికెట్లు తీయడంతో పాటు, పొదుపుగా బౌలింగ్ చేసి దుబాయ్ క్యాపిటల్స్‌ను ఇబ్బంది పెట్టాడు. అల్జరీ జోసెఫ్, జహూర్ ఖాన్‌కు తలో వికెట్ దక్కింది. ఇక స్వల్ప లక్ష్య ఛేదనలో ఎంఐ ఎమిరేట్స్ కూడా తడబడింది. ఆ జట్టు 23 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ





దశలో కెప్టెన్ నికోలస్ (40 బంతుల్లో 60 రన్స్, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) తన జట్టును గెలిపించుకునేందుకు విఫలయత్నం చేశాడు. పూరన్‌కు అకీల్ హోసేన్ (31 బంతుల్లో 30 రన్స్, 2 ఫోర్లు) కాసేపు సహకరించాడు. ఆఖరి ఓవర్‌లో పోలార్డ్ (15 బంతుల్లో 16 రన్స్, నాటౌట్) ఎంత ప్రయత్నించినా గెలిపించుకోలేకపోయాడు. దుబాయ్ క్యాపిటల్స్ పరుగు తేడాతో గెలుపొందింది. నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికిఎంఐ ఎమిరేట్స్ 7 వికెట్ల కోల్పోయి 132 పరుగులకే పరిమితమైంది. ఎమిరేట్స్ ఇన్నింగ్స్‌లో ముహమ్మద్ వసీం, ఆండ్రీ ఫ్లెచర్, అల్జరీ జోసెఫ్ డకౌట్లు కాగా, కుసాల్ పెరీరా 12, టామ్ బాంటన్ 7 పరుగులు చేశారు. ఓ దశలో ఎంఐ ఎమిరేట్స్ సునాయాసంగా విజయం సాధించేలా కనిపించింది. ఆ జట్టు 18 బంతుల్లో కేవలం 19 పరుగులు మాత్రమే సాధించాల్సి ఉండింది. చేతిలో ఐదు వికెట్లు ఉండేవి. ఈ దశలో గుల్బదిన్ నైబ్ (4-0-13-3), ఒల్లీ స్టోన్ (4-1-14-2) ముంబైకు గెలుపును దూరం చేశారు. 18వ ఓవర్ వేసిన గుల్బదిన్ నైబ్ రెండు కీలక వికెట్లు తీసి (పూరన్, అల్జరీజోసెఫ్) కేవలం ఐదు పరుగులు మాత్రమే ఇచ్చాడు. అనంతరం 19వ ఓవర్ వేసిన ఒల్లీ స్టోన్ మరింత పొదుపుగా బౌలింగ్ చేసి కేవలం ఒక్క పరుగు మాత్రమే ఇచ్చాడు. చివరి ఓవర్ వచ్చే సరికి ముంబై గెలుపుకు 13 పరుగులు అవసరమయ్యాయి. ఆ ఓవర్లో 11 పరుగులు మాత్రమే వచ్చాయి.

## కొత్త బడ్జెట్‌లో ఐటి పరిమితులపైనే ఉత్కంఠ

**న్యూఢిల్లీ, జనవరి 12:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం మూడో సారి కేంద్రంలో అధికారం చేపట్టింది. అనంతరం తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఫిబ్రవరిలో రెండోసారి తీసుకురానున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెడతారని సమా చారం. అయితే దీన్ని అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. 2047 నాటికి వీక్షి త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఇది ఉంటుందని భావి స్తున్నారు. బడ్జెట్‌లో



అందించే మినహాయిం పులపై అనేక ఊహాగానాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు శుభవార్త చెబుతారని సమాచారం. కొత్త పన్ను విధానంలో మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతారని భావి స్తున్నారు. పన్ను రేట్లు తగ్గించి సామాన్యులకు ఊరట లభిస్తుందని చెబుతున్నారు. పన్ను మినహాయింపు పరిమితిని రూ.50 వేలకు, పెద్దలకు రూ.లక్షకు పెంచే ప్రతిపాదన ఉంది. బీమా వ్యాప్తిని ప్రోత్సహించేందుకు కొత్త పన్ను విధానంలో 80డి సెక్షన్‌ను చేర్చుతారు. ఎందుకంటే ఆ సెక్షన్ కింద ఉన్న మినహాయింపులను చాన్నాళ్లుగా మార్చలేదు. ప్రస్తుతం పెరుగుతున్న ఆరోగ్య సమస్యల నేపథ్యంలో బీమాను ప్రోత్సహించే దుకు చర్యలు తీసుకుంటారు. హౌసింగ్ రుణాలపై వడ్డీ మినహాయింపు పెరిగే అవకాశం ఉంది. సెక్షన్ 24బీ కింద ఈ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచే అవకాశం ఉంటుంది. తద్వారా ప్రజలు స్థిరాస్తులను కొను గోలు చేసే అవకాశాలు పెరుగుతాయి. దీని వల్ల రియల్ ఎస్టేట్ రంగంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ముందుకు పయనించే అవకాశం కలుగుతుంది. మధ్యతరగతి ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఉపశ మనం కలిగించడానికి పన్ను శ్లాబ్ లలో ప్రభుత్వం కొన్ని మార్పులు చేయవచ్చు. వీటి ద్వారా వారి ఆదాయం పెరిగి, పొదుపు చేసుకునే అవకాశం కలుగుతుంది. ఆర్ అండ్ డీలో ప్రైవేటు పెట్టుబడిని ప్రోత్సహించడానికి కొత్త పథకం ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. క్రిప్టో కరెన్సీ, నాన్ ఫంగబుల్ టోకెన్ల (ఎన్‌ఎఫ్‌టీ)పై పన్ను విధించే స్పష్టమైన మార్గదర్శకాలను బడ్జెట్‌లో చేర్చుతారు. మూలధనం ఆస్తులకు సంబంధించి హోల్డింగ్ వ్యవధిని 36నెలల నుంచి 24 నెలలకు తగ్గించే అవకాశం ఉంది. అలాగే ఐపీవో ఆఫర్స్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్)లో అన్‌లిస్టెడ్ షేర్లహోల్డింగ్ వ్యవధిని రెండేళ్ల నుంచి ఏడాదికి తగ్గిస్తారు.

## టాప్‌గేర్‌లో 'ఇవి' కార్ల సేల్స్


**ముంబై, జనవరి 12:** ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్‌ఏడీఏ) వెల్లడించిన వివరాల ప్రకారం, దేశంలో గతేడాది 40.7 లక్షల యూనిట్ల విక్రయాలు జరిగాయి. వాటిలో ఎలక్ట్రిక్ కార్ల వాటా 2.4 శాతంగా ఉంది. వీటి వాటా 2023లో 2.1 శాతం మాత్రమే కావడం విశేషం. ఈ లెక్కల ప్రకారం గణనీయమైన పురోగతి లేనప్పటికీ ఆ మాత్రం పెరగడం విశేషమనే చెప్పవచ్చు. ఎందుకంటే గతేడాది ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో కొంత గందరగోళం ఏర్పడింది. పలు ఎలక్ట్రిక్ స్కూటర్లు కాలిపోయాయి. ఓ ప్రముఖ కంపెనీ వాహనాలతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కస్టమర్లు తమ బాధలను సోషల్ మీడియా వేదికగా అందరితో పంచుకున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలుచేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఆ సవాళ్లను ఈవీ మార్కెట్ అధిగమించిందనే చెప్పవచ్చు. ఒకటి, రెండు వాహనాల విషయంలో ఇబ్బందులు ఎదురైనా మిగిలిన వాహనాలు కస్టమర్ల ఆదరణ పొందాయి. తద్వారా ఈ విభాగంలో వాహనాల అమ్మకాలు బాగున్నాయి. టాటా మోటార్స్ 2024లో 61,496 యూనిట్లను ఈవీలను విక్రయించి మార్కెట్‌లో అగ్రగామిగా నిలిచింది. టాటా టియాగో హచ్, టిగోర్‌సెడాన్, పంచ్ మినీ ఎస్ యూవీ, నెక్సాన్, కర్వ్ ఎస్ యూవీలను కలిగి ఉన్న ఐసీఈ మోడళ్ల ఎలక్ట్రిక్ వెర్షన్లను విక్రయిస్తోంది. కొత్త ఏడాదిలో మరిన్ని మోడళ్లకు విడుదల చేయనుంది. జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటారు రెండో స్థానంలో కొనసాగుతోంది. ఈ కంపెనీ 2024లో దాదాపు 125 శాతం ప్రగతిని సాధించింది. 2023లో 9,526 యూనిట్లను విక్రయించగా, 2024లో వాటి సంఖ్య 21,484కు పెరిగింది. బ్యాటరీయూజ్ ఏ సర్వీస్, బ్యాటరీరెంటల్ మోడల్‌తో వచ్చిన విండర్స్ ఎస్ యూవీకి కస్టమర్ల ఆదరణ లభించింది.ప్రముఖ కంపెనీలైన మారుతీ సుజుకి, హ్యుందాయ్ నుంచి 2025లో కొత్త మోడళ్లు విడుదల కానున్నట్టు సమాచారం. వాటి ద్వారా మార్కెట్‌లో తమస్థానాన్ని మెరుగుపర్చుకోవాలని ఆ కంపెనీలు భావిస్తున్నాయి. మారుతీ ఇవిటా, హ్యుందాయ్ నుంచి క్రెట్ ఎస్ యూవీ ఎలక్ట్రిక్‌కార్లు విడుదల కానున్నాయి.



## వాణిజ్యం

## క్రెడిట్ స్కోరుపై అపోహలు వద్దు

**న్యూఢిల్లీ, జనవరి 12:** ఆర్థిక అవసరాలు నిత్యం పెరుగుతున్నాయి. వాటిని తీర్చుకునేందుకు చాలామంది రుణాలు తీసుకుంటున్నారు. ఆర్థిక సంస్థల రుణాలపై విధించే వడ్డీరేట్లు కూడా భారీగా ఉన్నాయి. మంచి క్రెడిట్ తీసుకుంటే తక్కువ వడ్డీకి రుణాలు పొందే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంచి స్కోరును సాధించాలంటే పరీక్ష ఉన్నా అపోహలు వీడాలని సూచిస్తున్నారు. ఉద్యోగంలో చేరిన కొన్ని నెలలకు సాలరీ ఆధారంగా క్రెడిట్ కార్డు ఆఫర్ ఉందని ఫోన్లు వస్తుంటాయి. దాంతో చాలామంది క్రెడిట్‌కార్డును తీసుకుంటున్నారు. తొలి కార్డును సంపాదించడమే కొంత కష్టం. ఆ తర్వాత కార్డు బిల్లులు సకాలంలో, ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థల క్రెడిట్ స్కోరును ఆధారంగా చేసుకుని తమ క్రెడిట్ కార్డులు చెల్లిస్తేముందుకు వస్తాయి. అయితే క్రెడిట్ స్కోరును పెంచుకునే దశలో చాలా మందికి కొన్ని సందేహాలున్నాయి. వాటిపై స్పష్టత ఉంటే స్కోరు దూసుకెళ్లేలా చేయవచ్చు.క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉండాలంటే రాబడి బావుండాలని అనుకుంటారు. కానీ, ఆదాయంతో సంబంధం ఉండదు. ఏటా రూ.6లక్షలు ఆదాయం ఉన్నవారికి మంచి క్రెడిట్ స్కోరు ఉండొచ్చు. ఏటా రూ.20లక్షల ఆదాయం ఉన్నవారి స్కోరు పిలవంగా ఉండొచ్చు. వారు గతంలో తీసుకున్న రుణాలు, వాటి చెల్లింపులు సరళి ఎలా ఉందనే దానిపై ఆధారపడి ఉంటుంది.ఆదాయంతో సంబంధం లేకుండా సకాలంలో బిల్లులు చెల్లించడం, తక్కువ క్రెడిట్‌వినియోగం స్కోరు పెరిగేందుకు దోహదపడుతుంది. క్రెడిట్ కార్డు పరిమితి పూర్తిగా వాడలేదు కదా, స్కోరు పడిపోయిందనే సందేహం వ్యక్తం చేస్తారు. నిజానికి కార్డు మొత్తం పరిమితి మేరకు వినియోగిస్తే స్కోరుపై ప్రభావం పడుతుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు లిమిట్ రూ.1 లక్ష అనుకుందాం. అందులో మీరు దాదాపు 40 శాతం అంటే రూ.40,000 వినియోగిస్తే మేలు. పరిమితి ఉందని రూ.90,000 వరకు పరిమితి వినియోగిస్తే మొదటికే మోసం వస్తుంది. ఏకమొత్తంలో అధికంగా క్రెడిట్ కార్డు వాడితే స్కోరు తగ్గే ప్రమాదం ఉంది.





గతంలో వాడి, ప్రస్తుతం వాడకుండా ఉన్న కార్డులను క్లోజ్ చేస్తే స్కోరు పెరుగుతుందనే వాదనలున్నాయి. ఇందులో నిజం లేదు. గతంలో మీరు వాడిన కార్డులపై క్రెడిట్ హిస్టరీ జనరేట్ అవుతుంది. మీరు కార్డు క్లోజ్ చేస్తే ఆహిస్టరీ కూడా డెలిట్ అవుతుంది. సుదీర్ఘ క్రెడిట్‌హిస్టరీ ఉంటే స్కోరు పెరిగే అవకాశం ఉంటుంది. రుణాలు తీసుకునే ముందు అన్ని తరహాలో ప్రాధాన్య మివ్వాలి. సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య బ్యాలెన్స్ పాటించాలి. హోమ్ లోన్స్, కారు లోన్స్‌కు సెక్యూర్డ్ లోన్స్‌గా పరిగణిస్తారు.

## పేరుకుపోతున్న నాన్-క్లెయిమ్ సొమ్ము..

### ఎల్ఐసిదే పెద్ద వాటా

**న్యూఢిల్లీ, జనవరి 12:** ఐఆర్‌డీఏఐ 2023 -24 వార్షిక నివేదిక ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఈ మొత్తం రూ.22,237కోట్లుగా ఉంది. గ్లోబల్ డేటా విశ్లేషణ ప్రకా రం 2018-19 నుంచి 2022-23 వరకు ఎల్ఐసీ వాటా 90శాతానికి పైగా ఉంది. మార్చి 31, 2024 నాటికి, భారతీయ జీవిత బీమారంగం రూ.20,062 కోట్ల నాన్‌క్లెయిమ్ మొత్తా న్ని కలిగి ఉందని వెల్లడైంది. నాన్‌క్లెయిమ్ మొత్తం అంటే బీమా పాలసీ మెచ్యూర్ అయిన తర్వాత కూడా పాలసీదారు లేదా వారి కుటుంబం తీసుకోని మొత్తం అని అర్థం. ఐఆర్‌డీఏఐ బ్యాంక్ ఇన్సూరెన్స్, డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లవంటి ఇతర ఛానెల్‌ల కంటే ఏజెంట్ల ద్వారా విక్రయించే పాలసీలు ఎక్కువ క్లెయిమ్ చేయని మొత్తాన్ని కలిగి ఉన్నాయని 2024 విశ్లేషణలో పేర్కొన్నారు. గ్లోబల్ డేటా అనాలిసిస్ ప్రకారం 2018-19 నుంచి 2022-23 వరకు ఎల్ఐసీ మొత్తం నాన్‌క్లెయిమ్ మొత్తంలో 90శాతానికిపైగా ఉంది. ఎల్ఐసీ 64.02శాతం మార్కెట్ వాటాతో భారతీయ జీవిత బీమా రంగంలో అగ్రగామిగా కొనసాగుతోంది. ఐఆర్‌డీ ఏఐ ఫిబ్రవరి16, 2024న క్లెయిమ్ చేయని మొత్తాలపై మాస్టర్ సర్క్యులర్‌కు మార్పులు చేసింది. అన్‌క్లెయిమ్ చేయని మొత్తానికి సంబంధించిన నిర్వచనం, దానిపంపిణీకి సంబంధించిన విధానాలను స్పష్టం చేసింది.

LIC भारतीय जीवन बीमा निगम LIFE INSURANCE CORPORATION OF INDIA

## ఆధార్‌తో పోస్టాఫీస్ ట్రాన్సాక్షన్లు..

**ముంబై, జనవరి 12:** పోస్టల్ శాఖ తమ కస్టమర్లకు అదిరే శుభవార్త అందించింది. పేపర్‌లెస్ ట్రాన్సాక్షన్లు నిర్వహించేందుకు కొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక నో యువర్ కస్టమర్ (కెవైసి) ప్రాసెస్, పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లు తెరవడం, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా ట్రాన్సాక్షన్లు నిర్వహించేందుకు ఈకొత్త టెక్నాలజీ ఉపయోగపడుతుంది. ఈ కొత్త ఇకేవైసీ వ్యవస్థను జనవరి 6, 2025 నుంచే అమలులోకి తీసుకొచ్చామని, అయితే, దేశవ్యాప్తంగా విడతల వారీగా అందుబాటులోకి తెస్తామని పోస్టల్ శాఖ తెలిపింది. మొదటి దశలో ఇకేవైసీ అందుబాటులోకి తెస్తామని, దీని ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోవడంపై ప్రధానంగా దృష్టి సారిస్తామని పోస్టల్ శాఖ తెలిపింది.ఇందులో కస్టమర్ల వివరాల నమోదు, వ్యక్తిగత పోస్టల్ ఆఫీస్ సేవింగ్స్ అకౌంట్లు తెరవడం వంటి ఉంటాయని పేర్కొంది. అవన్నీ ఆధార్ ఆధారిత కేవైసీ ప్రాసెస్ ద్వారా పూర్తి చేయవచ్చని పేర్కొంది. ఇక రెండో దశలో ఇకేవైసీ పనితీరు ఆధారంగా ఆధార్ అథెంటికేషన్ ప్రాసెస్ ద్వారా వివిధ రకాల ట్రాన్సాక్షన్లు నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తామని పేర్కొంది. ఇందులో సేవింగ్స్ అకౌంట్ తెరవడం,మూసివేయడం, రికరింగ్ డిపాజిట్లు, టైమ్ డిపాజిట్లు, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ వంటి వివిధ పథకాల ట్రాన్సాక్షన్లు ఆధార్ అథెంకేషన్ ద్వారా నిర్వహించేందుకు వీలు కల్పిస్తామని పేర్కొంది. జాయింట్, మైనర్, ఆథరైజ్డ్ టైప్ సేవింగ్స్ అకౌంట్లు తెరవడం లేదా క్లోజ్ చేయడం చేయవచ్చు. ఆయా అకౌంట్లలో ట్రాన్సాక్షన్లు నిర్వహించవచ్చు. అలాగే ఇ-బ్యాంకింగ్, ఎంబ్యాంకింగ్ వంటి సేవలు పొందడం, సేవింగ్స్ అకౌంట్లు ముసి వేయడం వంటివి పొందవచ్చు. కస్టమర్లు ఎవరైతే ఆధార్ ఇకేవైసీకు అంగీకరిస్తారో వారి ఆధార్ బయోమెట్రిక్ అథెంటికేషన్ యూఆర్‌ఎల్ క్రియేట్ చేయనున్నట్లు పోస్టల్ శాఖ తెలిపింది. ఈ పరిస్థితిలో యూనిక్ ఐడెంటిఫికేషన అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రిపోసిటరీ నుంచి కస్టమర్ల పేరు, డేట్ ఆఫ్ బర్త్, జెండర్, అడ్రస్, పిన్‌కోడ్ వంటివి సేకరించనున్నట్లు తెలిపింది. ఒక వేళ తండ్రి లేదా భర్త పేరు పొందలేక పోతే ఎడిట్ చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపింది.





Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14